శ్రీ ర స్తు

# తత్త్వ రహస్య ప్రభ

# శ్రీ శంకరాచార్య ప్రకరణమంలు



శ్రుతిస్మృతిపురాణానాం ఆలయం కరుణాలయం

నమామి భగవత్పాద శంకరం లోకశంకరం!

శ్రీరస్తు

తత్వరహస్యప్రభ

# శ్రీ శంకరాచార్య ప్రకరణములు



రచయిత:

మద్దులపల్లి మాణిక్యశాస్త్రి

ప్రచురణ

స్వధర్మ స్వారాజ్య సంఘం

29 బ్రాడ్వే, మద్రాసు-1

ప్రథమ ముద్రణ :
౧౦౦౦ ప్రతులు

ద్వితీయ ముద్రణ :
౧౦౦౦ ప్రతులు



దొరుకుచోటు :

మద్దులపల్లి మాణిక్య శాస్త్రి
మద్దులపల్లి వారి వీధి,
గవర్నరుపేట, విజయవాడ-2

వెల : రు. 40-00

ముద్రణ :

శ్రీ సాయి ప్రింటర్స్,
ఫౌంద్రివీధి, దుర్గాపురం
విజయవాడ – 4.



శ్రీ మేధా దక్షిణా మూర్తి

శ్లో॥ గురవేసర్వలోకానాం భిషజేభవరోగిణాం

నిధమేసర్వవిద్యానాం ధక్షిణామూర్తియేనః

"శ్రీ గురుదేవదత్త"

# పరిచయము

★★★★

లోకమున మానవుని ప్రగతికి విద్యాసంపత్తి నిదానభూతమను నంశము జగద్విదితము. అట్టి యధార్థ విద్యాసంపత్తి లుప్తప్రాయమున సాక్షాత్ కైలాసధాముడైన పరమేశ్వరుడు విద్యాశంకర రూపమున నవతరించి జగజ్జేగీయమాన మగునట్లు సమస్తోపనిషదర్థములను వ్యాఖ్యానించి తద్వారా దుర్మతములను ఖండించిరి. దయామయులగు నా యద్వైత గురుదేవులు భాష్యాదులద్వారా వ్యక్తపరచిన బోధలను సుగమముగా సార్వజనీనమగునట్లు బోధింపఁదలచి యనేక కృతు లొరిన్చరి, అందు శ్రీ దక్షిణామూర్తి స్తోత్రము. అపరోక్షానుభూతి. దశశ్లోకి, మనీషా పంచకము, సోపాన పంచకము. ఏకశ్లోకి యనునవి మిగుల ప్రాముఖ్యమైనవి. ఆ స్తోత్రరాజముల నుపనిషద్రహస్యములైన సకల యద్వైత విద్యాబోధతో నిక్షేపము గావించిరి. కాగా నేడట్టి శ్రీ భగవత్పాదుల స్తోత్రరూప యద్వైతకృతిని భక్తజనులఁ గోరికచే బ్రహ్మశ్రీ మాణిక్యశాస్త్రి మహోదయ లాంధ్రీకరించు టెంతయో ముదావాహము. వ్యాస సూత్రముముల శంకరరూపియగు భగవత్పాదులు తద్హృదయజ్ఞులై వ్యాఖ్యానించటంబోలె సాకల్య శంకర హృదయముననూ చానపద్ధతిలో గురుపరంపరగా గ్రహించిన శ్రీ శాస్త్రిగారు యనేక శాస్త్రీయాంశములను సర్వజన సుబోధమగునట్లు సద్వైత విద్య నంతయు రంభాఫలము వలచి చేతిలోపెట్టి నందించిన చందమున

నాంగీకరించిరనుట నతిశయోక్తి కానేరదని సహృదయులకు విజ్ఞప్తి చేయుచున్నాను. అస్మద్దేశికులగు శ్రీ శాస్త్రివర్యుల అసదృశ పాండిత్య గరిమ సకల విద్వజ్జన విదితము. నాటి శ్రీ జగద్గురు శృంగేరీ పీఠాధీశ్వరులగు అభినవ విద్యాతీర్థ. శ్రీ చరణులచే నేర్పాటుగావించబడిన శంకర జయంతి సందర్భమైన విజయవాడ లోని విద్వత్సభలోని శాస్త్రార్థ గోష్ఠియే పండిత మాణిక్యమని శాస్త్రివర్యుల నామధేయ మన్వర్థపరచినది. శ్రీ మాణిక్యశాస్త్రిగారు విద్వన్మాణిక్యమే. శ్రీ శాస్త్రిగారు తర్క శాస్త్రమున క్రోడపత్రాది యుద్గ్రంథములకు, వేదాంతశాస్త్రమున సిద్ధి బ్రహ్మానందీయము లకున్ను సుగమముగా సంస్కృతమున వ్యాఖ్యానించు పాటవము గల ధీశాలురనుట నతిశయోక్తికానేరదు. భక్తసులభులైన శ్రీ శాస్త్రి వర్యులు పండిత పామర జనోపయుక్తముగా తమ నైజపాండిత్య గరిమతో యద్వైత విద్యనిం దభివర్షించిరి. "విశ్వం దర్పణ దృశ్య మాన నగరీతుల్యం" అనే మొదటి శ్లోకముననే వివర్త పరిణామ వాదములకుగల విభేదము మున్నుగా గల వేదాంతశాస్త్ర పడికట్లనుఁ దేటతెల్లముగా చాటుతూ వేదాంత సిద్ధాంత భాగములను వ్యక్తపరచి వివర్తమునుఁ దేటగా సిద్ధాంతీకరించిరి. మరియు నితర శ్లోకములలోను సాంఖ్యాది మతములను చాటుతూ నద్వైతగరిమను బహుముఖములఁ దేటగాఁ బొందుపరచిరి. ఒక విషయమేమి? వేదాంత శాస్త్రమందుగల మాయావాదము, జీవబ్రహ్మైక్యము మొదలగువాటిని సాంప్రదాయ పద్ధతిలో శాస్త్రమంతయు పామరజనులకును సుబోధమగునట్లు నందించిరి అపరోక్షానుభూతిని తురీయభూమికలోని యఖండానంద రసము నొల్కఁబఁజేసిరి. ఈ గ్రంథరాజముతో తెలుగువాణి కొక క్రొత్తవన్నె దెచ్చిరని దెలియజేయుటకు సంతసించుచున్నాను

కూలంకష బ్రహ్మవిజ్ఞానసంపత్తినొందగోరు భక్తజనుల కత్యంతోపయుక్తమగు ననుటలో సందియ మావంతయులేదని భావించువాడను. తెనుగున వేదాంత శాస్త్రము నా యా గ్రంథముల ననువదించువారు మున్ను లేకపోలేదుగాని నీరీతి సాంప్రదాయ నిబద్ధమగునట్లు వేదాంతశాస్త్రమునంతయు నందించిన దీగ్రథమేనని నొక్కివక్కాణించవచ్చును, వేయేల శ్రీ శాస్త్రి మహోదయులు బహుముఖముల దమప్రజ్ఞ నిందు బొందుపరచిరి. తెలుగువాడ యదృష్టమని దలంచువాడను.

ఇట్లు.

సాంగస్వాధ్యాయ, వేదార్థరత్న. పండిత,

**పొణుకుపాటి లక్ష్మీనరసింహ శాస్త్రి**

ప్రిన్సిపాల్.

శంకర విద్యాలయం, బాపట్ల.



శ్రీ శంకరాచార్యుల వారు

# ఉద్దేశ్యము

మానవజీవితంలో సంపాదించదగిన ధర్మార్థ కామ మోక్షములను నాలుగు పురుషార్థములలో మోక్షమే నిత్యనిరతిశయ పురుషార్థమని అసేతు హిమాచలపర్యంత భూమండలమందలి ఆస్తిక మహాశయ లందరికిని తెలిసన విషయమేగాని నూతనముకాదు ఇట్టిమోక్ష పురుషార్థము అద్వైత సిద్ధాన్తమందు అవిద్యా నివృత్త్యుపలక్షితమగు సత్య జ్ఞానానంద స్వరూపావస్థానమేకాని లోకాంతర ప్రాప్తిమున్నగునవి కావు. అనగా మూలాజ్ఞానము పోయినతరువాత మిగులు ఆత్మస్వరూపమే మోక్షమని తాత్పర్యము. ఇట్టి మోక్షమునకు ఆత్మానుభూతియే సాధనముగాని ఇతరములు సాధనములు కావని శ్రుతిస్మృతీతిహాసములవలన అభిజ్ఞులకర్థమైన విషయమే.

ఇట్టి విజ్ఞానము దుర్మతప్రభావముచే ఖిలప్రాయమైన దశయందు అనగా ఈ ఘోరకలియందు రెండువేల సంవత్సరములకు పూర్వము దుర్మతములను ఖండించి పరమపురుషార్థోపయుక్తమగు అద్వైత సిద్ధాంతమును ఉద్ధరించుటకై సాక్షాజ్జగదీశ్వరుడు శ్రీ శంకరాచార్య రూపముగా నవతరించి ప్రస్థానత్రయ భాష్యములను వ్రాసి సామాన్య విజ్ఞానముగల వారికికూడా అద్వైతసిద్ధాంతమందు బాటగునటుల అనేక వేదాంత ప్రకరణములను వ్రాసియుండిరని చాలామంది విజ్ఞులకు విదితమైన విషయమే.

నేనుకూడా ఈ గ్రంథమందు వ్రాసియుంటినికూడ. కలిప్రభావము చేత క్రమముగా ఈ ఆధ్యాత్మిక బ్రహ్మవిద్య సంప్రదాయముగా పఠన పాఠక్రమము లేకపోవుటచేత చాలాభాగము కృశించినది. సామాన్యులు భాషాంతరీకృత వేదాంతగ్రంథములను చూచిరి. ఆ విజ్ఞానముతోనే కొంతమందికి ప్రబోధించుటచేతకూడ సంప్రదాయ విరుద్ధమగు స్ఖాలిత్యము లేర్పడినవి. ప్రస్తుతకాలంలో ఈ లోపములు అనివార్యములు, అపరిహార్యములై యున్నవి. మరల ఈశ్వరానుగ్రహమువలన ఏనాటికైనను గురుశిష్య సంప్రదాయానుసారముగా పాఠప్రవచనపద్ధతి ప్రబలముగా ప్రచారములోకి వచ్చినప్పుడే ఈ విద్యలకు అభివృద్ధి కలుగునుగాని వేరుమార్గము లేదనిపించుచున్నది. పాఠప్రవచనసంప్రదాయం తగ్గిపోవుటచేత అనేక ఆధ్యాత్మిక వేదాన్తగ్రంథములు ప్రచారంలోలేక మరుగుబడిపోయినవి. ఆ గ్రంథములయందలి గంభీరవిషయములు లుప్తప్రాయము లయినవని వేరే చెప్పనక్కరలేదు. అందుచేతనే అనేక గ్రంథములు తిరిగి ముద్రణలేకుండా పోయినవి. వినోదప్రధానమగు ఈ కలికాలంలో విజ్ఞాన ప్రధానమగు గ్రంథములు వెనుకపడుట ఆశ్చర్యముకాదనికూడా అనిపించుచున్నది. మహానుభావులు వ్రాసిన గ్రంథములనే చదివేవారులేక నిరర్థకప్రాయముగా నున్న ఈ కాలంలో నూతన గ్రంథరచన చేయు ప్రయత్నం నిజమైనదృష్టితో ఆలోచిస్తే విఫలమేకాని సఫలంకాదని భావించి ఉదాసీనుడనై యుంటిని. ఈ స్థితిలో అనేకమంది పెద్దలవలనను, నా వలనను తత్త్వగ్రంథములను శ్రవణంచేసి అద్వైత వేదాన్తశాస్త్రమందలి సారమును పూర్వజన్మ సత్సంస్కారమువలన బాగుగా గ్రహించి అవకాశమున్నంతలో మనుష్యజన్మలో తత్త్వవిచారంచేయుట చాలాముఖ్యమని నిశ్చయముగల చాలా ఉత్తములగు పారమార్థికదృష్టి ప్రధానులగు ఆస్తికులు, నన్నీవిధముగా ప్రోత్సాహము చేసిరి.

శంకరాచార్యులవారు వ్రాసిన దక్షిణామూర్తిస్తోత్రము మొదలగు ప్రకరణగ్రంథములున్నవి. వాటికి కొన్ని టీకాతాత్పర్యము లున్నవి. గాని విద్వాంసులయినవారు విశదముగా వ్రాసిన బాగా యుండును గనుక మీరు తప్పక వ్రాయవలయునని గట్టిగాచెప్పిరి. దక్షిణామూర్తిస్తోత్రమునకు. అపరోక్షానుభూతికి. దశశ్లోకికిని, సోపాన పంచకమునకు మనీషా పంచకమునకును. ఏక శ్లోకికిని తాత్పర్య వివరణమును వ్రాయమనిరి. ఆప్తులైన ఆస్తికులగువారు మీరు వ్రాసిన చాలా ఉపకారముగా నుండునని నన్ను విశేషముగా ప్రోత్సాహము చేసినను, ఈ కాలంలో శ్రమపడి వ్రాసినను యెవరు చుస్తారని ఉపేక్షించితిని. ఉపేక్షించవద్దు తప్పక వ్రాయమని మరల ప్రోత్సహించుటచేత శంకర భగవత్పాదులవారు వ్రాసిన దక్షిణా మూర్తిస్తోత్రమునకు ప్రతిపధార్థమును వ్రాసి కొన్ని విశేషములతో ప్రతి శ్లోకమునకు వేరువేరుగా తాత్పర్య వివరణములనుకూడా వ్రాసితిని. అపరోక్షానుభూతికి ప్రతిపదార్థముకూడా తెలియునటుల ప్రతి శ్లోకమునకును తాత్పర్య వివరణమును, మాత్రమే వ్రాసితిని. దశశ్లోకికి ప్రతిపదార్థమును వ్రాసి తాత్పర్యవివరణమునుకూడా వ్రాసితిని. సోపాన పంచకముకూడా ప్రతిపదార్థమును వ్రాసి తాత్పర్యనిరూపణమును కూడా వ్రాసితిని. ఇక్కడికే పుస్తకం పెద్దదయ్యేటట్లు కనిపించినది. అందుచేత సాధ్యమైనంత వరకు తగ్గించి వ్రాసిన అందరును చదువుదురని విస్తారమునుతగ్గించి మనీషా పంచకమునకు ముందు శంకరాచార్యచరిత్ర సంగ్రహముగా వ్రాసి, మనీషాపంచకమునకు తాత్పర్యవివరణమును మాత్రమే వ్రాసితిని.

కొన్నింటికిమాత్రమే సంస్కృతవ్యాఖ్యానము లభించినవి. వాటిని చూచియుంటిని. అట్టి వ్యాఖ్యానములు కొన్నిటికిలేవు ప్రయత్నంకూడా చేయులేదు. లభించినంతవరకు పూర్వవ్యాఖ్యానములను అనుసరించియే వ్రాసితిని. తాత్పర్యవివరణలో సిద్ధాన్తమునకు విరో

ధంలేకుండా కొన్ని విశేషములను వ్రాసితిని. శ్రీ శంకరాచార్యుల వారి భాష చాలా ప్రసన్న గంభీరమైనది. ప్రసన్నముగా నున్నందు వలన శ్లోకములు సులభముగా నున్నట్లు కనిపించును అర్థముకూడా అగునుగాని, విషయం చాలా గంభీరముగా నుండును. గనుకనే తాత్పర్య వివరణమును వ్రాసితిని. సంస్కృత భాషయందు పరిచయం లేనివారికి కొంత సామాన్యముగా పరిచయం కలవారికిని బాగుగా అద్వైతసిద్ధాంత మర్థమగుటయే ప్రధానోద్దేశ్యముగా పెట్టుకొని వ్రాసితినిగాని వేరుకాదు. సర్వజ్ఞులగు శంకర భగవత్పాదులవారు వ్రాసిన ప్రకరణములకు వారి తాత్పర్యమును వివరించు సామర్థ్యం లేక పోయినను దైవమందే భారంవేసి దైవానుగ్రహంవలన స్ఫురించిన విషయములనే వ్రాసితిని. అందరికిని సులభముగా అర్థమగుటయే ప్రధానోద్దేశ్యంగా పెట్టుకొని కేవల గ్రాంధికభాషనగాని, కేవల (నవనాగరిక) వ్యావహారిక భాషనుగాని ఉపయోగించకుండా కొంత గ్రాంధికముగాను, కొంతవ్యావహారికముగానుండునటుల నాసామర్థ్యము (ననుసరించి యథాశక్తి) యథామతిగా వ్రాసితిని.

గనుక విజ్ఞులు భాషాలోపములను, అచ్చులు, హల్లులు మొదలగు అక్షర స్ఖాలిత్యములను దోషములను పరిగణించక విషయమునే, గుణమునే ప్రధానముగ గమనింప గలరని విశ్వసించుచున్నాను. ఇది ఆధ్యాత్మిక వేదాంతగ్రంథము గనుక ఒకమారు చదివి గొడవగానున్నదని నిరుత్సాహపడక. నాలుగు మూడుసార్లు ఈ పుస్తకంలో వ్రాసిన శంకరాచార్య ప్రకరణములను, తాత్పర్యవివరణమును చదివినయడల అద్వైత సిద్ధాంతం కరతలామలకముగా అర్థమై ఇతర యే వేదాంత గ్రంథములను విన్నను, చూచినను అతి సులభముగా తెలిసికొనగలరని అట్టి విజ్ఞాన మీ గ్రంథము వలన కలుగునని చెప్ప

ఉలో అతిశయోక్తికాదని, నిరహంకారముగా శంకర రచనా గాంభీర్య మునే దృష్టిలో పెట్టుకొని ఇట్లు వ్రాసితినని సహృదయులు గ్రహించ గలరని విశ్వసించుచున్నాను. ఈకాలంలో కొందరికి ప్రబోధ చేయుట చాలా అవసరమనికూడా; ఆత్మీయుల ప్రోత్సాహమువలన నాకు విజ్ఞానప్రధానమగు, మోక్షోపయుక్తమగు ఈ గ్రంథమును ఆస్తికులందరు తీసికొని చదువవలయునని మిత్రభావముతో కోరు చున్నాను ముద్రణ అయిన తరువాతకూడా పరిశీలించి తప్పొప్పు లపట్టిక వ్రాసియున్నాను. దీనినిబట్టి నిర్దుష్టముగా చూడవచ్చును ఈ తప్పొప్పులపట్టికచూచి గ్రంథమును సరిదిద్దుకొని ఈ గ్రంథ మును ఆమూలాగ్రముగా కొన్ని పర్యాయములు చూచినయడల అద్వైతసిద్ధాంతపరిజ్ఞానము సామాన్యులకుకూడా సుదృఢముగా కలుగుననే విషయము ఈ గ్రంథము సవలోకించువారు స్వయము గానే గ్రహించగలరని నా విశ్వాసము. ఈ దక్షిణామూర్తి స్తోత్రము మొదలగు అద్వైత వేదాంత ప్రకరణములకు తాత్పర్య వివరణ వ్రాయుచు ఆయా యర్థములను బలపరచుటకు శంకరాచార్యులవారు రచించిన మరికొన్ని శ్లోకములను ఇతరవచనములనుకూడా ఉదహ రించి వాటిపై తాత్పర్యముకూడా వ్రాసితిని. మరియు భగవత్పాదుల వారు కొన్ని ప్రకరణములలో ఒక ప్రకరణమున చెప్పినవిషయము లను ఇతర ప్రకరణములయందుకూడా దయతో ప్రతిపాదించి యుండిరి. గనుక ఆ ప్రకరణములకు తాత్పర్యమువ్రాయుచు సుబోధకొరకై విశేషముగా ఆయా ప్రకరణములయందు అవసరాను సారముగా ప్రతిపాదించిన విషయమునే ప్రతిపాదించినట్లున్నను పునరుక్తిగా గ్రహింపకుందురని విశ్వసించుచున్నాను. గనుక అద్వైతాభిమానులెల్లరు శ్రీ శంకరాచార్య ప్రకరణ తత్వరహస్య

ప్రభ యను ఈ ఆంధ్రతాత్పర్యవివరణమును గుణగ్రహణ దృష్టితో చూడగలరని విశ్వసించుచున్నాను. ఈ తత్వరహస్యప్రభయను తాత్పర్య వివరణమును వ్రాయమని నన్ను ప్రోత్సహించిన ఆస్తిక మహాశయులకు సర్వేశ్వరుడు సర్వదా ఆయురారోగ్యైశ్వర్యాది సకల సంపదలను ఆధ్యాత్మిక విద్యాసంపదనుకూడా అనుగ్రహించు గాక యని కోరుచున్నాను. ప్రతిపదార్థ సహితమయిన ఈ తాత్పర్య వివరణమునకు తత్వరహస్యప్రభయని పేరు పెడితిని.

విజయవాడ–2.
24-6-72

ఇట్లు,
మద్దులపల్లి మాణిక్యశాస్త్రి



శ్రీ బి వి. ఎస్. ఎస్. మణి దంపతులు

(స్వధర్మ స్వారాజ్య సంఘ డైరెక్టరు)

# OBJECTS OF
# SWADHARMA SWAARAJYA SANGHA

Sri Kowtha Suryanarayana Row started his life as a school teacher having been the son of a wealthy father on a Paltry sum of Rs. 7/- Per mensem and by dint of his hard and disciplined life and work rose to be one of the leading industrialists of South India. He Pioneered many industries and was responsible for the establish-memt of India Commerce and industries Co. Pvt. Ltd, at Madras, Kowtha Products, Beehive Foundry etc. Kowtha steel products have to their credit a lot of Import Subetitution developments.

Swadharma Swaarajya Sangh was established by Sri Kowtha Suryanarayana Row in 1930 with a view to institutionalise all his religious, educational, chari-table works. He has donated more than 80% of his self-earned wealth to the Sangha for the above purpose, as a token of gratitube to Lord Sri Krishna whom he took as his guiding spirit, as his benefactor both in his material and spiritual life. Sri Kowtha was known for his ready wit, strict discipline, charitable disposition without attracting any publicity. A few of his close friends used to call him "Industrial Vedantin" The Swadharma Swaarajya Sangha has created schools, instituted scholarships, founded social institutions runs journals and printing institutes. Multi farious are the conduits through which Sri Kowtha Suryanarayana Row's munificence flows into the pastures of culture that is India.

Some of the great and profound Advaita texts like Khandana-Khanda-Kabya have been introduced by him for Vakyartha in the traditional style in the yearly Vidvat Sadas he had organised. Many pandits of the stature of ahanohopadhyava Anantakrishna Sastri, Sri Venkatesa Satri of the Mysore Samasthan, Sri Dravida Rajeswara Sastri have all appreciated his interest and anxiety to mainciat and continue the pres- tine glory of Bhanatiya Culture whose ultimate aim is to obtain nitya niratiscyananda.

Sri kowtha Suryanarayana Row's great work is being continued by his worthy grandson Sri B. V. S. S. Mani. Sri B. V. S. S. Mani came forward generously to publish the text of istasiddhi, now long out of print, along with translation of the work with notes and an introductory Essay in English bySriDr.P.K.SUNDARAM.



శ్రీ గానుగపాటి పరబ్రహ్మరావు పంతులుగారు

జననం : 2-10-1900 మరణం : 8-3-1986

శ్రీ గానుగపాటి పరబ్రహ్మరావు చారిటబుల్ ట్రస్టు

విజయవాడ - 520 002

శ్రీ మహాగణాధిపతయే నమః

# శ్రీ దక్షిణామూర్తి స్తోత్రం

శ్లో॥ శుక్లాంబర ధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం
ప్రసన్న వదనం ధ్యాయే త్సర్వవిఘ్నోప శాంతయే॥

శ్లో॥ భజే మహిని ప్రియైకం ముహురన్యం పయోధరం
మార్గంతం బాలమాలోక్య హసంతా వాది దంపతీ॥

శ్లో॥ శ్రీరామ చరణద్వంద్వ మద్వయానంద సాధనం
నమామి యద్రజోయోగా త్పాషాణో-పిసుఖం గతః॥

శ్లో॥ గురవే సర్వలోకానాం భిషజే భవ రోగిణాం
నిధయే సర్వవిద్యానాం దక్షిణామూర్తయే నమః॥

శ్లో॥ యద్వక్త్ర మానససరః ప్రతిలబ్ధ జన్మ
భాష్యారవింద మకరంద రసంపిబంతి,
ప్రత్యాశ మున్ముఖవినీతవినేయ భృంగాః॥
తాన్ భాష్యవిత్తక గురూన్ ప్రణమామి మూర్ధ్నా॥

సర్వజ్ఞుడైన పరమేశ్వరుడు సంసార సముద్రమందు నిమగ్నులై బహు దుఃఖ పరంపరలను, జన్మ మరణములను అనుభవించే జీవులను చూచి, అనేక దుర్మతములతో లోకమంతయు నిండియుండే సమయంలో

ప్రజలందరూ మోక్షమార్గమును మరచి, దుర్మతములనే సన్మతములనుగా గ్రహించి, శాస్త్రవిరుద్ధ మార్గములయందు ప్రవర్తించుచున్న ప్రజలదుస్థితిని కూడా చూచి, పరమానుగ్రహముకలవారై, దుర్మతములను ఖండించి, సన్మతములను స్థాపించి మోక్షమార్గమును చూపించి ప్రజలందరిని ఉద్ధరించుటకు, శంకరాచార్య రూపముతో భూలోకమం దవతరించిరి.

శంకరాచార్యులవారు జన్మతోనే వైరాగ్యమార్గమును లోకమునకు ప్రదర్శించుచు, జ్ఞాన సంప్రదాయమునుకూడా చూపించుచు, యథావిధిగా పరమహంసాశ్రమమును స్వీకరించి, ఉపనిషత్తులకును, బ్రహ్మసూత్రములకును, భగవద్గీతలకును అతి మనోహరమైన గంభీరభాషతో, సువిపులమైన భాష్యములను రచించిరి. ఈ మూడు భాష్యములనే ప్రస్థానత్రయమంటారు.

ఈ భాష్యములలో అనేక దుర్మతములను గంభీరమైన యుక్తులతోను, ప్రమాణవచనములతోను ఖండించి, అతి సుందరమైన, గంభీరమైన శైలితో అద్వైత సిద్ధాంతమును ప్రతిపాదించిరి. ఇట్టి గంభీరమైన వేదాంత భాష్యములను చదివి గ్రహించుట, సూక్ష్మబుద్ధికలవారికి, ఇతర శాస్త్రమందు పాండిత్యము కలవారికే సాధ్యమగునుగాని అందరికిని సాధ్యముకాదు.

అయినను అట్టి శాస్త్రసారమును తెలుసుకొనుట అందరికిని అవసరమే. సంసారబంధమును పోగొట్టుకొనుట, ఆనందరూపమగు మోక్షమును పొందుట ఆస్తికులందరికిని అవసరమేగనుక మందాధికారులకుగూడా సకల వేదాంత సిద్ధాంతసారం తెలియుటకు కొన్ని వేదాంతస్తోత్రములను కూడా రచించిరి.

అందులో దక్షిణామూర్తిస్తోత్రం చాలా ప్రధానమైనది. పూర్వకాలంలో దేవాసురులు మందర పర్వతముతో పాలసముద్రమును మథించి

అమృతకలశమును సంపాదించినట్లు, శంకర భగవత్పాదులవారు వేదాంతములనే క్షీరసముద్రమును శాస్త్రన్యాయములనే మందర పర్వతంతో మథించగా అద్వైతామృతం బయలుదేరి బైటికి వచ్చినది. అట్టి అద్వైతామృతమును ఈ దక్షిణామూర్తిస్తోత్ర మనే పాత్రయందు నింపిరా యన్నట్లున్నది.

ఇట్టి అద్వైతామృత కలశస్వరూపమైన ఈ దక్షిణామూర్తిస్తోత్రము చాలా మనోహరమైనది. ఈ అమృతకలశము నందరుచేపట్టి, అద్వైతామృతమును త్రాగి సంసారరోగమును పోగొట్టుకొని, పునరావృత్తి రహితమైన పరమానందరూపమగు మోక్షమును పొందుటకు బహు సులభ సాధనం ఈ దక్షిణామూర్తిస్తోత్రం.

మరియు మోక్షము ఆనందరూపమని, ఆత్మరూపమని, శరీరముండగనే లభించునని, నిత్యమని. అందుచేతనే త్రివర్గ పురుషార్థములకంటె, అనగా ధర్మము, అర్థము, కామము, అనే మూడు పురుషార్థములకంటే, చాలా గొప్పది యని శాస్త్ర ప్రసిద్ధియు, లోకప్రసిద్ధికూడా కలదు. అట్టి మోక్షమును పొందుటకు జ్ఞానమే సాధనంకాని, వేరు సాధనం లేదని శాస్త్రం చెప్పుచున్నది.

మోక్షస్వరూపమును, మోక్షసాధనములను ఆయా మతకర్తలు వారివారి మతగ్రంథములయందు అనేక విధములుగా ప్రతిపాదించిరి. ఆ సాధనములు ఉత్తమ లోకప్రాప్తికి సాధనములైనను, స్వస్వరూపావస్థానమగు పరమముక్తికి అద్వితీయాత్మ సాక్షాత్కారమే సాధనంకాని మరియొకటి కాదని అద్వైత సిద్ధాంతం. అన్ని దర్శనములకంటే, అన్ని మతములకంటేకూడా అతి ఆశ్చర్యకరమైన ఈ సిద్ధాంతమును అతిమధురంగా ఈ స్తోత్రమందు ప్రతిపాదించిరి. గనుక అందరికిని అవశ్యకమని చెప్పుటలో అతిశయోక్తి లేదు.

ఈ స్తోత్రమునకు సంస్కృత వ్యాఖ్యానములు కలవు! ఆ వ్యాఖ్యానములనుచూచి ఎటుల వ్రాసిన లోకమున కుపయోగించునాయని పర్యాలోచన చేసి, సంస్కృత భాషయందు పరిచయం లేనివారికికూడా ఈ దక్షిణామూర్తి స్తోత్రమందలి అద్వైతసిద్ధాంతరహస్యం అతి సులభముగాతెలియుటకు ఆంధ్రభాషలో ప్రతిపదార్థనిరూపణమును వ్రాయుచు,మతస్వరూపం బాగా తెలియుటకు మరికొన్ని అద్వైత సిద్ధాంత విషయములను చేర్చి యథాశక్తిగా తాత్పర్య వివరణమునుకూడా వ్రాయుచున్నాను.

శ్లో॥ మౌనవ్యాఖ్యా ప్రకటిత పరబ్రహ్మ తత్వం యువానం।
వర్షిష్ఠాన్తే వసదృషి గణైరావృతం బ్రహ్మనిష్ఠైః
ఆచార్యేంద్రం కరకలిత చిన్ముద్ర మానందమూర్తిం
స్వాత్మారామం ముదితవదనం దక్షిణామూర్తి మీడే ॥౧॥

ప్రతిపదార్థ నిరూపణము: బ్రహ్మనిష్ఠైః=బ్రహ్మవిచారపరులైన, వర్షిష్ఠాన్తే వసదృషి గణైః=వర్షిష్ఠ, అధిక వయస్సుకల, అంతేవసదృషి గణైః=శిష్యులగు ఋషిసముదాయములచేత, ఆవృతం=చుట్టుకొనబడిన, కరకలిత చిన్ముద్రం = హస్తముచేత, రచింపబడిన జ్ఞానముద్ర కలిగినటువంటియు, ఆనందమూర్తిం=ఆనంద స్వరూపు డయినటువంటి, స్వాత్మారామం=తన ఆత్మయందే రమించుచున్నటువంటియు. ముదితవదనం=సంతోషముతోకూడిన ముఖముగల. ఆచార్యేన్ద్రం=గురువులలో శ్రేష్ఠుడైన, దక్షిణామూర్తిం=దక్షిణామూర్తిస్వామిని, ఈడే=స్తుతి చేయుచున్నాను.

తాత్పర్య వివరణము: ప్రపంచంలో జీవరాసులు జరాయుజములని, అండజములని, స్వేదజములని, ఉద్భిజ్జములని నాల్గురకములుగా నున్నవి!

జరాయుజములనగా మాయ అను చర్మవిశేషముచేత ఆవరింపబడి పుట్టే మనుష్యులు, పశువులు మొదలగునవి. అండజములనగా గుడ్లలోనుండి పుట్టేకోళ్ళు, నెమళ్ళు మొదలగు జంతువులు, స్వేదజములనగా చమటలో నుండి పుట్టే నల్లులు, దోమలు మొదలగునవి. ఉద్భిజ్జము లనగా భూమిని పెగలించుకొని పుట్టుచున్న గడ్డి, చెట్లు మొదలగునవి. ఇవికూడా జీవరాసుల క్రింద పరిగణింపబడునవే.

అన్ని జీవరాసులలో మనుష్యులు కర్మయోగమునకు. జ్ఞానయోగ మునకు అర్హులుగనుక ఉత్తమ జీవులుగా పరిగణింపబడుచున్నారు. ఇట్టి మనుష్యులుకూడా శరీరేంద్రియములయందు ఆత్మ యనే భ్రమకలిగి. అనగా శరీరేంద్రియములకంటే అతీతమగు సచ్చిదానందరూపమయిన ఆత్మను, శరీరేంద్రియరూపముగా గ్రహించుచు, కర్మబద్ధులై, జననమరణ ప్రవాహమందు ఎల్లపుడు మునిగితేలుచు, ఆధ్యాత్మిక, అధిదైవిక, అధి భౌతికములను మూడురకములుగా నున్న దుఃఖములను అనుభవించుచు, ఈ దుఃఖములను పోగొట్టుకొని సుఖమునుపొందే ఉపాయమును తెలియని దుర్దశ నొంది పరమ దీనులయియున్నారు.

ఇట్టి మనుష్యులను చూచి పరమానుగ్రహముకలిగిన పరమేశ్వరుడు ఈ దీనులను ఉద్ధరించుటకై దక్షిణామూర్తి రూపముగా నవతరించి, వట వృక్షముక్రింద కూర్చొని యుండెను. అంతట పరమ జిజ్ఞాసువులు అనగా పరమాత్మను తెలుసుకొను కోరిక కలవారు, దక్షిణామూర్తిస్వామి వారి కంటే వయోవృద్ధులు, నిరంతరం బ్రహ్మవిద్యయందు దాసక్తి కల వారును, దక్షిణామూర్తిస్వామివారివద్దకువచ్చి, వారికి సాష్టాంగ నమస్కా రముచేసి తమతమ జిజ్ఞాసలను వెలిబుచ్చి, వారిచుట్టు అనగా వారికి అభి ముఖులై కూర్చొనిరి.

అంతట సచ్చిదానందరూపుడగు జగజ్జన్మ స్థితి లయ కారణభూతు డగు సర్వేశ్వరుడగు దక్షిణామూర్తిస్వామివారు ఆ పురుషుల జిజ్ఞాసను, ఉద్దేశ్యమును గ్రహించి, ముముక్షువులకు పరమహితమగు పరమాత్మ తత్వమునుపదేశింప తలచిరి.

ఆ పరమాత్మ జాతిలేని దగుటచేతను, పేరులేని దగుటచేతను, గుణములేని దగుటచేతను, క్రియలేని దగుటచేతను, జాతి వాచక శబ్దముల చేతగాని, నామవాచక శబ్దములచేతగాని, గుణవాచక శబ్దములచేతగాని, క్రియావాచక శబ్దములచేతగాని, బోధించుటకు వీలులేకపోయినది.

శబ్దరాసులలో ఈ నాల్గురికముల శబ్దములకన్న వేరు బోధించే శబ్ద ములు లేవు. గనుక వాక్యములతో పరమాత్మను బోధించుటకు వీలులేదు. ప్రత్యక్షముగా చూపించుటకుకూడా, రూపము మొదలగు గుణములు లేనిది గనుక వీలులేకపోయినది. లింగాదులు లేనిదిగనుక, అనుమానాది ప్రమాణ ములచేతకూడా గ్రహించుటకు, గ్రహింపచేయుటకును శక్యముకాదు.

అందుచేత ఆ యవాఙ్మానస గోచరమగు పరమాత్మను మౌనము చేతనే ప్రబోధచేయవలయునని భావించి, జ్ఞానముద్రను చూపించుచు మౌన ముగా నుండిరి. ఆ మౌనస్థితియే శిష్యులకు పరబ్రహ్మతత్వమును ప్రబో ధించుట. ఆ మౌనస్థితిచేతనే శిష్యులందరు గుర్వనుగ్రహమువలన పర బ్రహ్మతత్వమును స్పష్టముగా తెలిసికొని సంశయమును పోగొట్టుకొనిరి.

జ్ఞానముద్రను చూపించుటచేత జీవబ్రహ్మలకు ఏకత్వమును గుర్తిం చిరి. ఈ యర్థమునే:

శ్లో॥ చిత్రం వట తరోర్మూలే వృద్ధాశ్శిష్యా గురుర్యువా
గురోస్తు మౌనం వ్యాఖ్యానం శ్శిష్యాస్తు ఛిన్నసంశయాః॥

అను శ్లోకముకూడా చెప్పుచున్నది.

చాలా విచిత్రమైన విషయం. మఱ్ఱిచెట్టుక్రింద కొంతమంది మహాను భావులు కూర్చున్నారు. అందరు మాట్లాడకుండా కూర్చున్నారు. అందులో గురుస్థానమందున్న వారు యువకులు మంచి రూపవంతులు. బ్రహ్మ వర్చస్సు తాండవించుచున్నది.

బొటనవ్రేలు, చూపుడువేలు కలిపి (చిటుకలాగా) జ్ఞానముద్రను చూపించుచున్నారు గాని, ఏమీ మెల్లగాకూడా ఉపదేశించుటలేదు. పూర్తిగా మౌనంగానే యున్నారు. శిష్యులంతా వయోవృద్ధులు. పరమానందంగా కూర్చున్నారు. వారేమి చెప్పుచున్నారో, వీరికేమి అర్థమైనదో చూచేవారికి తెలియుటలేదు. చాలా చిత్రంగా నున్నది. దక్షిణామూర్తి స్వామివారి చుట్టూ కూర్చున్న శిష్యులకు సంశయంలేనట్లు వారి ముఖవికాసమునుబట్టి తెలుస్తూన్నది.

గురువు చిన్నవాడైయుండడం, శిష్యులు వయోవృద్ధులై యుండడం, ఒక చిత్రం. తత్రాపి గురువుగారు మౌనంగా నుండడం, శిష్యులు సంశయం లేనివారై ప్రశ్నచేయకుండా తృప్తిగా నుండడం అంతకంటే చిత్రం అని ఈ శ్లోకమునకు తాత్పర్యము.

శ్లో॥ అంగుష్ఠ తర్జనీ యోగ ముద్రావ్యాజేన సేవినాం
శృత్యర్థం బ్రహ్మజీవైక్యం దర్శయన్నోఽవతాచ్ఛివః॥

ఈ శ్లోకముకూడా ఈ అర్థమునే బలపరచుచున్నది. ఇదియేగాక దక్షిణామూర్తి స్వామివారు శిష్యులకు అద్వైత సిద్ధాంతమునే బోధించి నట్లు తెలియుచున్నది. బొటనవ్రేలు, చూపుడువ్రేలు కలిపి జ్ఞానముద్రను చూపుటచే జీవబ్రహ్మైక్యమును బోధించినట్లే.

"శృత్యర్థం బ్రహ్మజీవైక్యం దర్శయన్" అనుటవల్ల సమస్తశృతు లకు జీవబ్రహ్మైక్యమందే తాత్పర్యమనికూడా స్పష్టమగుచున్నది – ఆ

తత్వం ఆవాఙ్మానసగోచరమగుటచేతనే జ్ఞానముద్రతో బోధించిరని, అట్లు బోధచేసిన దక్షిణామూర్తి స్వామి "నోవతాచ్ఛివః" అనుటవల్ల ఈశ్వరావతారమనికూడా స్పష్టమగుచున్నది. అట్టి జీవబ్రహ్మైక్యమును బోధించిన దక్షిణామూర్తిస్వామికి నమస్కారమని ప్రతిశ్లోకమందు చెప్పిరిగనుక, ఈ దక్షిణామూర్త్యష్టకంచాలా జ్ఞానప్రదమని, సకల శృతులకు సారభూతమైన జీవబ్రహ్మైక్యమును చక్కగా సులభముగా తెలియునటుల ప్రతిపాదించినదని స్పష్టమగుచున్నది.

జ్ఞానప్రదమగు దక్షిణామూర్తి స్మరణపూర్వకముగా నున్నది గనుక ఈ దక్షిణామూర్త్యష్టకమును శ్రద్ధగా వెనకముందు శ్లోకములతో సహా పది శ్లోకములను చదివి అర్థమును తెలుసుకొనుట ముఖ్యమని విశ్వసించవలసిన విషయం. ఈస్తోత్రం జ్ఞానప్రదం గనుకనే శంకర భగవత్పాదుల వారు రచించిన బ్రహ్మసూత్ర భాష్యం, గీతాభాష్యం, ఉపనిషద్భాష్యం అను ప్రస్థానత్రయమును గురువులవద్ద చదువునపుడు ముందు వెనుక ఈ శ్లోకములను చదువుచు గురువందనములు చేయవలయునని సంప్రదాయమును స్థాపించిరి.

ఆ గురువును దక్షిణామూర్తి స్వామివలె భావించి వందనములు చేసి, వారి యుపదేశమువలన తత్వమును గ్రహించి కృతకృత్యులు కావలయునని కూడా తాత్పర్యము. నాటినుండి నేటివరకు శంకరాచార్యుల వారు స్థిరపరచిన సంప్రదాయమును ఆస్తికజనులు పాటించుచునే వేదాంత భాష్యములను చదువుచున్నారు.

ప్రతి శ్లోకంలో తస్మై శ్రీ గురుమూర్తయేనమ ఇదం శ్రీ దక్షిణామూర్తయే అని యున్నది. ఈ శ్లోకములనుచదివి గురువందనములు చేయుచున్నారంటే గురువుయందు. దక్షిణామూర్తి రూపమైన ఈశ్వరభావన ఉంచవలయుననే అర్థం. విద్యార్థులయినవారు ఈ దక్షిణామూర్తి

స్తోత్రమును ప్రతిరోజు స్నానంచేసి, శుచిగా స్వకర్మానుష్ఠానం చేసికొని, చదివినయెడల సర్వవిద్యాపారంగతు లగుదురనుటలో సందేహంలేదు.

తత్వమును తెలిసికొనతలచినవారుకూడా ఈ స్తోత్రం పారాయణం చేసి, అర్థమును తెలిసికొన్నయెడల తత్వ సాక్షాత్కారమునుపొంది ముక్తు లగుదు రనుటలోకూడా సందేహంలేదు. చాలా గంభీరార్థము కలదగుట చేతనే ఈ స్తోత్రముపై సురేశ్వరాచార్యులవారు విపులమైన వార్తికమును వ్రాసిరి.

వటవృక్షమూలమున శిష్యులు శ్రీ దక్షిణామూర్తిస్వామివారి దర్శన మాత్రంతో వారి యనుగ్రహమును పొంది, ఉపదేశం లేకపోయినను. జ్ఞానులై కృతకృత్యు లయినట్లు దక్షిణామూర్తిస్తోత్రమును చదివి స్వామి యనుగ్రహమును పొందినవారుకూడా జ్ఞానులై కృతకృత్యులగుదురని చెప్పుటలోకూడా సందేహం లేదు. అందుచేతనే అన్నిటికంటే ముందు దక్షిణామూ ర్తిస్తోత్రమును చదివి, దీని యర్థమును పూర్తిగా తెలిసికొనుట చాలా ముఖ్యం.

మొదటి శ్లోక తాత్పర్య వివరణం పూర్తి అయినది.

అవతరణిక:

సాక్షాత్తు ఈశ్వరావతారమైన శంకరాచార్యులవారు లోకానుగ్రహ దృష్టితో సకల వేదాంతసారభూతమగు శ్రీ దక్షిణామూర్తి స్తోత్రమును రచించుచు, వేదాంతశాస్త్రమును ప్రసిద్ధమగు జీవబ్రహ్మైకమనే విషయ మును, మోక్షమనే ప్రయోజనమును, గ్రంథమునకు విషయమునకు కల ప్రతిపాద్య ప్రతిపాదక భావసంబంధమును, ముముక్షువనేఅధికారిని సూచిం చుచు, సకలప్రపంచమునకు అధిష్ఠానమగు పరమాత్మయే దక్షిణామూర్తి

యని నమస్కరించుచు, వేదాంతశాస్త్రమును బోధించుచున్నారు.

శ్లో॥ విశ్వం దర్పణ దృశ్యమాన నగరీతుల్యం నిజాంతర్గతం।
పశ్యన్నాత్మని మాయయా బహిరివోద్భూతం యథానిద్రయా।
యస్సాక్షాత్కురుతే ప్రబోధసమయే స్వాత్మాన మేవాద్వయం।
తస్మై శ్రీ గురుమూర్తయేనమ ఇదం శ్రీ దక్షిణామూర్తయే॥౧॥

ప్రతిపదార్థ నిరూపణం:

దర్పణ దృశ్యమాన నగరీతుల్యం— దర్పణ=అద్దమందు; దృశ్యమాన=ప్రతిబింబించినదై చూడబడుచున్న; నగరీ=పట్టణముతో; తుల్యం=సమానమైనటువంటి, నిజాంతర్గతం= నిజ=తనసంబంధమైన, అంతః=మధ్యను; గతం=పొందిన అనగా సకల ప్రపంచమునకు అధిష్ఠానము సచ్చిదానందరూపమగు పరమాత్మయేగనుక అట్టి పరమాత్మయందే ఆరోపితమగు ప్రపంచ మున్నది యని అర్థము. అట్టి నిజాంతర్గతమగు విశ్వం భూతభౌతిక రూపమగు సకల ప్రపంచమును; యథా=ఏప్రకారముగా; నిద్రయా=నిద్రాదోషముచేత అనగా స్వప్నావస్థయందు; సాక్షిచైతన్యమందు కల్పితమైన=అనేకరకములగు ప్రపంచవిషయములను తన లోపల కల్పితమైనను, బైటయున్నట్లుగా చూచుచున్నాడో।

తథా=ఆ ప్రకారముగా, ఆత్మని=పరమాత్మయందు; మాయయా=సత్వరజస్తమోగుణాత్మకమైన ఆవరణ, విక్షేపశక్తులతోకూడిన = అజ్ఞానముచేత కల్పితమైనప్రపంచమును; బహిః=బైట;ఉద్భూతమివ= ఆవిర్భవించిన దానివలె (ఉన్న దానివలె); పశ్యన్ = చూచుచున్నవాడై ; యః=ఎవడు; ప్రబోధసమయే=గురువులచేత ఉపదేశింపబడిన మహావాక్యముల వలన కలిగిన అఖండ బ్రహ్మ సాక్షాత్కారకాలమందు; అద్వయం=రెండవది లేని, అద్వితీయమగు, అనగా బ్రహ్మ సాక్షాత్కారముచే, అజ్ఞాన

తత్కార్యములు నశించును గనుక అద్వితీయమగును. అట్టి అద్వితీయమైన స్వాత్మానమేవ=సచ్చిదానందరూపమగు; ప్రత్యగ్బ్రహ్మ స్వరూపమునే, సాక్షాత్కురుతే=సచ్చిదానందాత్మకమగు బ్రహ్మను నేనైతినని; అపరోక్షముగా తెలుసుకొనుచున్నాడో!

తస్మై = అటువంటి; శ్రీ గురుమూర్తయే శ్రీ గురుః=బ్రహ్మసాక్షాత్కారముకలిగి, బ్రహ్మరూపుడైన, దేశకాల వస్తు పరిచ్ఛేదరహితుడై జ్ఞానము నుపదేశించుపురుషుడు, మూర్తయే=అట్టి స్వరూపుడైన శ్రీ దక్షిణామూర్తయే=దక్షిణదిక్కుకు అభిముఖముగానున్న; అనగా దక్షిణదిక్కును చూచుచున్న శరీరముకల మహానుభావునకు; ఇదం=ఈ! నమః=నమస్కారము.

శ్రీ గురుమూర్తయే శ్రీ దక్షిణామూర్తయే, అను పదములకు మరి యొక అర్థము-శ్రీఅనగా శ్రీమతీ! సచ్చిదానందరూపమైన; గుర్వీ =అతి గొప్పదైన: మూర్తిః=స్వరూపము; యస్యసః = శ్రీ గురుమూర్తిః, శ్రీ గురుమూర్తి యనగా సచ్చిదానందస్వరూపుడని యర్థము. శ్రీదక్షిణామూర్తయే శ్రీ-అనగా అనాదియగు, అచింత్యమగు, మాయాశక్తి యని అర్థము; అట్టి మాయాశక్తిచేత; దక్షిణ =సృష్టి స్థితి లయముల యందు నిపుణుడు అని యర్థము. శ్రీ దక్షిణామూర్తయే అన్నపుడు అకార ప్రశ్లేషచేత; అమూర్తయే అని యర్థము వచ్చును. అమూర్తి యనగా మూర్తి లేని వాడు, నిర్వికారుడని యర్థము॥

ఇంతవరకు ప్రతిపదార్థ నిరూపణం పూర్తియైనది.

ఇక తాత్పర్య వివరణం.

ఈ దక్షిణామూర్త్యష్టకములో చాలా లోతైన అర్థములున్నవి. అన్నింటి కంటేకూడా ఈ శ్లోకమునందు చాలా గూఢమైన అర్థ మున్నది.

అద్వైతసిద్ధాంతమును సాధ్యమైనంత కొద్దిలో ప్రతిపాదిస్తూ, శ్లోక తాత్పర్యమును విశదపరుచుచున్నాను. అద్వైత వేదాంతశాస్త్రమందు బ్రహ్మను తెలిసికొన్నవ్యక్తి బ్రహ్మయగునని; ఆత్మసాక్షాత్కారమును పొందినయెడల జనన మరణ ప్రవాహంతోకూడిన ప్రపంచమంతయు అజ్ఞానముతో సహా నివర్తించుననియు, ఉపనిషత్తులు బోధించు చున్నవి. స్థూల సూక్ష్మ కారణ రూపమగు ప్రపంచమంతయు బ్రహ్మయేనని కొన్నిచోట్ల, సర్వం ఆత్మయే యని కొన్నిచోట్ల, శ్రుతిస్మృతులు బోధించుచున్నవి, బ్రహ్మయన్నను ఆత్మయన్నను ఒకటియే గనుక అధిష్ఠానమగు పరమాత్మ కంటే వేరైనది యేమియు లేదని యర్థము. ఈ అర్థమంతయు గూడా, ఈ శ్లోకమందు "యస్సాక్షాత్కురుతే ప్రబోధసమయే స్వాత్మానమేవాద్వయం" అను శ్లోకభాగమునుబట్టి స్పష్టమగుచున్నది.

అజ్ఞానదశ యందు ఆత్మయే అజ్ఞానము చేత ఆవరింపబడి, జీవుల వలె, సృష్టి కర్త.యగు ఈశ్వరుని వలె, ప్రపంచమువలె భాసించు చున్నదని అధిష్ఠానమగు,అద్వితీయమగు ఆత్మసాక్షాత్కారము కలిగినయెడల ఆత్మను ఆవరించిన అజ్ఞానముతో సహా, అజ్ఞానమువల్ల ఏర్పడిన జీవత్వ ఈశ్వరత్వ జగద్విషయక భ్రమ నిశ్శేషముగా నశించి, అద్వితీయమగు సచ్చిదానంద రూపమగు ఆత్మయే మిగులునని, అట్టి స్థితియే మోక్షమని కూడా విశదమగుచున్నది.

ఈ సిద్ధాంతము స్పష్టముగా అర్థము కావలయునంటే కొన్ని భ్రమ దృష్టాంతములను బాగుగా విమర్శించవలయును. శుక్తి అధిష్ఠానముగాగల రజతభ్రమ— అనగా శుక్తియనగా ముత్యపుచిప్ప. దానియందు వెండియని కలిగిన భ్రమ, శుక్తిసాక్షాత్కారముచేతనే, అనగా ఇది ముత్యపుచిప్పయే కాని వెండికాదు అనే ప్రత్యక్షజ్ఞానముచేతనే ఆ రజతభ్రాంతి నశించును.

ఒకప్పుడు కొద్దిచీకటిలో తాడునుచూచి సర్పమని భ్రమపడుట, భయపడుట, పరిగెత్తుటకూడా అనుభవసిద్ధమైన విషయమే. (రజ్జువుఅనగా తాడు) అట్టి రజ్జువు అధిష్ఠానముగాగల సర్పభ్రమ, అధిష్ఠానమగు రజ్జు సాక్షాత్కారముచేతనే. అనగా ఇది తాడుగాని, సర్పము కాదు అను ప్రత్యక్ష జ్ఞానముచేతనే నశించుచునట్లు కూడా అనుభవంలో నున్న విషయమే. అధిష్ఠానమనగా భ్రమకు కారణమగు అజ్ఞానముచేత ఆవరించబడు యదార్థ వస్తువే. అనగా దేనియందు భ్రమకలుగునో ఆ నిజమైన వస్తువే అధిష్ఠానమని యర్ధము.

అటులనే ఆత్మ అధిష్ఠానముగాగల జీవత్వ, ఈశ్వరత్వ, జగద్విషయక భ్రమకూడా అధిష్ఠానమగు ఆత్మ సాక్షాత్కారముచేతనే నశించును. ఆత్మ సాక్షాత్కారము సకల సంసారబంధమునకు కారణమగు మూలాజ్ఞానమును నశింపచేయునది గనుకనే, ఆత్మ సాక్షాత్కారముకొరకు శ్రవణము, మననము, నిదిధ్యాసనము చేయవలయునని శాస్త్రము చెప్పుచున్నది. వీటి వివరణం ముందు చేయబడును.

అద్వైత సిద్ధాన్త రహస్యమును తెలిసికొనవలెనంటే, అధ్యాస (అనగా భ్రమ) యొక్క స్వరూపస్వభావములను ముఖ్యముగా విసుగు చెందక మాటిమాటికి విమర్శించి గ్రహించవలయును. మొట్టమొదట తిరిగి శుక్తిరజత భ్రమను విమర్శింతము. రజతభ్రమ కలిగేముందు యథార్థమగు శుక్తిని, సత్వరజస్తమోగుణాత్మకమగు ఆవరణ విక్షేపశక్తులు గల అజ్ఞానము ఆవరించి, జీవుని ఆశ్రయించియుండును. ఆవరణశక్తి యనగా అసలువస్తువును తెలియకుండా చేసే శక్తియే. విక్షేపశక్తి యనగా అసలు వస్తువును మరియొక వస్తువుగా కనుపింపచేసే శక్తియే ఈ రెండుశక్తులతో కూడిన ఆ యజ్ఞానము రజత సంస్కార సహితమై చకచక మెరిసినట్లు కనబడగానే తాత్కాలికముగా రజతరూపముగాను, రజత జ్ఞానరూపముగాను పరిణమించును.

అక్కడ ఆరోపితమగు రజతము. శుక్తిని ఆవరించిన అజ్ఞానముయొక్క పరిణామమని, అజ్ఞానముచేత ఆచరింపబడిన శుక్తికి వివర్తమని అంటారు. అనగా రజతమునకు శుక్తిని ఆవరించిన అజ్ఞానము పరిణామ్యుపాదానమనియు, ఆ రజతమునకు శుక్తి వివర్తోపాదానమనియు అందురు. కార్యరూపముగా మార్పునుచెందేది పరిణామ్యుపాదానము, మారకుండా మరియొక వస్తురూపముగా కనిపించేది వివర్తోపాదానమని యర్థము అజ్ఞానం రజతంగా మారినది గనుకనే పరిణామ్యుపాదానమని, శుక్తి మారకుండా వెండివలె కనిపించినది గనుకనే వివర్తోపాదానమని శాస్త్రకర్తలు నిరూపణ చేసిరి.

అద్వైత సిద్ధాంతమందు వివర్తవాదమే ప్రధానము. ఇట్టి వివర్తవాదమును సమర్థించుటకై ప్రపంచమంతయు అవిద్యా పరిణామమని పరిణామవాదము నంగీకరించిరి. అజ్ఞానము పరిణమించిన దనగా భ్రాంతియనే అర్థము. భ్రాంతి యనగా ఒక వస్తువు మరియొక విధముగా కనిపించుటయే. అట్టి శుక్తి రజితభ్రాంతికి అధిష్ఠానమగు శుక్తిని, ఆవరించిన అజ్ఞానము శుక్తి సాక్షాత్కారముచేతనే. దీపం వెలిగిస్తే చీకటిపోయినట్లు పోవును. ఆ యజ్ఞానం పోగానే దానివలన ఏర్పడిన రజితభ్రమకూడా నిశ్శేషముగా నివర్తించును. ఇది శుక్తి రజతభ్రాంతి వివరణము.

అటులనే సచ్చిదానంద రూపమగు నిత్య శుద్ధబుద్ధ ముక్త స్వభావమగు, అనగా నాశనములేని సకలదోషరహితమైన జ్ఞానస్వరూపమైన మోక్షరూపమగు ఆత్మనే అనాదియైన,అనిర్వాచ్యమైన,సత్వరజస్తమోగుణాత్మకమైన ఆవరణ విక్షేపశక్తి యుక్తమైన అజ్ఞానము ఆవరించి, అనాదియగు ప్రపంచ సంస్కారసహితమై ఆ యజ్ఞానముచేత ఆవరింపబడిన ఆత్మనే జీవేశ్వర జగద్రూపముగా భాసింపజేసినది. ఇట్టి అజ్ఞానమే జీవుని యొక్క సంసారబంధమునకు మూలకారణమై యున్నది.

ఈ యజ్ఞానము అధిష్ఠానమగు పరమాత్మ సాక్షాత్కారముచేతనే నశించును. అజ్ఞానం నశించినయడల ఆ యజ్ఞానంవల్ల ఏర్పడిన భ్రమ నిశ్శేషముగా నశించును. గనుక ప్రపంచమంతయు బ్రహ్మను ఆవరించిన మూలాజ్ఞానముయొక్క పరిణామమని, అట్టి అజ్ఞానముచేత ఆవరింపబడిన పరమాత్మయొక్క వివర్తమని, అనగా ప్రపంచమునుగురించి అజ్ఞానము పరిణామ్యుపాదానమని, పరమాత్మ వివర్తోపాదానమని, ముఖ్యముగా గమనించవలసిన విషయం. ఇట్టి అద్వైత సిద్ధాంతవిషయములను అందరికీ సులభముగా తెలియునటుల ఈ శ్లోకమందు శంకర భగవత్పాదులవారు దయతో బహు లలితముగా చెప్పిరి.

"విశ్వందర్పణ దృశ్యమాన నగరీతుల్యం" అంటే ప్రపంచమంతయు అద్దంలో కనిపించే పట్టణమువలె కనిపించుటయేగాని, సత్యమైనది కాదని యర్థము. పెద్ద ఒక నిలువుటద్దమును ఉన్నతప్రదేశమందు పెట్టినయడల ఆ యద్దమునకు యెదురుగానున్న పట్టణము, మార్గములు, మార్గమునందు తిరుగుచున్న ప్రజలు, బండ్లు వగైరాలన్నియు ప్రతిబింబించి కనిపించుచుండును. దీనినే ప్రతిబింబ భ్రమ యందురు. అద్దములో కనిపించిన వస్తువులలో ఒక వస్తువునైనను చేతితో విడతీసి చూచుటకు వీలులేదు. కనిపించుటమాత్రం తప్పదు.

వేరే సత్యమైన బింబమున్నను, అద్దములో కనిపించువస్తువులు సత్యస్వరూపములేనివై భ్రమమాత్రముగానే యున్నవి ఈ భ్రమ సూక్ష్మదృష్టితోను, శాస్త్రీయదృష్టితోను విచారించినయడల చాలా ఆశ్చర్యకరముగా నుండును.

అటులనే స్వచ్ఛమైన స్వప్రకాశమైన సచ్చిదానందరూపమైన ఆత్మయందు ప్రపంచమంతయు కనిపించుచున్నదని గ్రహించవలయును. అద్దమందు కనిపించు నగరప్రతిబింబము అద్దమందే యుండునుగాని ప్రతి

బింబమునకు ఆధారమైన అద్దముకంటే ఇతరత్ర ఉండదు. అటులనే అజ్ఞానముచేత కల్పింపపడిన దృశ్యప్రపంచమంతయు అధిష్ఠానమగు ఆత్మయందే ఉండునుగాని ఇతరత్ర ఉండదు. ఈ విషయమే నిజాంతర్గతం అనే పదమువల్ల స్పష్టమగుచున్నది.

ఈ విషయంలో ఒకప్రశ్న. అద్వైతులు శుక్తియందు రజతభ్రమ కలిగినట్లు. తాడుయందు సర్పభ్రమ కలిగినట్లు, పరమాత్మయందు జీవత్వ ఈశ్వరత్వ జగద్విషయక భ్రమ కలుగుచున్నదని అంతా భ్రమ కనుకనే అధిష్ఠానమగు బ్రహ్మయే సత్యమని ఆరోపితమగు ప్రపంచమంతయు మిథ్యయని చెప్పెదరు. మిథ్యయనగా అధిష్ఠానమును (అసలువస్తువును తెలుసుకుంటే నశించిపోవునది) శుక్తిని తెలుసుకుంటే రజతభ్రమ నశించును గనుక రజతం మిథ్యా తాడును తెలుసుకుంటే సర్పభ్రమ నశించును గనుక సర్పము, సర్పజ్ఞానము మిథ్య, మెళుకువవచ్చి తన స్వరూపమును గుర్తించినపుడు స్వప్నమంతయు లయించిపోవునుగనుక స్వప్నముమిథ్య. అటులనే యథార్థమగు ఆత్మసాక్షాత్కారము కలిగినపుడు భ్రమరూప ప్రపంచమంతయు నిశ్శేషముగా నశించునుగనుక ప్రపంచమంతయు మిథ్యాభూతమనికూడా చెప్పెదరు.

అజ్ఞానముకూడా అధిష్ఠానసాక్షాత్కారముచేత నశించును గనుక మిథ్యయే. అయితే శుక్తియందు రజతభ్రమ కలిగినపుడుగాని, రజ్జువుయందు సర్పభ్రమ కలిగినపుడుగాని. అధిష్ఠానమగు శుక్తికంటే, రజ్జువుకంటే వేరుగా ఒక జీవుడు ఉండి శుక్తిని రజ్జువును యథార్థముగా తెలుసుకొనక భ్రాంతిని పొందుచున్నాడు. అసలు వస్తువులనుచూచి భ్రాంతిని పోగొట్టుచున్నాడు గనుక. ఈ దృష్టాంతములలో చెప్పిన విషయములు అనుభవమునకు సరిపోవుచున్నవిగాని ఆత్మయందు జీవత్వ, ఈశ్వరత్వ, జగద్విషయక భ్రమ కలుగునపుడు భ్రాంతిని పొందువాడెవరు. పరమాత్మ అధిష్ఠానమే కదా. జీవత్వము కూడా కల్పితము గనుక జీవుడు పరమాత్మ

కంటే వేరులేదుకదా! భ్రాంతిని పొందేవాడే లేకపోయినపుడు భ్రమకలుగు నని చెప్పుట యుక్తముకాదని గట్టిగా ప్రశ్నించవలసిన విషయమే.

ఈ ప్రశ్నకు సమాధాన మిట్లు చెప్పవలయును. భ్రమ రెండువిధ ములు. అనాత్మాధిష్ఠానక భ్రమయనియు, ఆత్మాధిష్ఠానకభ్రమయని. అనా త్మాధిష్ఠానక భ్రమయనగా ఆత్మ భిన్నమగు శుక్తియందు రజతమను భ్రమ. ఆత్మకంటే భిన్నమగు తాడుయందు సర్పమనుభ్రమ మొదలగు నవి. ఈ భ్రమలయందు అధిష్ఠానముకంటే భ్రాంతిని పొందువాడు వేరుగా నున్నమాట సత్యమే. కాని ఆత్మాధిష్ఠానకభ్రమను విచారించిన యడల ఈ ప్రశ్నకు సమాధానం వచ్చును.

ఆత్మాధిష్ఠానకభ్రమయనగా ఆత్మయే యధిష్ఠానముగాగల భ్రమ యని యర్థము. స్వప్నభ్రమ ఆత్మాధిష్ఠానక భ్రమయే, దీనిని కొంత విమర్శించవలయును. ఒక గ్రామమందు ఒకవ్యక్తి తన యింట్లో తన మంచంమీద పడుకొని నిద్రపోయెనని యనుకుందము. ఆ నిద్రపోయిన వ్యక్తికే కాశీకిపోయినటుల, గంగాస్నానం మొదలగు యాత్ర చేసినటుల, అక్కడ పరిచితులగువారిని చూచినటుల స్వప్నము వచ్చినది.

ఈ స్వప్నము నిద్రపోయినవాని శరీరములోని ఆత్మయందే కలుగు చున్నది గనుక ఆత్మయే అధిష్టానమని చెప్పక తప్పదు. ఆత్మ నిద్రతో ఆవరింపబడి తెలియనిస్థితిలో నున్నాడుకనుక! ఈ స్వప్నమును చూచువా డెవడు? ఈ నిద్రపోయిన వ్యక్తియే కాశీకివెళ్ళి యాత్రచేసికొని పరిచిరు లతో మాటలాడినాడని చెప్పుటకు—వీలులేదు. పరిచితులు ఈయన కాశీకి వచ్చినాడని, మాతోకలసి మాటలాడినాడని చెప్పువారు లేరుకదా! అందు వలన ఈ వ్యవహారదశయందున్న నిజమైన కాశీపట్నమునకు వెళ్ళుట గాని, పరిచితులను చూచుటగాని జరుగలేదనియే చెప్పవలయును.

ఏమన తాత్కాలికముగా నిద్రపోయినవాని ఆత్మయందు నిద్రా దోషముచేత కల్పింపబడిన విలక్షణమగు ప్రపంచము జాగ్రదవస్థయందు మనము చూచు ప్రపంచంకంటే వేరుగా నున్నదని చెప్పక తప్పదు. స్వప్నమందు వెళ్ళిన కాశీపట్టణం ప్రాతిభాసిక కాశీ పట్టణమే! స్వప్న మందు చేసిన కాశీయాత్ర ప్రాతిభాసిక కాశీయాత్రయే. స్వప్నమందు చూడబడిన పరిచిత బంధుమిత్రాదులను ప్రాతిభాసికులే.

ఇవి జాగ్రదవస్థయందు కనిపించేవికావు. మరియు మహారాజుకు నిరుపేదయై భిక్షాటన చేయుచున్నట్లు స్వప్నము వచ్చును. భిక్షమెత్తుకొను నిరుపేదకు చక్రవర్తి సార్వభౌముడై సమస్త రాజ్యసుఖములను అనుభ వించుచున్నట్లు స్వప్నము వచ్చును. ముసలివానికి పడుచువాడనని స్వప్నము వచ్చును. స్త్రీకి పురుషుడనైతినని స్వప్నము వచ్చును. పురుషునకు స్త్రీనైతినని స్వప్నము వచ్చును. కుంటివాడై, రోగియై కదలలేని స్థితిలో నున్నవానికి ఆరోగ్యవంతుడై పరుగెత్తుచున్నట్లు స్వప్నము వచ్చును.

రాత్రియందు నిద్రపోయినవానికి పగలు ఎండలో తిరుగుచున్నట్లు, అరణ్యమందున్న వానికి నగరమందున్నటులను, నగరమందున్న వానికి అరణ్యమందున్నటులను, విపరీతముగా స్వప్నములు వచ్చుచుండును. కనుక ఈ స్వప్న ప్రపంచము జాగ్రత్ప్రపంచ సంస్కారముతో ఏర్పడు టచే దానిని పోలియున్నాను. జాగ్రత్ప్రపంచముకంటే వేరుగా నున్నదని మనం గ్రహించవలయును. స్వప్న ప్రపంచ మంతయు ప్రాతిభాసికము. ప్రాతిభాసిక మనగా ఆగంతుకదోషజన్య భ్రమ.

ఇచట ఆగంతుక దోషము నిద్రాదోషము. ఈ నిద్రాదోషము ప్రతి రోజు వచ్చుట మెళకువ వచ్చినపుడు పోవుట. అనుభవములోనున్నది. గనుక దీనిని ఆగంతుకదోషమని శాస్త్రజ్ఞులు చెప్పెదరు. ఇట్టి ఆగంతుక

నిద్రాదోషమువలన, స్వప్నభ్రమ కలుగుచున్నది గనుక ప్రాతిభాసిక భ్రమయని చెప్పబడుచున్నది. ప్రాతిభాసికభ్రమ బ్రహ్మజ్ఞానముకంటే ఇతరముచేత బాధింపబడును. అనగా బ్రహ్మజ్ఞానముకంటే ఇతర విషయకమగు ప్రబోధచేత [మెలకువచేత] స్వప్నభ్రమ నివర్తించుచుండును. గనుకకూడా స్వప్నభ్రమ ప్రాతిభాసిక భ్రమ యనబడుచున్నది.

శుక్తిరజత భ్రమ రజ్జు సర్పభ్రమ మొదలగు భ్రమలు కూడా ప్రాతిభాసిక భ్రమలే. ఈ భ్రమలు కూడా ఆగంతుకమగు, నేత్రగతమగు భ్రమను కలుగజేయు కాచాదిదోషములచేతనే ఏర్పడినవి. బ్రహ్మజ్ఞానము కంటే ఇతరమగు శుక్తి సాక్షాత్కారముచేతను, రజ్జుసాక్షాత్కారముచేతను నశించుచున్నవి గనుక ప్రాతిభాసిక భ్రమలని చెప్పబడుచున్నవి. ప్రాతిభాసికమనగా ప్రతిభాసకాలమందు మాత్రమే ఉండునవియని యర్థము. ప్రతిభాస యనగా భ్రమనుపొందు వ్యక్తియొక్క దృష్టియే. ఆ దృష్టికాలమందే ఆ దృశ్యములు ఏర్పడుచున్నవి. ఆ దృష్టి పోయినపుడు ఆ దృశ్యములు పోవుచున్నవి. ఇది ప్రాతిభాసిక భ్రమ స్వభావము.

వ్యావహారిక భ్రమ యనగా అనాది దోషజన్య భ్రమ. జాగ్రదవస్థయందు మనకు గోచరించు భూతభౌతిక ప్రపంచ దృశ్యమంతయు వ్యావహారిక భ్రమకు చెందినదే. ఈ వ్యావహారిక భ్రమ అనాదియగు అజ్ఞాన దోషముచే కలుగుచున్నది గనుక అనాదిగా నున్నటులను, స్వప్నముకంటె నిత్యముగా నున్నటులను గోచరించుచున్నది. కాని ఇంతకంటే విశేషము లేదు.

ఇదియేగాక బ్రహ్మసాక్షాత్కారముచేతనే ఈ జాగ్రత్ప్రపంచ భ్రమ నశించును. కాని ఇతర జ్ఞానముచే నశించదు. కారణమేమనగా వ్యావహారికమగు ఈ ప్రపంచభ్రమకు కారణమగు, అనాదియగు ఆత్మావరక అజ్ఞానదోషము, బ్రహ్మ సాక్షాత్కారముచేతనే నశించును గనుక

ప్రపంచభ్రమ కూడా బ్రహ్మసాక్షాత్కారముచేతనే నివర్తించును. గనుక వ్యావహారికమగు జాగ్రత్ప్రపంచ భ్రమ. స్వప్నభ్రమకంటే విలక్షణముగా నుండును.

వ్యావహారికమనగా వ్యవహారకాలమందు గోచరించునది. వ్యవహారకాలమనగా అజ్ఞానకాలమే, అనగా అధిష్టానమగు పరమాత్మను అపరోక్షముగా తెలిసికొనని [అజ్ఞానదశయందు] సమయమందు ఇట్టి ప్రపంచ భ్రమ కలుగుచునే యుండునని తాత్పర్యము.

ప్రాతిభాసికమగు స్వప్నభ్రమకు కారణమగు నిద్రాదోషము ప్రబోధ చేతనే బాధింపబడును గనుక స్వప్నభ్రమకూడా ప్రబోధచేతనే నశించును. ఇట్టి తేడా ఈ భ్రమలలో గ్రహించవలసి యున్నది. మరొక విషయము: జాగ్రదవస్థయందు స్వప్నావస్థ గోచరించదు, స్వప్నావస్థయందు జాగ్రదవస్థ గోచరించదు. సుషుప్త్యవస్థయందు జాగ్రదవస్థ, స్వప్నావస్థలు కూడా గోచరించవు. జాగ్రత్స్వప్నావస్థలయందు సుషుప్త్యవస్థ గోచరించదు, కాని ఈ యవస్థలను తెలుసుకునే ఆత్మ మూడు అవస్థలయందును అనుగతమై మార్పును పొందకుండా అనుభవములో గోచరించుచుండును.

ఈ యనుభవమునుబట్టి అవస్థాత్రయములో ఆత్మ ఏదో అనాత్మ ఏదో తెలుసుకొనుట కవకాశమున్నది. స్వప్న జాగ్రదవస్థలను మరియొక విధముగా కూడా విమర్శించవలసి యున్నది. జాగ్రదవస్థయందలి జీవుడు నిద్రించుకాలమందు నిద్రతో నావరింపబడి జాగ్రదవస్థకు చెందిన తన స్వరూపమును మరచిపోవును. స్వప్నము వచ్చినపుడు స్వప్నదృశ్యములతో పాటు తాను ఆ ప్రపంచమును అనుభవించువానివలె బయలుదేరి జాగ్రద్దశయందు పనిచేసిన నేత్రములు మొదలైన ఇంద్రియములు శరీరం పని చేయకపోయినను, స్వప్నావస్థయందు నేత్రములతో చూచుచున్నాడు. చెవులతో వినుచున్నాడు, కాళ్ళతో నడచుచున్నాడు, వాక్కుతో మాట్లాడు

చున్నాడు. ఈ విధముగా అన్ని వ్యవహారములు చేయుచున్నట్లు కనిపించు చున్నది.

మెళుకువ వచ్చిన తరువాత ఈ స్వప్నదృశ్యముతోసహా స్వప్న దృశ్యములను చూచిన ఇంద్రియములు, శరీరము అదృశ్యమై తిరిగి జాగ్రదవస్థయందలి స్వరూపముతోనే మిగిలియున్నాడు. ఇంతకు, జాగ్రద్దశను మరచి నిద్రపోయినను స్వప్నావస్థయందు స్వప్నకల్పనతోపాటు స్వప్నమును చూచేవాడు కూడా అపుడు కల్పితమైన శరీరేంద్రియములతో తయారై స్వప్నము ననుభవించి మెళుకువ వచ్చిన తరువాత నిద్రతోపాటు స్వప్నదృశ్యముతో పాటు స్వప్నశరీరమును వదలి వ్యావహారిక స్వరూపుడగుచున్నాడు. స్వప్నంలో ద్రష్టకూడా తయారగుచున్నాడు గనుక స్వప్నమును చూచేవాడెవదని ప్రశ్నించ నవసరం లేదు. అందరికిని అనుభవంలో నున్న విషయంలో సందేహమెందుకు.

అటులనే అనాది అనిర్వచనీయమగు అజ్ఞానమనే నిద్రలో ఆత్మ నిద్రపోయి, అనగా అజ్ఞానముచేత ఆత్మ ఆవరింపబడి పారమార్థికమగు తన స్వరూపమును తెలిసికొనలేక స్వప్న ద్రష్టవలె జీవుడుగా బయలుదేరి కల్పితమగు దేహేంద్రియములతో అజ్ఞాన కల్పితములగు అనేక విధములైన ప్రపంచమును అనుభవించుచున్నాడు.

నిద్రయనగా ఆత్మను ఆవరించిన మూలాజ్ఞానముయొక్క పరిణామమే. అనగా అజ్ఞానమే నిద్రవలె తయారై వ్యావహారిక స్వరూపము నావరించి స్వప్నభ్రమను కలుగచేసినది. అయినపుడు నిద్రకు మూలమగు అజ్ఞానము కూడా నిద్రయొక్క స్వభావము కలదనుటలో సందేహము లేదుకదా, నిద్రస్వభావ మేమంటే తన స్వరూపాన్ని కప్పివేసి మరియొక రూపము కలవానినిగా తయారుచేసి మరియొక దృశ్యమును చూపించడమే,

అజ్ఞానమనే నిద్రకూడా పరమాత్మ స్వరూపమును మరపించి జీవునిగా తయారుచేసి ఆరోపిత ప్రపంచమును చూపించుటయేనని చెప్పవలయును.

నిద్రాసమయములో కనిపించేదే స్వప్నం. అప్పుడు చూచేవాడు కూడా మారియుంటాడు. ఈ మామూలు నిద్రకు మూలభూతమగు అజ్ఞానము నిద్రయనుటలో సందేహించనక్కరలేదు. అజ్ఞానమే నిద్ర అయినపుడు నిద్ర ఎప్పుడూ స్వరూపమును ఆచ్ఛాదన చేయును గనుక ఆ స్వరూపమును మరియొక స్వరూపం కలవానిగా తయారుచేయుననియు మరియొక ప్రపంచమును చూపించుననియు చెప్పితీరవలయును నిద్రాసమయంలో కనిపించేది స్వప్నమేగనుక అజ్ఞానం, నిద్రఅయినపుడు అజ్ఞాన సమయంలో కనిపించేదంతయు స్వప్నమనే చెప్పవలయును. ఈ స్వప్నమును చూచేవాడు కల్పితస్వరూపం కలవాడనే చెప్పవలయును.

జాగ్రదవస్థ, స్వప్నావస్థ, సుషుప్త్యవస్థ కూడా మూలాజ్ఞానమనే నిద్రాసమయంలోనే భాసించుచున్నవి గనుక. మూడు అవస్థలు స్వప్నావస్థ క్రిందనే లెక్కపెట్టి శ్రుతి మూడు స్వప్నములని చెప్పినది మామూలు స్వప్నములో పగలు జాగ్రదవస్థ రాత్రి నిద్రపోయినపుడు స్వప్నవస్థ, గాఢసుషుప్తి. ఈమూడు గోచరించినను ఈమూడు స్వప్నముగానే గ్రహించవలయునుకదా. అటులనే అజ్ఞాన నిద్రావస్థ యందు గోచరించిన అవస్థాత్రయం స్వప్నమని తాత్పర్యం. అందువలననే వేదమాత నాయనా నిద్రలేవండి, మహానుభావులవద్దకు వెళ్ళండి, జ్ఞానమును సంపాదించండి. జ్ఞానమార్గం చాలా కష్టం. ఈ విషయమును బ్రహ్మవేత్తలు చెప్పుచున్నారు, అని బోధించుచున్నది.

మామూలుగా నిద్రపోయినవానిని ఎవరయిన నిద్రాలేపినట్లు ఈ యజ్ఞాన నిద్రలో నిద్రపోయిన వానిని దయామయుడయిన గురువు నాయనా! నీవు జీవుడవు కావు. నీకు కర్తృత్వ భోక్తృత్వములు లేవు.

జనన మరణములు లేవు. శోక మోహములులేవు. ఆకలి దప్పికలు లేవు, శరీరేంద్రియములు లేవు. నీ వనుభవించు ప్రపంచమంతయు మిథ్యా భూతమే. నీయొక్క పారమార్థిక స్వరూపమేమంటే వేదాంతవేద్యమైన సచ్చిదానంద రూపమైన పరమాత్మ స్వరూపమే. అట్టి పరమాత్మ స్వరూపు డవే నీవు.

అని మహావాక్యార్థమగు జీవబ్రహ్మైక్యమును బోధించిన యెడల ఆ స్వప్నద్రష్టవలెనున్న జీవుడు నేను జీవుడను కాను, కర్తను కాను, భోక్తను కాను, నాకు జన్మ మరణాలు లేవు, ప్రపంచమంతయు భ్రమయేయని భావించుచు నేను సచ్చిదానందమగు, అద్వితీయమగు పరమాత్మ స్వరూపుడనేనని బ్రహ్మసాక్షాత్కారమును పొందును. ఈ బ్రహ్మ సాక్షాత్కారమే అజ్ఞాననిద్రలో ప్రబోధ (మెళుకువ) యని చెప్పబడును ఇట్టి ప్రబోధ కలిగిన తరువాత అజ్ఞానమనే నిద్ర నశించును, అజ్ఞాననిద్ర పోగానే ప్రపంచమను స్వప్నభ్రమ, జీవత్వభ్రమ కూడా నశించును. ఆయాత్మ అద్వితీయమగు పరమాత్మ స్వరూపముతోనుండును. ఈ స్థితియే మోక్షమని చెప్పబడును.

ఈ విషయమంతయు "యస్సాక్షాత్కురుతే ప్రబోధసమయే। స్వాత్మాన మేవాద్వయం" అను శ్లోక భాగముతో సూచింపబడినది. అద్వైత వేదాంత రహస్యము తెలుసుకొనుట చాలా క్లేశము గనుక ఈ శ్లోకమునకు వ్రాయతగిన తాత్పర్యమేగాక. సిద్ధాంతమును తెలిసికొనుటకు ఇతర విషయములనుకూడా చేర్చి విశదపరచడమైనది. చెప్పిన విషయమునే కొన్నికొన్ని విశేషములు తెలిసికొనుటకొరకు రెండు మూడుమార్లుగా వివరించితిని గనుక పునరుక్తిగా భావింపకుందురుగాక.

ఈ శ్లోక తాత్పర్యమును బాగుగా చూచినయెడల అద్వైతసిద్ధాంత రహస్యము స్పష్టముగా తెలియగలదు. శంకర భగవత్పాదులవారు లలిత

ముగా చెప్పినను, వారి వచనములయందు చాలా గంభీరములైన అర్థములు ఉండును. గనుక ఇది విస్తృతముకాదు. ఆశ్చర్యమేమంటే స్వప్నంలో అసలు స్వరూపమును మరచిపోయినను భ్రాంతిలోనే తాను ద్రష్టగా తయారుకావటం, ప్రబోధవలన భ్రాంతి పోయిన తరువాత భ్రాంతినిచూచిన ఉపాధితోకూడిన అనగా ఆ భ్రాంతి కాలమందు ఏర్పడిన శరీరేంద్రియ ములు పోయి ఒక మిగిలిన స్వరూపంతో అసలువానితో చేరి నాకేస్వప్నం వచ్చినదని భావించుచున్నాడు. స్వప్నదశయందున్న ఔపాధిక స్వరూపము పోయినట్లే, నిరూపాధికుడై ఉన్నట్లె. కాని మూలాజ్ఞానం పోలేదు గనుక మెలకువ వచ్చిన తరువాత కూడా వ్యావహారిక శరీరేంద్రియము లనే ఉపాధితో కలిసియుండటచేత నిజమైన స్వరూపమును గుర్తించ లేకున్నాము.

ఆత్మసాక్షాత్కారం కలిగిన తరువాత అజ్ఞానంపోతే ప్రపంచ స్వరూప స్వప్నమంతయుపోవును. ఈ స్వప్నదశయందు ఏర్పడిన స్థూల సూక్ష్మకారణ దేహములనే ఉపాధులు పూర్తిగా పోవును కనుక మోక్ష దశలో పూర్తిగా సర్వోపాధిరహితుడై నిర్విశేష బ్రహ్మరూపముగా స్వప్రకాశానంద రూపముగా నుండును.

శుక్తి రజతభ్రమ, రజ్జుసర్పభ్రమ మొదలగు భ్రమలలో భ్రాంతిని పొందేవాడు. అధిష్ఠానముకంటే వేరుగానున్నటుల కనిపించి నను ఆత్మాధిష్ఠానక భ్రమయందు మాత్రం, భ్రమకు అధిష్ఠానం భ్రమను చూచే ద్రష్టయు ఒకటియని అనుకోవలయును. తను స్వరూపంలో నుండి అన్యథా మరియొక స్వరూపంతో బయలుదేరుట జీవభావం. అది పోవు టయే బ్రహ్మైక్యమని దృఢముగా గమనించవలసిన విషయము.

"విశ్వం దర్పణదృశ్యమాననగరీతుల్యం" అన్నపుడు మరియొక విధముగాకూడా విమర్శించుట అవసరం. అద్దమును మనం చూచేటపుడు

మనముఖం అద్దములో గోచరించుచున్నది. ముఖం అద్దమునకు ఎదురుగా నుండును. అద్దం ముఖమునకు ఎదురుగా నుండును. మనముఖమే అద్దంలోకనిపించేయెడల అద్దమునకు ఎదురుగా ముఖం అద్దంలో ప్రతిబింబిస్తే మన వెనకభాగమే అద్దంలో మనకు కనిపించవలయునుగాని మనకు ఎదురుగా నున్నట్లు కనిపించడం ఎట్లు కుదురును, అంటే మనం అద్దం చూచినపుడు మన నేత్రములనుండి సూర్యకిరణములవంటి కిరణములు బయలుదేరి అద్దమునకు తగిలి. మరల తిరిగి మన ముఖమునకు తగిలి మన ముఖమును అద్దమందున్నట్లు కనిపింపచేయుచున్నవని ఒక సమాధానం చెప్పెదరు.

ఈ విధంగా చెప్పేయెడల మనం నీళ్ళలో సూర్యప్రతిబింబం చూచేటపుడు, మన నేత్రకిరణములు నీటిమీదికి వెళ్ళి తగిలి తిరిగి సూర్యమండలమునకు పోయి ఆ సూర్యమండలమును తగిలి ఆకాశమందలి సూర్యుని భూమిలో మనం చూస్తున్న నీటిలో నున్నట్లు కనిపింపచేయుచున్నవని చెప్పవలయునుకదా. పెద్ద అద్దంలో పట్టణం కనిపిస్తున్నదంటే అద్దమును చూచేవారికి నేత్రకిరణములు అద్దమునకు తగిలి, ఆ నేత్రకిరణములు నగరమునకు తగిలి ఆ నగరమును అద్దంలోనున్నట్లు కనిపింపచేయుచున్నవని చెప్పవలయును. ఇది సంభవమేనా అంటే.

సమాధానం: అద్వైతులు ఇంద్రియములద్వారా సూర్యమండలం చంద్రమండలం మనకు కనిపించేటపుడు ఆకాశమందున్న సూర్యుడు, భూమియందున్న మనకు ఎట్లు కనిపిస్తాడు. చూచేవానికి చూడబడే వస్తువులకు సంబంధం ఉండవలయునుకదా. సూర్యుని వెలుతురులో ప్రపంచం. కనిపించుచున్నదంటే సూర్యబింబం ఆకాశమందున్నను సూర్యబింబం వెలుతురు భూమండలంమీదికిదిగి, ప్రపంచమంతయు వ్యాపించి ప్రపంచమును కనిపించేటట్లు చేయుచున్నది. ప్రకాశింపచేసే వెలుతురుకు ప్రకాశింపచేయ

బడే ప్రపంచమునకు సంబంధం కలిగినదికనుకనే ఆ వెలుతురులో ఆ ప్రపంచం కనిపిస్తున్నది.

ఈ విధంగానే దీపం ఒకచోట నున్నను దాని వెలుతురు కొంతమేర వ్యాపించును గనుక ఆ వెలుతురు వ్యాపించినంతవరకున్న వస్తువులు ఆ వెలుతురులో కనిపించుచున్నవి ఈ విధంగానే చంద్రుని వెలుతురులో వస్తువులను చూచుట మొదలగు జ్ఞానములు కలుగుచున్నవి. ఈ యనుభవమునుబట్టి తెలియచేసే వెలుతురుగాని మరొకటిగాని తెలియచేయబడే వస్తువులమీదికైనా రావాలి, లేక తెలియబడే వస్తువులు తెలియజేసే వెలుతురుమీదికెనా వెళ్ళాలేకాని, ఆ వెలుతురు వ్యాపించకుండా అక్కడనే యుండి ఈ వస్తువులు ఇక్కడనే వున్నప్పుడు పరస్పరం సంబంధం లేకపోతే ఆ వెలుతురువల్ల మనకు వస్తువులు కనిపించుట కవకాశంలేదుకదా.

అయినపుడు ఆ వెల్తురువల్ల మన కుపయోగం ఉండదుకదా! గనుక వెల్తురు ప్రకాశింపచేయగలిగిన వస్తువులమీదికి వ్యాపించుననియే అనుభవమును బట్టి చెప్పితీరవలెను. మనం ప్రపంచ వస్తువులనుగాని, సూర్యమండలమునుగాని, చంద్రమండలమునుగాని, నక్షత్రములనుగాని చూచునపుడు అవి మనకు కనిపిస్తున్నవికదా! ఎట్లా కనిపిస్తున్నవని విమర్శించవలయును. తెలుసుకునే మనంగాని, మన దృష్టిగాని సూర్యమండలంవద్దకో, దూరంగావుండే వస్తువులవద్దకో పోవాలి. లేక ఆ సూర్యమండలం దూరమందుండే వస్తువులును, మనవద్దకువచ్చి మన దృష్టికి సంబంధించాలి. లేకపోతే అవి మనకు కనిపించవు.

మన అనుభవాన్నిబట్టి చూస్తే సూర్యుని వెల్తురు క్రిందికి వచ్చినను సూర్యబింబం మనవద్దకు రావడంలేదు. కాని సూర్యబింబంకూడా మనకు కనిపిస్తున్నది దూరమందుండే పర్వతములు, వృక్షములు మనవద్దకు రావడంలేదు. కాని కనిపిస్తున్నవి. సంబంధంలేనివి కనిపించవు గనుక,

మనమే మనదృష్టితో కూడా సూర్యమండలంవద్దకు, మనకు కనిపించే ఇతర వస్తువుల వద్దకు వెళ్ళుచున్నామని చెప్పవలయును.

ఎట్లాగంటే, మన నేత్రములతో వస్తువులను చూడగానే మన హృదయ పుండరీకములోనున్న మన అంతఃకరణ అతిశీఘ్రముగా సూర్య మండలమునకు వెళ్ళి సూర్యబింబాకారాకారితమగును. అనగా, నీరు పాదుల లోనికి వదలినపుడు పాదు నాల్గుపలకలగానుంటే నాల్గుపలకలగాను, గుండ్రంగానుంటే గుండ్రంగాను పాదులలో వ్యాపించును. అటులనే అంతఃకరణ ఏ వస్తువులమీదికి ఇంద్రియములద్వారా వెళ్ళునో ఆ వస్తువులనిండా తదాకారముగా పరిణమించునని యర్థము. జీవచైతన్యముకూడా అంతఃకరణతో పాటు సూర్యమండలమునకు హృదయము నుండియే వెళ్ళునని, ఆ వృత్తి యందు చైతన్యం ప్రతిబింబించునని ఆ వృత్తి ప్రతి బింబిత చైతన్యమే జ్ఞానమని, ఆ జ్ఞానమునకు సూర్యమండలం గోచ రించునని చెప్పెదరు. అటులనే అన్నివిషయములలోను గ్రహించ వచ్చును.

ఇట్లయితేనే అంతఃకరణ అనేదృష్టికి, సూర్యమండలమనే దృశ్య మునకు ద్రష్టయనే జీవునకు సంబంధం కలుగును. అందువలననే మనం ఆ దూరవస్తువులను చూచి తెలుసుకొనుచున్నాము. అని మన అద్వైత సిద్ధాంతంలో జ్ఞానోత్పత్తి ప్రక్రియను చెప్పెదరు. సూర్యుడు సూర్య మండలంలో నుండియే వెల్తురుతో ప్రపంచమంతయు వ్యాపించుచున్నాడు. అటులనే మనలోనున్న చైతన్యము, మన శరీరములోనుండియే ఇక్కడ వదలకుండా నేత్రగోళకద్వారా అంతఃకరణతో సూర్యమండలాది ప్రదేశ మునకు వెళ్ళి గ్రహించుచున్నది. సూర్యుని వెల్తురు భౌతికమైనది గనుక రూపము కలిగియున్నది. అందుచేతనే సూర్యమండలమునుండిభూమండలం వరకు, వ్యాపించినంతవరకు, మధ్యలోకూడా కనిపించుచున్నది. చైతన్యం

రూపంలేనదిగనుక ఇంద్రియద్వారములనుండి అంతఃకరణతో సూర్య మండలంవరకు వ్యాపించినను మధ్యలో కనిపించుటలేదు.

ఇంద్రియములకు గోచరించేది కాదు, గనుక మన చైతన్య స్వరూప ముతో అన్నిటిని తెలుసుకుంటున్నాముగాని మన ఆత్మను మనం తెలుసు కొనలేకున్నాము. దీనినిబట్టిచూస్తే మన నేత్రకిరణములు అద్దమునకు తగిలి తిరిగివచ్చి మన ముఖమును అద్దమందున్నటుల కనిపించేటట్లుచేయు చున్నవనే విషయం పెద్ద ఆశ్చర్యం కాదు. మనం ఈ విమర్శ చేయనందు వలన ఆశ్చర్యపడవలసినదేగాని విమర్శించిన మనస్సుకు సమాధానం కలుగును.

అద్దంలో వస్తువులున్నట్లు కనిపించడం, యథార్థజ్ఞానం అనడానికి వీలులేదు. యథార్థవస్తువులు లేవుగనుకనే, యథార్థజ్ఞానమైతే, ఉన్న వస్తు వులే కనిపించునుగాని, లేనివస్తువులు కనిపించవు. అద్దంలో ఆ వస్తువులు ఇమడవు గనుక, అప్పటికప్పుడు అద్దంలో ఆ వస్తువులు, పుట్టి కనిపించు చున్నవని యనుటకు వీలులేదు. అద్దంలోనే కనిపించే వస్తువులు పుడితే అద్దం పగిలిపోవలెకదా.

అద్దంలో కనిపించే వస్తువులు సత్యమైతే, ఆ జ్ఞానం యథార్థమైతే, శంకర భగవత్పాదులవారు "విశ్వందర్పణ దృశ్యమాన నగరీతుల్యం నిజాంతర్గతం". అని ఆత్మయందు ప్రపంచం భ్రమగా కనిపించుచున్నదని చెప్పుటకు, ఈప్రపంచం అద్దంలో కనిపించే ప్రపంచంలాంటిదని దృష్టా న్తంగా ఎందుకు చెప్పేదరు. భ్రమకు దృష్టాంతంగా చెప్పుచున్నారుగనుక అద్దమందు కలిగే ప్రతిబింబ జ్ఞానం భ్రమయనే శంకరభగవత్పాదులవారి హృదయమని చెప్పవలయును.

భ్రమయనగా ఒకదానియందు మరియొకటి యనే జ్ఞానమేకదా! అనగా భ్రమలో ఒకవస్తువుయందు అజ్ఞానముచేత తాత్కాలికముగా గోచ

రించే వస్తువు కల్పితమగునుకదా! అయితే ఇక్కడ దేనియందు ఏది కల్పింపబడుచున్నది? అసలు ముఖంగా, ప్రతిబింబించే ఇతర వస్తువులు గాని, యథార్థమైనవి, దగ్గరనే యున్నవిగనుక అద్దములో అవియే కల్పితమైనవని చెప్పుటకు వీలులేదుకదా, అంటే.

ఈ విషయంలో కొందరు ఒకవిధంగా సమాధానం చెప్పిరి. ఒకచోట స్ఫటికమున్నది. దాని ప్రక్కన్నే జపాకుసుమ మున్నది. స్ఫటికం తెల్లగా స్వచ్ఛంగా నుండునుకదా. జపాకుసుమం బాగా ఎరుపుగా నుండును కదా. జపాకుసుమమందున్న ఎరుపు స్ఫటికమందు ప్రతిబింబించి కనిపించు చున్నది. ఇక్కడ స్ఫటికమందు ఎరుపు కల్పితమని చెప్పుటకు వీలులేదు. ఎందుచేతనంటే జపాకుసుమం దగ్గరనే యున్నది గనుక ఆ స్థలంలో స్ఫటికం ఎరుపుగా నున్నదనే జ్ఞానాన్ని ఏమనవలెనంటే భ్రమ అనకుండా, అన్యథాఖ్యాతి యనవచ్చు నన్నారు. అన్యథాఖ్యాతి యనగా ఒకచోటవున్న వస్తువు మరియొకచోట వున్నట్లు కనిపించుటయే.

అయితే ఇక్కడ ఒక విశేషం. స్ఫటికం కనిపిస్తూ స్ఫటికానికి దగ్గరనే జపాకుసుమముండి ఏదైనా అడ్డముండుటచేత జపాకుసుమం మనకు కనిపించకుండా ఆ జపాకుసుమం ఎరుపుమాత్రం స్ఫటికమందు కనిపించినపుడు, అనగా స్ఫటికం ఎరుపుగా నున్నదనేజ్ఞానం భ్రమయే. అనగా ఆ ఎరుపు స్ఫటికమందు కల్పితమైనట్లే. అది పూర్తి భ్రమయనే చెప్పవలయును. జపాకుసుమం, స్ఫటికం రెండు వేరువేరుగా కనిపిస్తు న్నపుడు స్ఫటికమందు ఎరుపుగా నున్నదనే జ్ఞానంమాత్రం అద్వైతులు చెప్పే భ్రమకాదు అన్యథాఖ్యాతి యనే చెప్పవలయుననిరి.

అయితే అద్దంకనిపిస్తూ అద్దమందు ప్రతిబింబించే వస్తువులుకూడా వేరుగానున్నట్లు మనకు కనిపించనపుడు ఆ వస్తువులు అద్దంలో కనిపిస్తే, అవి కల్పితమైనట్లేకదా. ఆ జ్ఞానం భ్రమయేకదా. అట్లయితే అద్దమందు

ఒక నగరంగాని, కొన్ని వస్తువులుగాని కనిపించినవంటే, అద్దమును మాత్రం చూస్తూ నగరమును, ప్రతిబింబించే అసలు వస్తువులను చూడకుండా నున్నవ్యక్తికి అద్దంలో కలిగిన ఆ వస్తు ప్రతిబింబజ్ఞానం భ్రమయనియే చెప్పవచ్చును. ప్రతిబింబించే ఆరోగ్య వస్తువులు దగ్గరగానున్నను కనిపించకుండావుండి అద్దంలో కనిపిస్తే మాత్రం అసలువస్తువులు వేరుగా కనిపిస్తూ అద్దంలో కనిపిస్తే మాత్రం అన్యథాఖ్యాతి అంటామనిరి. అటులనే ప్రపంచం ఆత్మయందు నిజముగా లేదని, భ్రమగా కనిపించుచున్నదని, భగవత్పాదులవారు చెప్పిరి.

కొందరు అద్దంలో మన ముఖంగాని, కొన్ని వస్తువులుగాని కనిపించినపుడు మన ముఖమందే అద్దమందున్నట్లు మన కెదురుగా నున్నట్లు ఈ స్థితి కల్పితమైనది. ఇదియే ఇక్కడ భ్రమయని చెప్పిరి. భ్రమయనగా ఒకవస్తువును మరియొక వస్తువు కనిపించడంకదా. శుక్తి వెండివలె, తాడు సర్పంవలె కనిపించిందంటే అది భ్రమ అంటే సరిపోతున్నది కాని ఇక్కడ అద్దంలో వస్తువులు కనిపిస్తే ఏ వస్తువు ఏ వస్తువుగా కనిపించింది? అధిష్ఠానం ఏది? ఆరోపం ఏది? అని ప్రశ్నించవచ్చును. సమాధానం: అద్దంలో కనిపించే నగరంవలె, కనిపించే ఇతరవస్తువుల వలె కనిపించుచున్నది. అద్దమే అధిష్ఠానం. అందులో కనిపించే వస్తువులే ఆ రోపం అంటారు.

ఒక వస్తువు మరియొక వస్తువుగా కనిపించిన భ్రమ యనవచ్చును గనుక అద్దమే ప్రతిబింబముగా కనిపించుచున్నదంటే భ్రమయని చెప్పుట కుదిరినది. ఏవస్తువు దగ్గరవుంటే ఆ వస్తువే అద్దంలో ఎందుకు కనిపించవలె, మరియొక వస్తువుగా ఎందుకు కనిపించకూడదు. అంటే సమాధానం: భ్రమ ఎప్పుడు ఒక దోషమును బట్టియే కలుగుచుండును. కామెర్లు అనే దోషము కలవారికి తెల్లగానున్న శంఖం పచ్చగా నున్నట్లు

కనిపించును. నాలుకయందు దోషంకలవానికి తియ్యని బెల్లముక్క నాలుకయందు వేసుకున్నప్పుడు చేదుగానున్నట్లు గోచరించును. అద్దంలో భ్రమకలుగుటలో బింబసాన్నిధ్యమే. అనగా బింబం దగ్గర వుండుటయే దోషంగనుక, అద్దం ఏ వస్తువుదగ్గరవుంటే ఆ వస్తువుగానే కనిపించుచుండును. అనగా అద్దంలో కనిపించుచుండును. బింబసాన్నిధ్యమును లేకుండా చేసినయెడల ఆ భ్రమ పోవును. మరియొక వస్తువు దగ్గరనున్న యెడల ఆ వస్తువే అద్దంలో కనిపించును. ఇట్టిదోషమే ఈ భ్రమలో కారణం గనుక. అద్దమే అధిష్ఠానం గనుక అధిష్ఠానంలోనే ఆరోపం కనిపించును గనుకను అద్దంలో కనిపించే దృశ్యము లన్నియు అద్దంలో నున్నట్లెగాని బైటలేవు. అద్దంకంటె వేరులేదుకూడా (ఉండడమనగా కనిపించడమనే యర్థం). అటులనే అధిష్ఠానమగు ఆత్మయందు కల్పితమై కనిపించే ప్రపంచమంతయు ఆత్మయందే యున్నదిగాని మరియొక చోట ఉండదు. అందుచేతనే నిజాంతర్గతం అని చెప్పిరి.

ఈ విషయంలో ఒక ప్రశ్న! అధిష్ఠానం కనిపించే సమయంలో ఆ యధిష్ఠానమందు భ్రమ కలుగదు. తాడును తాడని గుర్తించిన సమయంలో సర్పమనే భ్రమ కలుగదుకదా! అద్దమని మనకు తెలుసును. అద్దంలో మన ముఖం లేదు ఇతర వస్తువులు లేవు అని దృఢంగా తెలిసినను,అద్దంలో ముఖమున్నట్లు వస్తువులున్నట్లు కనిపించుచున్నవి. కారణమేమి? అంటే ఈ ప్రశ్నకు సమాధానం: దోషం లేనపుడు అధిష్ఠాన సాక్షాత్కారం కలిగియుంటే భ్రమ కలుగదుకాని దోషమున్నపుడు అధిష్ఠానం తెలిసియున్నను భ్రమ కలుగుచునేయుండును.

శంఖం తెల్లగానే యున్నది. పచ్చగా లేదని బాగా తెలిసినను కామెర్ల దోషము కలవాని కళ్ళకు శంఖం పచ్చగానే యున్నట్లు కనిపించుచున్నది. కామెర్లు అనే దోషమును పోగొట్టుకుంటే శంఖం పచ్చగానున్న

దనే భ్రమ కలుగదు బెల్లం తియ్యగానే యున్నది చేదులేదని బాగా తెలిసి యున్నను. జిహ్వాదోషం కలవానికి బెల్లం నాలుకమీద వేసుకున్నపుడు బెల్లం చేదుగనే యుండును. జిహ్వాదోషమును పోగొట్టుకొన్న యెడల చేదుగా నున్నటుల భాసించదు. ఇటులనే ఆకాశంలో రూపంలేదని బాగా తెలిసినను దూరత్వదోషంవల్ల, ఆకాశం నల్లగా నున్నట్లు భ్రమ కలుగుచునేయున్నది. దగ్గరికి పొయ్యేకొద్ది దూరత్వదోషం పోవునుగనుక ఆ నలుపు కనిపించదు. ఇంకాదూరంలో నలుపుగానున్నట్లు కనిపించును శాస్త్రప్రమాణముచేత చంద్రుడు ప్రపంచంకంటే విశాల స్వరూపుడని తెలిసియున్నను దూరత్వదోషంవల్ల జానెడు పరిమితిలో గుండ్రముగా కనిపించుచున్నాడు.

సముద్రం ఉదకమని తెలిసియున్నను దూరంగా నున్నవారికి నల్లని రాళ్ళవలె కనిపిస్తుంది. దగ్గరికి వెళ్ళిచూస్తే దూరత్వదోషం పోవును గనుక నీరు నీరుగనే కనిపించును. స్ఫటికం తెల్లగానే యున్నది' ఎఱ్ఱనిది కాదని తెలిసినను జపాపుష్పందగ్గర నున్నపుడు ఎరుపుగా నున్నట్లే కనిపించును. జపాకుసుమం తీసివేసినపుడు ఆ భ్రమ పోవును. అటులనే అద్దంలో కనిపించేవి ఏమీలేవని తెలిసినను ప్రతిబింబించే అసలు వస్తువులు ఎదురుగా నున్నపుడు. అద్దంలోనున్నట్లు భ్రమ కలుగుచునే యుండును.

పైన ఉదహరింపబడిన దృష్టాంతము లన్నియు, అధిష్ఠానం తెలిసియున్నను, దోషమున్నంతవరకు మరియొక విధంగా భ్రమగా గోచరించు చుండునని చెప్పుటకే ఉదహరింపబడినవి. అద్దమందు కలిగే ప్రతిబింబ భ్రమ ఉపాధినిబట్టియు బింబమును బట్టియు కలుగుచున్నది. అద్దంలో కనిపించే ప్రతిబింబం ఉపాధియగు అద్దమునకు బింబమగు అసలు వస్తువు

లకు అధీనమై యున్నదిగాని స్వతంత్రం కాదు. ప్రతిబింబం అద్దం కద లినా కదులుతుంది, బింబం కదిలినా కదులుతుంది.

బింబం ఏరంగుతో నుండునో ఆ రంగుతో కనిపిస్తుంది. ఒకప్పుడు అద్దం ఏ రంగుతో నుండునో ఆ రంగుతో కనిపిస్తుంది. అందుచే ప్రతి బింబమునకు బింబమే పరమార్థ స్వరూపమని చాలామంది అంటారు. బింబముంటేనే ప్రతిబింబం కనిపించును. లేకపోతే ప్రతిబింబం కనిపిం చదు కూడా. మరియొక పక్షం, మన ముఖం అద్దమున కెదురుగా నున్నది అద్దం మనకెదురుగా నున్నది. అద్దంవలె అద్దంలో ప్రతిబింబం కూడా మనకెదురుగా నున్నది గనుక. అద్దమే ప్రతిబింబంవలె గోచరించుచున్నది. అందువలననే భ్రమ యన్నారు. మొత్తానికి అద్దంలో లేనిది అద్దంలో నున్నట్లు కనిపించినది గనుక భ్రమ యనవచ్చును.

కొందరు అద్దమే ప్రతిబింబమువలె కనిపిస్తున్నది గనుక అద్దమే ప్రతిబింబమునకు పరమార్థము. అద్దముంటేనే ప్రతిబింబంకనిపిస్తుంది. లేక పోతే కనిపించదు. గనుక ఆ పక్షంలో పూర్తిగా భ్రమయని చెప్పవచ్చును. అయితే శుక్తి రజత భ్రమలో, రజ్జు సర్ప భ్రమలో అధిష్ఠానములైన శుక్తి రజ్జువులు అజ్ఞానము చేత నావరింపబడి తెలియకుండా వుండే దశలోనే భ్రమ కలుగుచున్నదికదా. ప్రతిబింబములో తెలియబడకుండా వుండే అధిష్ఠానం ఏది లేదే అని ప్రశ్నించవచ్చును. సమాధానం: భ్రమలన్నియు ఒకవిధంగా ఉండవు. కొన్నిచోట్ల అసలు వస్తువు అజ్ఞానముచేత ఆవరింప బడును. కొన్నిచోట్ల అధిష్ఠానం తెలియుచున్నను. దోషంవల్ల భ్రమ కలుగు చుండును. ఈ విషయం పైన వివరింపబడినది. శంకర భగవత్పాదులవారు శుక్తికాహి రజతవ దవభాసతే, ఏకశ్చంద్రస్స ద్వితీయవత్ అని అధ్యాస భాష్యంలో ఉదహరించిరి. అనగా శుక్తి వెండివలె కనిపించుచున్నది. ఒక చంద్రుడు ఇద్దరు చంద్రులవలె కనిపించుచున్నాడని యర్థము. ఒకవస్తువు

మరియొక వస్తువుగా కనిపించుటలో శుక్తి రజత భ్రమను దృష్టాంతముగా చెప్పిరి. ఒక వస్తువు అనేక వస్తువులవలె కనిపించుటలో, ఒక చంద్రుడు అనేక చంద్రులవలె కనపించునని దృష్టాంతము చెప్పిరి. శుక్తి రజత భ్రమలో శుక్తి యజ్ఞానముతో ఆవరింపబడినట్లు ఒక చంద్రుడు అనేక చంద్రులవలె కనిపించుటలో చంద్రుడు అజ్ఞానంతో నావరింపబడియుండ లేదు. ఒకానొక దోషంచేతనే అనేకంగా కనిపిస్తున్నాడు.

ఒక విధమైన రేచీకటి కలవానికి ఒక చంద్రుడు ఇద్దరు చంద్రుల వలె కనిపించును. ఒకదీపం రెండుదీపములవలె కూడా కనిపించును. కన్ను నొక్కినపుడు అందరికిని ఒక చంద్రుడు ఇద్దరు చంద్రులవలె, ఒక దీపం రెండు దీపములవలె కనిపించును. గనుక భ్రమలు అనేకవిధము లుగా నుండును. అందుచేత అద్దంలో కలిగే ప్రతిబింబ భ్రమ ఒక విధ మైనది. అద్దంలో కనిపించేవి సత్యములు కావు. విమర్శించిన అద్దంకంటే వేరుగాకాని, బింబంకంటె వేరుగానున్నట్లు రుజువుకావు. అటులనే ఆత్మలో కనిపించే ప్రపంచం ఆత్మకంటే వేరుగాలేదని ఋజువుకాదు అని శంకర భగవత్పాదులవారి హృదయమని గ్రహించవచ్చును. ఈ విషయంలో శాస్త్రయుక్తు లనేకముగా నున్నను అందరికి సిద్ధాంతం తెలియుటకు అను గుణముగా ఒకరకంగా తేర్చి యథాశక్తిగా వ్రాసితిని (ఇంకా విపులముగా వ్రాసిన చదువుటకు కూడా కష్టమగును) శంకర భగవత్పాదులవారి భాష పైకి సులభముగా నున్నట్లు కనిపించినను ఆ భాషలో అర్థము చాలా గంభీ రముగా నుండును. 'విశ్వం దర్పణ దృశ్యమాన నగరీతుల్యం నిజాన్త ర్గతం' అని చెప్పుటవలన ఆత్మయందు ప్రపంచస్థితిని ప్రపంచ స్వరూప మును ఎట్లు గ్రహించవలసినది పూర్తిగా చెప్పిరి. 'యస్సాక్షాత్కురుతే ప్రబోధ సమయే స్వాత్మానమేవాద్వయం' అని చెప్పుటవలన, ఆత్మసాక్షా త్కారము కలిగిన తరువాత ప్రపంచభ్రమ జీవత్వభ్రమ పోయి, పర మాత్మ స్వరూపముగా నుండుటలో స్వప్నభ్రమను మేలుకువ వచ్చిన తరు

వాత స్వప్న ప్రపంచం పోయి స్వప్నమందు కల్పితమగు తన ఔపాధిక స్వరూపం కూడా పోయి, వ్యవహారిక పరమార్థ స్వరూపంతో నున్నాడని ఉదాహరణగా చూపించిరి. గనుక ఈ శ్లోకం ఎంత గంభీరార్థము కలదో ఆలోచించండి. సంగ్రహముగా అద్వైతసిద్ధాంతమంతయు ఈ శ్లోకము నందు చూపించబడినది. అవిద్యాదశ విద్యాదశ జీవస్వరూపము. పరమాత్మ స్వరూపస్థితి. విషయ ప్రయోజనాదులను అతి హృదయంగమముగా ప్రబోధించిరి. గనుక తత్వజిజ్ఞాసువులు ముఖ్యముగా ఈస్తోత్రసారమును గ్రహించవలయును.

ఇట్లు ద్వితీయ శ్లోక తాత్పర్య వివరణం సమాప్తం.

అవతరణిక :-

వెనుక శ్లోకమందు పరమాత్మయందు ప్రపంచమంతయు ఉండునని, నిజాంతర్గతం అను పదముతో స్పష్టపరచిరి. అది కుదరదనియా శంకించవచ్చును. పరమాత్మ జగత్కారణ మయ్యేయెడల కారణమైన పరమాత్మయందు కార్యమైన ప్రపంచం ఉండవచ్చునుగాని, నిర్వికారమైన, నిర్గుణమైన పరమాత్మ దీనిని గురించియు కారణం కానేరదు.

ఆరంభవాదమని, పరిణామవాదమని రెండు విధములుగా కార్య కారణ భావమును చెప్పే వాదములు కలవు. ఆరంభవాదులు తార్కికులు, పరిణామవాదులు సాంఖ్యులు మొదలగువారు. ఆరంభవాద మనగా కొన్ని కారణములు కలసి ఆ కారణములకంటే కార్యమును వేరుగా పుట్టించు విధానమే. అది ఎటులననగా ఒక కుండ అనే కార్యం పుట్టవలయునంటే, కుమ్మరివాడు, మట్టి, నీరు, చక్రం మొదలగు కారణములవలన ఆ కుండ అనే కార్యం పుట్టి, మట్టి అనే ఉపాదాన కారణమం దుండును. ఈ మతంలో కార్యకారణములు పూర్తిగా భిన్నములు. ఈ విధముగా పరమాత్మ జగత్తునుగురించి కారణం కానేరదు. పరమాత్మయనగా జ్ఞాన

స్వరూపం. అది వ్యాపకం. అద్వితీయం. అనగా రెండవవస్తువు లేనిది అద్వితీయమైన పరమాత్మ ఇతర కారణములులేకుండా ప్రపంచమునకు ఉపాదాన కారణం కానేరదు గనుక ఆరంభవాదరీత్యా పరమాత్మ జగత్కారణమని, పరమాత్మయందు జగత్తుఉండునని చెప్పుటకు వీలులేదు.

ఇక పరిణామవాదరీత్యా పరమాత్మ ప్రపంచమును గురించి,కారణమని చెప్పవలయును. అటుల చెప్పుటకుకూడా వీలులేదు. పరమాత్మ నిర్వికారము. అనగా వికారమును (మార్పును) పొందనిది. నిరవయవము అనగా అవయవములు లేనిది లోకంలో సముద్రోదకం తరంగములవలె, బుడగలవలె పరిణామమును పొందుచున్నది. జలం అవయవములు కలదే. అందువలననే పరిణమించగలుగుచున్నది. గనుక జలపరిణామమైన తరంగాది వికారములన్నియు కార్యములే గనుక పరిణామి కారణమైన అనగా ఉపాదాన కారణమైన జలమునే ఆశ్రయించియుండును.

ఉపాదాన కారణమైన కార్యం దేనియందు పుట్టి, స్థితినిపొంది, లయించునో అది ఆ కార్యమునుగురించి, ఉపాదానకారణమని చెప్పబడును. ప్రకృతంలో తరంగములు, నురుగులు, బుడగలు అనే కార్యములు కారణమగు జలమందే పుట్టి, జలమందే ఉండి, జలమందే లయించుచున్నవి గనుక, ఆ జలం తరంగాది వికారములను గురించి ఉపాదాన కారణమగును. అటులనే మట్టి, కుండలు, మూకుళ్ళు మొదలగు కార్యరూపముగా పరిణామమును పొందునుగనుక, కుండలు మొదలగు కార్యవర్గమునకు, మట్టి పరిణామ్యుపాదాన కారణమగుచున్నది. కుండలు మొదలగు కార్యములన్నియు మట్టియందే ఉత్పత్తి స్థితి లయములను పొందుచుండును. ఇటులనే బంగారము,, గొలుసులు, ఉంగరములు మొదలగు అనేక భూషణస్వరూపముగా పరిణామమును పొందును. ఇట్టి పరిణామ కార్యములన్నియు ఉపాదానమైన బంగారమునే ఆశ్రయించి యుండును

ఇటులనే దారములయందు వస్త్రములు, ఇత్తడియందు ఇత్తడి వికారమైన ప్రాతలు ఆశ్రయించి యుండును. సకల ప్రకృతి ద్రవ్యములయందును ఆయా ప్రకృతి వికారములగు కార్యములన్నియు వాటివాటి ప్రకృతుల యందు పుట్టుచు, స్థితిని పొందుచు, లయించుచుండును. ప్రకృతికంటే వికారములు వేరుకావు. వికారము లన్నింటికిని ప్రకృతియే పరమార్థరూప ముగా నుండును.

ఇటులనే పరమాత్మ ప్రపంచమునుగురించి పరిణమించే ప్రకృతి అయ్యేయెడల ప్రపంచమనే పరిణామకార్యము, ప్రకృతియగు పరమాత్మ యందు పుట్టునని, యుండునని, లయించుననియు, ప్రపంచమనే కార్యం పరమాత్మకంటే వేరుగాలేదని, ప్రపంచమనే కార్యమునకు పరమాత్మయే పరమార్థమని, పరమాత్మ సర్వవ్యాపకమని సర్వాత్మకమని, చెప్పుట కవ కాశ ముండును. కాని, పరమాత్మ అవయవములు లేనిదిగనుకను. క్రియ లేనిదిగనుకను, ప్రపంచరూపముగా పరిణామమును పొందనేరదు. ఇదియే గాక పరమాత్మ ప్రపంచమునుగురించి పరిణామికారణమయ్యే యెడల అనేక దోషములు సంభవించును. లోకంలో ఒక ప్రకృతి కార్యముగా పరిణమించునపుడు సజాతీయమగు కార్యముగానే పరిణమించుచున్నది.

బంగారమనే ప్రకృతిద్రవ్యము సజాతీయమగు బంగారు భూష ణములుగానే పరిణమించుచున్నదిగాని, వెండిపాత్రలవలె, రాగిపాత్రలవలె పరిణమించుట లేదుగదా! అటులనే వెండి, వెండిపాత్రలుగా పరిణ మించుచున్నదిగాని, విజాతీయమగు ఇత్తడి మొదలగు పాత్రలుగా పరిణ మించుటలేదు. ఇటులనే రాగి రాగిపాత్రలుగానే పరిణమించును. మట్టి మట్టిపాత్రలుగానే పరిణమించునుగాని, ఇతరములుగా పరిణమించవుగదా! అటులైన సచ్చిదానంద స్వరూపమైన, నామరూపక్రియారహితమైన పర మాత్మ ప్రపంచరూపముగా పరిణమించేయెడల ప్రపంచమంతయు సచ్చిదా

నంద రూపముగాను, నామరూప క్రియారహితముగాను ఉండవలసి వచ్చును.

ప్రపంచం నామరూపసహితముగాను. దుఃఖరూపముగాను గోచరించుచున్నది. చేతనమైన పరమాత్మలోనుండి అచేతనమగు ప్రపంచ పరిణామము ఏర్పడుటకు వీలులేదు. అందుచేత పరిణామవాదానుసారముగా కూడాపరమాత్మ జగత్కారణమని సమర్థించుట కవకాశంలేదు. అనేక ఉపనిషత్తులయందు సచ్చిదానందమగు పరమాత్మనుండియే ఆకాశాది భూత భౌతికములు పుట్టుచున్నవని స్పష్టమగుచున్నది. అందుచేత పరమాత్మ పరిణామవాదము ననుసరించియు, ఆరంభవాదము ననుసరించియు కారణం కాకపోయినను వివర్త వాదానుసారముగా బ్రహ్మ జగత్కారణమగునని అనగా రజత భ్రమకు శుక్తివలె, స్వప్న భ్రమకు ఆత్మవలె పరమాత్మ ప్రపంచమునకు కారణమగునని వివర్తవాదమును సమర్థించుచు, శంకర భగవత్పాదులవారు ఈ శ్లోకమును వ్రాసిరి.

శ్లో॥ బీజస్యాన్తరివాంకురో జగదిదం ప్రాఙ్నిర్వికల్పం పునర్మాయా
కల్పిత దేశకాల కలనా వైచిత్ర్య చిత్రీ కృతం మాయావీవ
విజృంభయత్యపిమహాయోగీవయస్స్వేచ్ఛయా తస్మైశ్రీ గురు
మూర్తయేనమఇదం శ్రీ దక్షిణామూర్తయే॥3॥

ప్రతిపదార్థ నిరూపణము॥

ఇదం=ఈఅనుభవములోనున్న ప్రపంచమంతయు. ప్రాక్=సృష్టి కంటె పూర్వమందు. నిర్వికల్పం,=భోక్త, భోగ్యము, కర్తా కార్యములను వికల్పరహితమై (ఆకారము లేనిదై) పరమాత్మ స్వరూపముగానే, అసీత్= ఉండెను. అది ఎటులనగా దృష్టాంతమును చెప్పుచున్నారు. బీజస్య= విత్తనంయొక్క; అంతః=లోపల, అంతరఇవ=మొక్కవలెఅనగా,ఆకులు

పుష్పములు, కాయలు, కొమ్మలు, ఊడలు మొదలగు ఆకారములతోకూడిన గొప్ప పరిమితిగల వృక్షమంతయు మొక్క పుట్టుటకు పూర్వమందు స్థూలాకారములేని కారణమగు బీజరూపముగా నుండెనని (యర్థము), అటులనే ప్రపంచమంతయు సృష్టికి పూర్వమందు కారణమగు బ్రహ్మ రూపముగా నుండెననియర్థము. పునః=తిరిగి, సృష్టిసమయమందు మాయా కల్పిత దేశకాల కలనా వైచిత్ర్య చిత్రీకృతం-మాయా=ఈశ్వరుని ఆశ్రయించిన మాయచేత, కల్పిత=కల్పింపబడిన. దేశ=దేశము, కాల=కాలము, కలనా=వాటియొక్క సంబంధమువీనిచేత, వైచిత్ర్యచిత్రీకృతం-వైచిత్ర్య= నానారూపమగు విచిత్రస్వరూపముతో; చిత్రీకృతం=అనేక భేదములచేతను అనేక ఆకారముచేతను పరస్పర భిన్నముగా చేయబడినది. కుమ్మరివాడు మొదలగు వారు తనుగాక మట్టి మొదలగు సాధనములతో ఘటాది కార్యములను చేయుచున్నట్టు మనకు అనుభవసిద్ధమై యున్నది. ఇతర సాధనలులేని పరమేశ్వరుడు విచిత్రమగు ప్రపంచమును ఎటుల సృష్టించును అనే ప్రశ్నకు సమాధానం చెప్పుచున్నారు. మాయావీవ విజృంభ యత్యపి మహాయోగీవయ స్స్వేఛ్ఛయామాయావీవ=లోక ప్రసిద్ధమైనఐంద్రజాలికుని వలె; మహాయోగీవ=గొప్పయేగివలె; స్వేచ్ఛయా=తన సంకల్పమాత్రము చేతనే;యః=ఏ పరమేశ్వరుడు, ఇదం=ఈజగత్తును;విజృంభయతి=సృష్టిస్తున్నాడో;తస్మై= ఆ;శ్రీగురుమూర్తయే= గురుమూర్తి అయిన:శ్రీదక్షిణా మూర్తయే=శ్రీదక్షిణామూర్తిస్వామికొరకు, నమః=నమస్కారము.

తాత్పర్య వివరణము.

శంకర భగవత్పాదులవారు పరమాత్మ జగత్కారణమని, కారణమగు పరమాత్మయందే జగత్తు వుండునని చెప్పుటకు, బీజాంకుర న్యాయమును దృష్టాంతముగా చెప్పిరి. ఈ బీజంకుర న్యాయమును విమర్శించిన యడల చాలా ఆశ్చర్యము కలుగును. ఒక మఱ్ఱిగింజ సూక్ష్మమైనది.

ఆ గింజ భూమియందుపడి తడిసినపిమ్మట ఆ విత్తనమును భేదించుకొని ఒక మొక్క బయలుదేరుచున్నది. ఆ మొక్కపుట్టి దినదినాభివృద్ధిగా పెరిగి మహావృక్ష మగుచున్నది. ఆ మహావృక్షముయొక్క విశాలమైన ఆకారము, మొక్క రూపముగా నున్నపుడు కనిపించుటలేదు. ఆ మొక్క యొక్క సూక్ష్మస్వరూపముకూడా, మొలవకుండా విత్తనముగానున్నపుడును కనిపించుటలేదు. విత్తనము బద్దలుగొట్టి విమర్శించినను అచట ఆ చెట్టు యొక్క ఆకారము గోచరించుటలేదు. అయితే చెట్టుయొక్క స్వరూపము విత్తనములో యిమిడివున్నదా లేదా అంటే ఇమిడియున్నదనియే చెప్పవల యును. విత్తనమందు ఆ ఆకారములేక సంబంధములేక హఠాత్తుగా అంకురము పుట్టేయెడల, చింతగింజలోనుండికూడా మఱ్ఱిమొక్కగాని, వేప మొక్కగాని పుట్టవచ్చునుగదా.

మరియు సంబంధంలేకుండా ఉత్పత్తిఅయ్యేయెడల, విత్తనమును పాతి పెట్టినట్లు, రాతిముక్కను పాతిపెట్టినను అంకురము మొలవచ్చును గదా. అట్లా మొలుచుటలేదు. కనుక సజాతీయమగు బీజాంకురములకు నియతసంబంధము ఉండుననిఅదంతయు కారణరూపములో నుండుననియు అదియే సూక్ష్మ స్థూలరూపములను తాల్చుననియు, ఆ మహావృక్షమందు మరల కాయలు, అందులో విత్తనములు, ఆ విత్తనములలో వృక్షములు ఈవిధముగా బీజాంకుర న్యాయము ఆశ్చర్యముగా కనిపించుచున్నది. విత్త నములోనుండి అంకురసృష్టి పరిణామ రూపముగా బయలుదేరినది అటు లనే పరమాత్మలోనుండి ప్రపంచసృష్టి భ్రమరూపముగా, వివర్తరూపముగా, బయలుదేరినది. బీజాంకురదృష్టాంతములో గ్రహించవలసినవిశేషమేమంటే వృక్షముపుట్టే ముందు బీజమందే ఉన్నదని స్థూలవికార రహితమైన దని గ్రహించదగిన విషయము. ఆరోప ప్రపంచమంతయు సృష్టికంటే పూర్వమందు అధిష్టానమగు బ్రహ్మరూపముగానే యున్నదని, బ్రహ్మ నుండి ఈ వివిధప్రపంచము బయలుదేరినదని గ్రహించవలయును. అందు

వలననే "మాయాకల్పిత దేశకాల కలనా వైచిత్ర్య చిత్రీకృతం" అని శంకరభగవత్పాదులవారు మాయావాదమునే చెప్పిరి.

"మాయావీవ విజృంభయత్యపి మహాయోగీవయ స్వేఛ్ఛయా" అని కూడా మాయావాదమునే బలపరిచిరి. ఇంద్రజాలికుడు తయారుచేయుటకు ఏసాధనములు లేకపోయినను తనలోనుండే ఇంద్రజాలిక శక్తిచేత, అనేక రకములయిన దృశ్యములను చూచేవారికి చూపించి ఆశ్చర్యమును గలుగ జేయును. మన దేశంలో శంకరాచార్యులవారు అవతరించిన కాలమందు అనగా రెండువేల సంవత్సరములకు పూర్వము, ఇంద్రజాలవిద్య చాలా ఎక్కువగా ఉండేది. ఇంద్రజాల విద్యలోనే సూత్రప్రసారాది విద్యలని అనేకరకములుగా ఉండేవి.ఒకప్పుడు ఒక ఇంద్రజాలికుడు ఒక మహారాజు గారి దగ్గరకు వెళ్లి,అయ్యా! సూత్రప్రసార ఇంద్రజాలికవిద్యను తమ సన్నిధిలో ప్రదర్శించెదను దయచేసి చూడండని కోరెను. అంతట రాజు గారు ఆ పట్టణంలో ప్రజలందరిని ఈ ఇంద్రజాలమును చూచుటకు పిలి పించినారు. ఆ మహాసభలో ఇంద్రజాలికుడు రాజుగారి సన్నిధిలో నిలబడి, అయ్యా! ఇక ఇంద్రజాల విద్యను చూపిస్తున్నాను చూడండి అని వెంటనే మాయమయినాడు (కనిపించలేదు). వెంటనే ఆకాశముమీదికి అతి దీర్ఘమయిన నిచ్చెనవలె ఇనుపతీగెలు వ్యాపించినవి. ఆ తీగలమీదుగా ఒక విచిత్రమైన పురుషుడు ఎక్కి పైకిపోయినాడు. ఆ తరువాత మరి యొకడు అటులనే పైకెక్కెను. ఆ తరువాత మరియొకడు ఎక్కిపోయి నట్లు, ప్రేక్షకులకు కనిపిస్తునేయున్నది. ఇదియేగాక ఆకాశమందు మహా నగరము, ఉద్యానవనములు,అనేక రకములగు ఆటలు పాటలు మొదలగు అద్భుతదృశ్యములను, సభలోని రాజు మొదలగువారు చూచి పరమాశ్చ ర్యమును పొందిరి.ఈరీతిగా కొంతసేపు ఇంద్రజాలవిద్యా సృష్టిని ప్రేక్షకు లకు చూపించి, ఆ ఇంద్రజాలదృష్టిని ఉపసంహరించెను. ఆ ఇంద్ర జాలము ఆగేటప్పటికి, ఇంద్రజాలవిద్యా ప్రసారమునకు పూర్వమందు,

ఐంద్రజాలికుడు రాజుగారి దగ్గర ఎక్కడైతే ఉన్నాడో అక్కడనే అందరికీ కనుపించెను. చూచువారందరు ఐంద్రజాలికుడు ఇక్కడ ఉండియే ఇంతదృశ్యమును చూపించెనని ఆశ్చర్యపడిరి.

ఐంద్రజాలికుడియందున్న ఇంద్రజాలవిద్య ఆవరణశక్తి, విక్షేప శక్తియని రెండుశక్తులతో కూడియున్నది. ఆవరణశక్తితో ఐంద్రజాలికుడు ఆవరింపబడి కనిపించకుండా పోయినాడు. విక్షేపశక్తిచేత తన ఆత్మయందే అనేకరకములగు ఇంద్రజాల దృశ్యములను సృష్టించి మరల తనయందే ఉపసంహరించుకొనెను. అందుచేత ఐంద్రజాలిక ప్రపంచసృష్టి స్థితిలయములకు ఐంద్రజాలికుడే కారణమని ఆధారమని చెప్పవలయును. ఐంద్రజాలికవిద్య ఐంద్రజాలికుడినుండి విడదీయుటకు అవకాశము లేదు ఐంద్రజాలికుడికంటే అన్యము గాదనికూడా చెప్ప వచ్చును. అటులనే సచ్చిదానందరూపమగు పరమాత్మ ఐంద్రజాలికుని వలె ఉన్నాడు. పరమాత్మయందలి మాయాశక్తి ఆవరణ విక్షేపశక్తులతో కూడి ఇంద్రజాలవిద్య వలెయున్నది. అందులో ఆవరణశక్తితో పర మాత్మ ఆవరింపబడి గోచరించుటలేదు. అట్టి పరమాత్మయే విక్షేపశక్తి చేత ఆకాశాది సమస్తప్రపంచమువలె, జీవులవలె గోచరించుచున్నాడు. కనుక ఈప్రపంచమంతయు మాయాసృష్టియనే శంకరభగవత్పాదులవారు చెప్పిరి.

ఇదియేగాక విద్యారణ్యులవారుకూడా వేదాంత పంచదశిలో చిత్రదీప ప్రకరణమందు

శ్లో॥ ఏతస్మాత్కిమివేంద్రజాల మపరం యద్గర్భ వాసస్థితం
రేతశ్చేతతి హస్తమస్తక పద ప్రోద్భూత నానాంకురం
పర్యాయేణ శిశుత్వ యౌవనజరా వేషై రనేకైర్వృతం
పశ్యత్యత్తి శృణోతి జిఘ్రతి తథాగచ్ఛత్యథాఽగచ్ఛతి॥

శ్లో॥ దేహ వద్వటధానాదౌ సువిచార్య విలోక్యతాం।
క్వధానా క్వ తవా వృక్షః తస్మాన్మాయేతి నిశ్చను॥

అని మాయావాదమునే చెప్పిరి, పురుషుడియొక్క రేతస్సు స్త్రీ గర్భమందు ప్రవేశించి శుక్ల శ్రోణితములు కలసి, యేవిధమైన శరీరాకారములేనిస్థితిలో నుండి క్రమక్రమముగా కాళ్ళు, చేతులు, ముక్కు, ముఖము, శిరస్సు మొదలగు ఆకారముతో నవమాసములు పూర్తి అయిన తరువాత మాతృగర్భము నుండి పుట్టి బాల్యావస్థ. కౌమారావస్థ, యౌవనావస్థ, వార్థకావస్థ ఈ అవస్థలలో విశేషమైన మార్పుచెంది, చూచుట, వినుట, ఆస్వాదించుట, ఆఘ్రాణించుట, మాటలాడుట, నడచుట మొదలగు జ్ఞానక్రియా చేష్టలను చేయుచున్నది.

గనుకనే భౌతిక పదార్థసారమునుండి బయలుదేరిన ఈ శరీరములు అచేతనములేగాని, చేతనములవలె సర్వవ్యవహారములను చేయుచున్నవి. మాటలాడుచు, చూచుచు వ్యవహరించుచున్న చేతనుడు, అచేతనమగు శరీరముకంటే వేరుగా కనిపిస్తున్నాడా అంటే, కనిపించుటలేదు. మట్టితో చేసిన బొమ్మలు కదులుతూ, మాట్లాడుతుంటే ఆశ్చర్యపడమా? అటులనే ప్రపంచమంతా భౌతిక దేహములు వ్యవహరించుట ఆశ్చర్యముకాదా? తండ్రి కుమారుని అబ్బాయి అంటాడు. కుమారుని శరీరంలో ఒక వ్యక్తి ఉండి పలుకుతాడు, మాట్లాడుతాడు. అటులనే తండ్రి శరీరమందు నాయనా అని పిలిచిన పలుకుతాడు, మాట్లాడుతాడు. అటులనే భార్య భర్తనుగాని, భర్త భార్యనుగాని పిలిచినపుడు ఆయా శరీరములయందున్న చేతనములు పలుకుట, మాటలాడుట మొదలగు వ్యవహారములు జరుపుచున్నవిగాని, ఆ శరీరములకన్న వేరుగా ఆ వ్యవహరించు చేతన వ్యక్తులు కనిపించుటలేదు.

మరణకాలమందైనను శరీరమును విడిచిపెట్టి వెళ్ళునపుడుకూడా ఆత్మ పక్కన ఉన్నవారికి కనిపించుటలేదు. కనుక ఈ లోకవ్యవహార మంతయు మాయామయమని చెప్పవలయును. విశ్వామిత్రమహర్షి ప్రత్యేకం సృష్టిచేసినట్లు గాథలుకలవు. ప్రత్యేకం స్వర్గమునుసృష్టించినట్లు ఇంద్రాదులను సృష్టించినట్లు, భోగభూములను సృష్టించినట్లు రామాయ ణములోనే కథకలదు. విశ్వామిత్ర మహర్షి తనయొక్క తపోమహిమచే సంకల్పమాత్రముచేతనే సృష్టించెనేకాని ఆ సృష్టికి ఇతర సాధనములు లేవు. అటులనే పరమేశ్వరుడు త్రిగుణాత్మకమైన తన మాయచేతనే తన ఆత్మనే. వివిధ ప్రపంచరూపముగా భాసింపచేసెనని, అటుల భాసింపచేయు టయే సృష్టియని గ్రహించవలయును.

ఇదియే మాయావాదమని గ్రహించవలయును. జగత్తంతయు అనగా జీవేశ్వర జగద్రూపమగు దృశ్యమంతయు అధిష్ఠానమగు సచ్చిదా నంద రూపమయిన పరమాత్మయొక్క అన్యథాభావమే, అనగా ప్రతి భాసయే. మరియొక విధముగా కన్పించుటయే. కాని పరమాత్మకంటే వేరుకాదని ముఖ్యముగా గ్రహించవలసిన విషయము.

ఇది మూడవ శ్లోకముయొక్క తాత్పర్య వివరణము సమాప్తము.

అవతరణిక :

ప్రపంచములో విత్తనము భగ్నమైన పిమ్మటనే అంకురము పుట్టు చున్నది. మృత్పిండము యే స్థితిలోఉన్నదో ఆ స్వరూపము నశించిన తరు వాతనే కుండలు మొదలయిన కార్యములు పుట్టుచున్నవి. ప్రళయకాల మందు అంతా నశించిన తరువాత అంతయు శూన్యమే అగును కనుక ఆ

శూన్యస్థితిలోనుండే ప్రపంచము పుట్టుచున్నది. అందుచేత అసత్తులోనుంచే సత్తు పట్టును. అనగా ఆ భావములో నుండియే ప్రపంచము పుట్టునుగాని స్వరూపమైన బ్రహ్మనుండి ప్రపంచము పుట్టుట నిర్యుక్తికమని, ఈ అసద్వాదమునే శ్రుతికూడా చెప్పుచున్నది, అసద్వాదమును కొంతమంది ఆశంకితురేమో యనే దృష్టితో దానికి సమాధానముగా ఈ శ్లోకమును శంకరభగవత్పాదులవారు వ్రాసిరి.

శ్లో॥ యస్యైవ స్ఫురణం సదాత్మక మసత్కల్పార్థగం భాసతే
సాక్షాత్తత్త్వమసీతి వేదవచసా యో బోధయత్యాశ్రితాన్
యత్సాక్షాత్కరణాద్భవేన్న పునరావృత్తిర్భవాంభోనిధౌ
తస్మైశ్రీగురుమూర్తయేనమఇదం శ్రీదక్షిణామూర్తయే॥౮

ప్రతిపదార్థ నిరూపణము :—

యస్య=ఏ పరమాత్మయొక్క; సదాత్మకం=స్వరూపమైన; స్ఫురణమే=చైతన్య స్వరూపమే; అసత్కల్పార్థగం-అసత్కల్పాః=అసత్కల్పములు అనగాస్వయముగా సత్యత్వములేని అనిర్వచనీయములైనవి, అవి ఆకాశాది భూతభౌతిక పదార్థములే, అట్టి కార్యభూతములగు పదార్థములను; గం=పొందినది,అనగా కారణమైన పరమాత్మ కార్యములగు ఆకాశాది పదార్థములయందు అనుగతమై; భాసతే=ప్రకాశించుచున్నది;యః=ఏగురు రూపమైన పరమేశ్వరుడు; ఆశ్రితాన్=యథావిధిగా గురు సమీపమునకువచ్చి ఆశ్రయించిన శిష్యులను; తత్త్వమసీతి వేదవచసా=జగత్కారణమైన సచ్చిదానందరూపమైన, అద్వితీయమైన బ్రహ్మవే నీవు కాని వేరుకావని; వేదవచసా=మహావాక్యముచేత; సాక్షాత్=అపరోక్షముగా తత్త్వమును; బోధయతి=బోధించుచున్నాడో; యత్సాక్షాత్కరణాత్=యే సచ్చిదానందరూపమగు బ్రహ్మయొక్క నేను

బ్రహ్మను అనే సాక్షాత్కారమువలన; భవాంభోనిధౌ=సంసార సముద్రమందు; పునః=తిరిగి; ఆవృత్తిః=సంసారప్రాప్తి; నభవేత్=కాదో; తస్మై శ్రీ గురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే = ఆ శ్రీ గురుమూర్తియైన శ్రీ దక్షిణామూర్తియగు పరమాత్మకు ఈ నమస్కారము.

తాత్పర్య వివరణము :—

లోకంలో ఒక అనుభవముకలదు. అది యేమనగా ఉపాదాన కారణము అన్నికార్యములయందు అనుగతమై తెలియబడుచుండును. ఎటులననగా మట్టి-కుండలు,మూకుళ్ళు, ముంతలు మొదలగు వికారములయందు, మట్టి కుండ, మట్టి మూకుళ్ళు, మట్టిముంత అని ఈ అనుభవములలో కార్యములయందు అనుగతమై గోచరించుచున్నవి. అటులనే బంగారు వికారములైన భూషణములయందు. ఉపాదాన కారణమగు బంగారము బంగారు గొలుసు, బంగారు పుంగరము, బంగారు పాత్రయని గోచరించుచుండును. జగత్తుకు అసత్తే అనగా శూన్యమే ఉపాదాన కారణమయ్యే యెడల "ఆకాశః అసన్" అనగా ఆకాశము లేనిది. "వాయుః అసన్" అనగా వాయువు లేనిది, "తేజః అసత్" అనగా తేజస్సు లేనిది. అని అసత్తు, అనే ఉపాదాన కారణము. ఆకాశాది కార్యములయందు అనుగతమై గోచరించవలసియుండును. అటుల గోచరించలేదు. ఎటుల గోచరించుచున్నదనగా ఆకాశఃఅస్తి అనగా ఆకాశమున్నది; వాయురస్తి అనగా వాయువు ఉన్నది. 'తేజఃఅస్తి' అనగా తేజస్సు ఉన్నది, 'జలమస్తి' అనగా జలమున్నది. 'పృధివీఅస్తి' అనగా పృధివి ఉన్నది. 'ఆకాశం భాతి' 'వాయుర్భాతి' తేజఃభాతి, జలంభాతి, 'పృధివీభాతి' అనగా ఆకాశం ప్రకాశించుచున్నది. వాయువు ప్రకాశించుచున్నది.

ఈరీతిగా సద్రూపమైన చిద్రూపమైన అనగా జ్ఞానస్వరూపమైన ప్రపంచమునకు ఉపాదానభూతమైన పరబ్రహ్మతత్వము అనగా అధిష్ఠా

నము ఆరోపితమగు ఆకాశ వాయు తేజస్సు మొదలగు కార్యములయందు అస్తిఅని, భాతి అని ఈ ప్రకారము సద్రూపముగాను చిద్రూపముగాను ప్రతీతిలో గోచరించుచున్నది. అయితే కొన్ని పదార్థములయందు అస్తి అని,కొన్నిపదార్థములయందు భాతిఅని, కొన్నిపదార్థములయందుఆవస్తువు నా కిష్టము, ఈ వస్తువు సాక్షిష్టము అని ఇష్టమనగా ఆనందతాదాత్మ్య సూచకము. అందుచేత పరమాత్మ సద్రూపముచేత చిద్రూపముచేతఆనంద రూపముచేతను అస్తి, భాతి, ప్రియం అను సంస్కారముల ననుసరించి, యేయేపదార్థములయందు అస్తిఅనిగాని, భాతిఅనిగాని, ప్రియమనిగాని అనాదినుండి అనుభవములుండునో ఆ అనుభవములవలన ఏర్పడిన సంస్కారములు కలవో ఆయా పదార్థములయందు అస్తిఅని, భాతిఅని, ప్రియమని ఆరోపమైన పదార్థములయొక్క ఆనుభవములు కలుగు చుండును.

కనుక అన్నిపదార్థములయందును అస్తి అనేగాని, భాతిఅనేగాని, ప్రియమని మాత్రమేగాని, ఎందుకు అనుభవము కలుగకూడదు అని ప్రశ్నించనవసరంలేదు. వెనుకటి సంస్కారమునుబట్టియే ఈ భ్రమరూప మైన అనుభవములు కలుగుచుండును. అయితే సూక్ష్మముగా ఒక విష యమును గ్రహించవలయును. అధ్యాసయందు అధిష్టానము సామాన్య రూపముగా ఆరోపతాదాత్మ్యమును పొంది గోచరించుచుండును. అది ఎటు లనగా శుక్తి రజత భ్రమలో చూడవలయును. అధిష్ఠానమునకు రెండు అంశములు అనగా రూపములు ఉండును. ఒకటి సామాన్యాంశ రెండు విశేషాంశ. ఇదంరజతం అనే భ్రమలో అధిష్టానమగు శుక్తియందు ఇందత్వం అనగా ఇది అనేరూపము అధిష్టాన సామాన్యాంశ యనబడును. శుక్తిత్వము అనగా శుక్తి అనే స్వరూపము విశేషాంశ యనబడును. అధిష్టానము విశేషరూపనుగా పూర్తిగా తెలియబడిన భ్రమ కలుగదు.

అధిష్ఠానము సామాన్యరూపముగా కూడా తెలియబడని స్థితిలో భ్రమ కలుగదు.

ఎటులననగా దృష్టిపథమునకు బొత్తిగా కనిపించని వస్తువుయందు భ్రమ కలుగదు. బాగుగా ఫలానావస్తువని కనిపించినను భ్రమ కలుగదు. శుక్తి అని విశేషరూపముగా కనిపించినపుడు రజతం అనే భ్రమకలుగదు. ఇదం అనగా ఇదియని తెలియనపుడు కూడా వెండి అనే భ్రమ కలగదు. తాడు అని విశేషముగా తెలిసినపుడు సర్పమనే భ్రమ కలుగదు. ఇదియని సామాన్యముగా తెలియనపుడుకూడ సర్పమనే భ్రమ కలుగదు. కనుక అధిష్ఠానము పూర్తిగా తెలియబడకూడదు. సామాన్యముగా తెలియబడి యుండవలయును. అందుచేతనే అధిష్ఠాన సామాన్యజ్ఞానము అధ్యాసకు కారణమగును, కనుకనే ఇదం రజతం అని, అయం సర్పః అని అధిష్ఠాన సామాన్య స్వరూపముతో తాదాత్మ్యమును పొంది ఆరోపవిశేషమగు రజతము, సర్పము గోచరించుచున్నవి. అంతేగాని శుక్తి వెండియని, తాడు సర్పమని అధిష్ఠానవిశేష రూపముతో తాదాత్మ్యమును పొంది రజతభ్రమ, సర్పభ్రమ మొదలగు భ్రమలు కలుగుటలేదు.

ఈ అనుభవమునుబట్టియే భ్రమకు కారణమగు అజ్ఞానము అధిష్ఠాన విశేషరూపమగు శుక్త్యంశను, రజ్జ్వంశను అనగా తాడు అనే స్వరూపమును, ఆవరించునుగాని ఇదం అనగా ఇది అనే సామాన్యాంశను, అజ్ఞానము ఆవరించినదని అనుభవానుసారముగా అద్వైతసిద్ధాంతమును గ్రహించవలయును. ప్రకృతములో పరమాత్మయందు జీవత్వ జగద్విషయక భ్రమలు కలుగుటలో సచ్చిదానందరూపమగు పరమాత్మయొక్క నిర్విశేష చైతన్యమగు సత్యజ్ఞానానందాది పదలక్ష్యమగు పరమాత్మ స్వరూపము సాక్షాత్కరింపబడిన యడల భ్రమ కలుగదు. అట్టి స్వరూపము అజ్ఞానముచేత ఆవరింపబడియున్నది. సదంశ, చిదంశ ఆనందాంశ

యగు అధిష్ఠాన సామాన్య అంశలే భ్రమలలో గోచరించుచున్నవి. అందు చేతనే ఆకాశఃఅస్తి, వాయురస్తి,భాతి సన్‌ఘటః సన్‌పటః అనగా ఉన్నది ఘటము ఉన్నది, పటము ఉన్నది, ఇది నాకు ప్రియము, అహంకర్తా భోక్తా ఇత్యాది భ్రమలు కలుగుచున్నవి. ఆకాశోఽస్తి అన్నపుడు అస్తిఅని అధిష్ఠాన సామాన్యాంశ ఆకాశః అని ఆరోప విశేషాంశ. ఈ విధముగా భ్రమలయందు ఉపాదానమగు. అనగా అధిష్ఠానమగు పరమాత్మ స్వరూపము ఆకాశాది కల్పితవస్తువులయందు అనుగతమై గోచరించుచున్నది. గనుక పరమాత్మయే జగత్కారణముకాని శూన్యము జగత్కారణము కాదు. కనుక శూన్యవాదము నిర్యుక్తికము. ఈ విషయమంతయు 'యస్యైవస్ఫురణం సదాత్మకమసత్కల్పార్థగం భాసతే' అను శ్లోకభాగము వలన గ్రహించతగియున్నది. "సాక్షాత్తత్త్వమసీతి వేదవచసా యోబోధయత్యాశ్రితాన్" దక్షిణామూర్తిస్వామి తమశిష్యులకు తత్త్వమసి అనే మహావాక్యముచేత జీవబ్రహ్మైక్యమును బోధించిరి. జీవబ్రహ్మైక్యము ఎట్లు కుదురునని విచారించవలయును. జీవుడనగా అంతఃకరణావచ్ఛిన్న చైతన్యము అనగా అంతఃకరణతోకూడుకున్న చైతన్యమని యర్థము, ఈశ్వరుడనగా మాయావచ్ఛిన్న చైతన్యము అనగా మాయతో కూడుకున్న చైతన్యము. జీవుడు కించిజ్జుడు. అనగా కొద్దిజ్ఞానము కలవాడు. ఈశ్వరుడు. సర్వజ్ఞుడు. అనగా సర్వము తెలిసినవాడు. ఈశ్వరుడు జగజ్జన్మస్థితి లయకారణభూతుడు. జీవుడు జగత్కారణత్వము లేనివాడు. ఇంతతేడావున్న జీవేశ్వరులకు ఐక్యము ఎటుల సంభవించును, ఈ యనుభవమునుబట్టి చూడగా జీవేశ్వరులు ఒకరికంటే ఒకరు అత్యంతము భిన్నులని స్పష్టముగా చెప్పవచ్చును. మహావాక్యముజీవునకు సాక్షాత్పరమాత్మతో ఐక్యమునే బోధించుచున్నది. కనుకశ్రుతి చెప్పిన జీవబ్రహ్మైక్యమే యథార్థముగాని భ్రమరూపమైన మన అనుభవమువల్ల సిద్ధించుచున్న జీవబ్రహ్మ భేదము పరమార్థముకాదు. ఇదియేకాక భేదము రెండురకములుగా నున్నది.

ఒకటి నైసర్గికభేదము. రెండు ఔపాధికభేదము. నైసర్గికభేదమనగా స్వత స్సిద్ధముగా నున్న భేదము. ఎటులనగా గోవుకంటే అశ్వమువేరు, అశ్వము కంటే గోవువేరు అని ఒక ఉపాధిసంబంధము లేకుండానే గోవుకు అశ్వమునకు భేదము అనుభవములోనున్నది. కనుక ఈ భేదము నైసర్గిక భేదమని గ్రహించవలయును.

ఔపాధిక భేదమనగా అసలువస్తువునకు భేదము లేకపోయినప్పటికి ఉపాధులద్వారా ఏర్పడుభేదమే ఔపాధిక భేదము. అదియెటులనగా ఘటా కాశమునకును మఠాకాశమునకుగల భేదము. ఘటమును పగలగొట్టి మఠ మును పగలగొట్టినపుడు ఆఘటములోని ఆకాశము, మఠములోని ఆకాశము మహాకాశస్వరూపముతో ఏకమగుచున్నవి. కనుక ఘటాకాశ మఠాకాశము లకుగల భేదము ఔపాధికమగు భేదమేకాని నైసర్గికభేదము కాదు. జీవే శ్వరులకుగల భేదముకూడా నైసర్గికభేదము కాదు. మాయావిశిష్ట చైతన్య మగు ఈశ్వరుడు అంతఃకరణవిశిష్ట చైతన్యరూపుడగు జీవుడు, ఉభ యులు మాయాఅంతఃకరణలనే ఉపాధులను వదలిపెట్టినయెడల చైతన్య స్వరూపముతో ఏకీభవింతురు. ఇట్టి ఔపాధిక భేదమును పురస్కరించు కొనియే శ్రుతిస్మృత్యాదులయందు జీవేశ్వరులకు భేదమున్నటుల కనిపించు చున్నది కాని, ఆభేదము పారమార్థికముకాదు.

జీవేశ్వరులకు ఉపాధులయిన అంతఃకరణ మాయలు కూడా ఆరో పితములుగాని సత్యములు కావు. ఆరోపితములనగా భ్రమవలన ఏర్పడి నవి. అనగా మిథ్యాభూతములు. మిథ్యాభూతము లనగా యథార్థజ్ఞానముచే నశించునవి అందువలననే మహావాక్యము, ఓ జీవ: త్వం=నీవు;తదసి సర్వజ్ఞుడవైన పరమేశ్వరుడ వగుచున్నావు. అని సర్వజ్ఞుడగు ఈశ్వరు నితో ఐక్యమును బోధించుచున్నది. ఇట్టి ఐక్యము మాయాఅంతఃకరణ అను కల్పిత ఉపాధిప్రయుక్తభేదమున్నను విరుద్ధముకాదు. కనుక సాధకుడు

మహావాక్యములకు లక్ష్యమైన పరమాత్మయొక్క సాక్షాత్కారమును శ్రవణ మనన నిధిధ్యాసనములవలన సంపాదించిన యెడల అట్టి సాక్షాత్కారము వలన జీవత్వభ్రమకు ప్రపంచ భ్రమకు కారణమగు మూలాజ్ఞానము నశించును. మూలజ్ఞానము నశించినయడల జీవత్వభ్రమ, ప్రపంచభ్రమ నశించును. భ్రమలు నశించగానే జీవుడు పరమాత్మస్వరూపుడై అనగా సచ్చిదానంద స్వరూపుడై యుండును. ఇదియే మోక్షస్థితి. జీవుడు పరమాత్మ స్వరూపుడు అయియుండే, అజ్ఞానముచేత నేను జీవుడనని భ్రమించెనుగాని జీవత్వము పారమార్థికముగాదు.

ఘటాకాశమునకు మహాకాశమే పరమార్థము, ఘటాకాశము ఔపాధికము. కనుకనే ఘటాకాశము మహాకాశముకన్న వేరుకాదు. జలమందుగల సూర్యప్రతిబింబమునకు బింబమైన ఆకాశమందు కనిపించు సూర్యుడే పరమార్థము. జలమందలి సూర్యప్రతిబింబము ఔపాధికమే. అనగా జలము అనే ఉపాధివలన ఏర్పడిన ఔపాధిక స్వరూపమే. ఇట్టి ప్రతిబింబము, బింబమైన సూర్యునికంటే వేరుకాదు. అటులనే అంతఃకరణ ఉపాధిగాగల జీవచైతన్యము, అనగా అంతఃకరణ విశిష్టచైతన్యమనిగాని, అంతఃకరణ ప్రతిబింబిత చైతన్యమనిగాని అనవచ్చును. ఇట్టి జీవచైతన్యము బింబమైన ఉపాధిలేని పరమాత్మకంటే వేరుకాదు. ఇట్టి ఆత్మసాక్షాత్కారమును పొందిన వ్యక్తి భ్రమవలన ఏర్పడిన జీవత్వరహితుడై పరమాత్మ స్వరూపుడగును. మరల సంసారమును. జనన మరణములను పొందడు.

ఎటులనగా రాగిని బంగారము చేసిన తరువాత మరల ఆ బంగారము రాగికాదు. చెట్టుయందు తొడిమవూడిన పండు మరల తొడిమకు అతుక్కొనదు. స్వప్నమందు స్వప్నపదార్థములు సత్యమని భ్రమించిన వ్యక్తి మెలకువ వచ్చిన తరువాత మరల స్వప్నపదార్థములు సత్యమని

భ్రమించడు. ఇట్టి అనాదిసిద్ధమగు సంసారభ్రమను పోగొట్టు జ్ఞానమును అనుగ్రహించు దక్షిణామూర్తిని నిత్యము నమస్కరించుచుండవలయునని తాత్పర్యము, ఇక్కడికి నాల్గవశ్లోక తాత్పర్య వివరణము సమాప్తము.

అ వ త ర ణి క :

అద్వైతసిద్ధాంతమందు, జగత్తుకు, ఆత్మసత్యత్వముచేత సత్యత్వము, ఆత్మప్రకాశముచేతనే ప్రకాశము గోచరించుచున్నవని చెప్పెదరు. కాని ఆత్మవలె జగత్తుకూడా స్వయముగా సత్తాప్రకాశలు కలదని చెప్ప కూడదు. అటులైన ఆత్మవలె జగత్తుకు ఉత్పత్తినాశములు లేకపోవలసి వచ్చును. ఆత్మకు కారణములేనట్లు జగత్తునకుకూడా కారణము లేకపో వలసివచ్చును. ఆత్మ స్వయంప్రకాశమానముగా జాగ్రత్స్వప్న సుషుప్త్యవస్థలయం దున్నట్లు జగత్తుకూడా అవస్థాత్రయమందు స్వయంప్రకాశమానముగా గోచరించవలసియుండును. అట్లుండుటలేదు అందుచేత అధిష్ఠానమగు బ్రహ్మసత్తాప్రకాశములచేతనే ఆరోపితమగు ప్రపంచమునకు సత్తాప్రకాశలు కలుగుచున్నవని చెప్పవలయును. సత్తాప్రకాశలనగా అస్తి. భాతియని గోచరించునవే.

అయితే మరియొక ప్రశ్న. పరమాత్మయందు ప్రపంచము కల్పితమయినయెడల ఇతరకారణ సంబంధము లేకుండానే ప్రతివస్తువు తయారై కనిపించవలయును. స్వప్రకాశమాన మయిన ఆత్మయందే కల్పింపబడు చున్నది గనుక. ప్రపంచమునకు అధిష్ఠానమగు పరమాత్మ సంబంధం యెల్లప్పుడు వుండును గనుక. అందరికిని సర్వకాలములయందు ప్రపంచం ఏల గోచరించదు. ఈ విషయంలో సమాధానం అధిష్ఠానమనగా ఆరోపితమునకు మూలమగు అజ్ఞానముచే నావరింపబడినది యని అర్థము. పరమాత్మ ప్రపంచమునకు మూలమగు అజ్ఞానముచేత ఆవరింపబడి యున్నది.

ఆవరింపబడినందువలన ప్రపంచమును ప్రకాశింపచేయలేదని సమాధానం చెప్పవచ్చును, కాని అటులైన ఒకప్పుడు ఒక వస్తువు గోచరించును. ఒకప్పుడు. గోచరించదు. ఈ విధంగా మనకు అనుభవమున్నది. ఇట్టి అనుభవము ఎటులకుదురును. (దీపముకంటే) వెలుతురుకంటే, చీకటిని పోగొట్టు సాధనం వేరేలేనట్లు జ్ఞానరూపమగు పరమాత్మకంటే అజ్ఞానమును పోగొట్టుసాధనం వేరేలేదుకదాయని ప్రశ్నించవచ్చును గనుక ఇట్టి ప్రశ్నలకు సమాధానముగా ఈ క్రింది శ్లోకమును రచించిరి.

శ్లో॥ నానాచ్ఛిద్ర ఘటోదరస్థిత మహాదీప ప్రభాభాస్వరం,
జ్ఞానం యస్యతు చక్షురాది కరణద్వారా బహిఃస్పందతే
జానామీతి తమేవ భా న్తమనుభాత్యే తత్సమస్తంజగత్
తస్మై శ్రీ గురుమూర్తయేనమ ఇదం శ్రీ దక్షిణామూర్తయే ॥౪॥

ప్రతిపధార్థము,

నానాచ్ఛిద్ర ఘటోదరస్థిత మహాదీప ప్రభాభాస్వరం-నానాచ్ఛిద్ర= అనేక రంధ్రములతో కూడిన, ఘట=కుండయొక్క, ఉదర=లోపల, స్థిత=ఉన్నటువంటి, మహాదీప=పెద్ద దీపముయొక్క, ప్రభా=వెలుతురు వలె, భాస్వరం=ప్రకాశించుచున్న, యస్య=ఏ పరమేశ్వరునియొక్క, జ్ఞానంతు=నవరంధ్రములతో కూడిన శరీరమందున్న అంతఃకరణ మందు ప్రతిబింబించియున్న సాక్షిచైతన్యము, చక్షురాదికరణద్వారా= నేత్రములు, శ్రోత్రములు మొదలగు ఇంద్రియములద్వారా, బహిః=బయటికి, స్పందతే=ఇంద్రియములకు విషయములకు సంబంధము కలుగగానే ఆ ఇంద్రియములద్వారా విషయదేశమునకు వెళ్ళుచున్నది. జానామీతి= నేను దీనిని తెలుసుకొనుచున్నానని, భాంతం=ఇతరాపేక్షలేకుండా విషయములను ప్రకాశింపచేయుచు స్వయముగా ప్రకాశించుచున్న, తమేవ=

ఆ సాక్షిచైతన్యమునే, అను=అనుసరించి, ఏతత్=ఈ, సమస్తం=సమస్తమయిన, జగత్=ప్రపంచము, భాతి=ప్రకాశించుచున్నది. ఏపరమేశ్వరుని యొక్క స్వరూపభూతమయిన జ్ఞానము ప్రకాశించుచున్నదో, తస్మై=ఆ, శ్రీ గురుమూర్తయే=శ్రీ గురుమూర్తియైన, శ్రీ దక్షిణామూర్తయే=దక్షిణామూర్తిస్వామికొరకు, ఇదం=ఈ, నమః=నమస్కారము.

తాత్పర్య వివరణము

ముఖ్యముగా జ్ఞానము కలుగు ప్రక్రియను విచారించవలయును. పరమాత్మ జ్ఞానస్వరూపము గనుక, అట్టి జ్ఞానస్వరూపమయిన పరమాత్మయే సకల ప్రపంచమునకు అధిష్ఠానముగనుక. ఒక మట్టిబొమ్మయందు మట్టియను ఉపాదాన కారణము. ఆ బొమ్మలోపల, బైటకాళ్ళు, చేతులు మొదలగు అవయవములయందు నిండి ఆ బొమ్మరూపము గా నున్నట్లు ప్రపంచమంతయు ఆరోపితమయిన. అనగా వివర్తమయిన విగ్రహమను కొనండి. ఈ ప్రపంచమనే వివర్తవిగ్రహంలో అధిష్ఠానరూపమయిన పరమాత్మ లోపలను, బైట సర్వపధార్థములయందును నిండి సర్వప్రపంచ రూపముగా మనకు అతిచిత్రముగా గోచరించుచున్నది.

అసలు (వస్తువు) స్వరూపము గోచరించుటలేదు. గనుక అధిష్ఠాన చైతన్యరూపమయిన జ్ఞానము మనలోనే కాదు. బైటకూడ వున్నదని గ్రహించవలయును. అయితే శరీరంలో అంతఃకరణ ఉండుటచే ఆయంతఃకరణయందు చైతన్యము ప్రతిబింబించియుండుటచే మనలోనే జ్ఞానము అనగా చైతన్యము ఉన్నది. బైట. జడపదార్థములయందు లేదని మనకు ఒక భ్రమ కలదుగాని చైతన్యము అధిష్ఠానమై సర్వత్ర ఉన్నదని శాస్త్రదృష్టిలో గ్రహించవలయును.

జీవచైతన్యము శరీరము మొదలగు ఉపాధులయందే ఉన్నదిగాని జడపదార్థములయందు లేదని చెప్పవచ్చును. మనకు నేత్రములు మొద

లగు ఇంద్రియములకు విషయసంయోగం కలిగినపుడు నేత్రగోళకద్వారా మన శరీరములో చేరిన హృదయ పుండరీకదేశమందున్న అంతఃకరణ, విషయములున్న ప్రదేశమునకు వెళ్ళును. అంతఃకరణతో పాటు అంతఃకరణయందు ప్రతిబింబించిన చైతన్యముగూడా విషయదేశమునకు వెళ్ళును. విషయములనగా, యేవస్తువులను చూచుచున్నామో ఆ వస్తువు లన్నమాట. (అనగా) ఘటాదివిషయములు కనిపిస్తున్నవి. ఆ విషయములయందు అధిష్టాన చైతన్యము ఉన్నదికదా. అంతఃకరణవెళ్ళి తదాకారాకారితమగును. అనగా ఆ విషయమునిండా వెలుతురు వ్యాపించినట్లు వ్యాపించును.

ఆ సమయమందు మనలోనించి వెళ్ళిన అంతఃకరణయందు ప్రతిబింబించిన చైతన్యము అనగా జీవచైతన్యము విషయదేశమందలి అధిష్ఠాన చైతన్యము. ఘటము, అంతఃకరణ కలసినందువలన అన్నియు ఏకీభవించుచున్నవి ఆ సమయమందు ఘటాకారమగు అంతఃకరణవృత్తియందు (సాక్షి)చైతన్యము ప్రతిబింబించును. చైతన్యములు విషయదేశమందు ఏకీభవించినందువలన అధిష్ఠాన చైతన్యము ప్రతిబింబించిన దన్నను పరవాలేదు. జీవచైతన్యము అనగా అంతఃకరణతో తాదాత్మ్యమునుపొంది అంతఃకరణ ధర్మములతో కూడియున్న చైతన్యముకూడా, విషయదేశమందుండును.

అపుడు ఆ యంతఃకరణయొక్క ఘటాకారవృత్తివలన ఆఘటమునకు అధిష్ఠానచైతన్యమందుగల అజ్ఞానావరణ నివర్తించును. ఆవరణ నివృత్తికాగానే అధిష్ఠాన చైతన్యముతో ఏకీభవించి వృత్తియందు ప్రతిబింబించిన(సాక్షి) చైతన్యముచేత ఆ ఘటము తెలియచేయబడుచున్నది,

దూరముగానున్న చంద్రమండలమునుగాని, సూర్యమండలమునుగాని, నక్షత్రములనుగాని, ఇతరపదార్థములనుగాని మనము ఇంద్రియము

లతో చూచుచున్నామంటే ఇదేరీతిగా అంతదూరము అంతఃకరణ పోవు నని,జీవుడుకూడా వెళ్ళునని,సాక్షిచైతన్యముకూడా, అనగా జీవసాక్షికూడా వెళ్ళునని, అంతఃకరణ శరీరములోనుండియే యడతెగకుండా సూర్యచంద్ర మండలాదులలో ప్రవేశించి తదాకారాకారితనుగునని, అచట మనలో నుండి వెళ్ళిన చైతన్యముకూడా యడతెగకుండా వెళ్ళి అచటి అధిష్ఠానచైతన్య ముతో కలిసి ఆ వృత్తియందు ప్రతిబింబించునని. ఆ వృత్తియందు ప్రతి బింబించిన చైతన్యమగు జ్ఞానముచేతనే సూర్యచంద్రాదులుకూడా తెలియ బడుచున్నారనియు తెలిసికొనవలయును.

లోకంలో స్వప్రకాశరూపులై చీకటిని పోగొట్టి ప్రపంచమును ప్రకా శింపచేయు సూర్యచంద్రులుకూడా తదాకారవృత్తియందు ప్రతిబింబించిన ఆత్మచైతన్యప్రకాశచేతనే ప్రకాశింపచేయబడుచున్నారు. కాని సూర్యచంద్రా దులచేత ఆత్మ ప్రకాశింపచేయబడుటలేదు. ఈ విషయమునే జానామీతి తమేవ భాంతమనుభాత్యే తత్సమస్తం జగత్. అని భగవత్పాదులవారు చెప్పిరి.

ఇక దృష్టాంతమును విమర్శింతము. అనేకచిల్లులుగల ఒకపాత్రలో పెద్దదీపము వెలుగుచున్నది. ఆ దీపము వెలుతురు ఆ చిల్లులద్వారా బైటికి వచ్చి దగ్గరనున్న వస్తువులను వ్యాపించును. ఆ చిల్లులద్వారా బైటికివచ్చిన వెలుతురులో కొన్ని వస్తువులను చూడగలుగుచున్నాము. చీకటిలోనైనను పెద్దచిల్లులలోనుండి బైటికివచ్చిన వెలుతురువల్ల ఆ వెలు తురు వ్యాపించినంతవరకు చీకటి నశించును ఆ చీకటి నశించినంతవర కున్న పదార్థములు అ వెలుతురులో కనిపించుచుండును. చిల్లిపాత్రలో నున్న పెద్దదీపమే యడతెగకుండా చిల్లులద్వారా బైటికివచ్చినది అదియే ప్రకాశింపచేయుచున్నది. లోపల ఆ దీపము వెలుతురుకంటే బైటికివ్యాపిం చిన వెలుతురు వేరుకాదు అని గ్రహించవలసియున్నది.

మరియొక విషయము: చిల్లిపాత్రలోనున్న అసలు దీపము కనిపి చకపోయినను చిల్లులద్వారా బైటికివచ్చిన వెలుతురు దీపమను మూలము లేనిది ఉండదుగనుక. చిల్లులద్వారా బైటికివచ్చిన వెలుతురు మనకు గోచ రించినను దీనినిబట్టి దీనికిమూలమగు పాత్రలోనున్న పెద్దదీపమున్నట్లు గుర్తించవలయును.

అటులనే మన శరీరమే ఒక పాత్ర. నేత్రములు శ్రోత్రములు మొదలగు యింద్రియ గోళకములు, శరీరమనే పాత్రకుగల చిల్లులు. ఈ ఇంద్రియద్వారములనే చిల్లులలోనుండి శరీరములోపలనున్న జ్ఞాన రూపమయిన మహాదీపముయొక్క ప్రకాశ బైటికి వ్యాపించి సకలవిషయ ములను తెలియజేయుచున్నదని గమనింపవలయును. ఆయా విషయాకార వృత్తియందు ప్రతిబింబించిన చైతన్యమే విషయజ్ఞానము. అదియే బైటికి వ్యాపించిన వెలుతురువలె నున్న జ్ఞానము.

ఈ జ్ఞానమునుబట్టి మనకు ప్రత్యక్షముగా గోచరించపోయినను లోపలనున్న అఖండజ్యోతిరూపమయిన జ్ఞానరూపమయిన ఆత్మ, స్వయం ప్రకాశమానముగా నున్నదనియు. అట్టి ఆత్మప్రకాశచేతనే సకల విష యములను మనం తెలుసుకొనుచున్నామనియు. అట్టి దృక్కు అనే ఆత్మను దృశ్యముకంటె వేరుగా తెలిసికొని ముక్తులము కావలయుననియు ఇట్టి విజ్ఞానమునకు దక్షిణామూర్తి యనుగ్రహమే ప్రధానకారణమనియు తాత్పర్యము.

ఇట్లు అయిదవశ్లోకమునకు తాత్పర్యనిరూపణము సమాప్తము.

అవతరణిక :

ఒకప్రశ్న. కనిపించే ప్రపంచమంతయు మిథ్యయని. అనగా భ్రమయని, కనిపించని ఆత్మయే సత్యమని, కనిపించే శరీరము ఆత్మకాదని

మన అనుభవములోనున్న ఇంద్రియములు, మనస్సు, బుద్ధి, ప్రాణము మొదలగునవికూడా ఆత్మ కాదనియు మనకు అగోచరమయిన ఆత్మ వేరుగా నున్నదనియు చెప్పుచున్నారు, అది చాలా అనుభవవిరుద్ధము. ఎటులనగా, నేను కృశించితిని. నేను లావుగానున్నాను. నేను పొడవుగా నన్నాను. నేను పొట్టిగానున్నాను. నేను కూర్చున్నాను అను అనుభవమునుబట్టి నేను అనునదే ఆత్మగనుక. లావుగానున్నది. సన్నముగా నున్నది, పొట్టిగానున్నది, పొడవుగా నున్నదియు, శరీరమేగనుక నేననే శబ్దమును శరీరమందే వాడుచున్నాము గనుక శరీరమే ఆత్మయని చార్వాకులందురు.

వారిమతంలో ప్రత్యక్షమే ప్రమాణము. అనగా ఇంద్రియములకు గోచరించునవే వున్నవిగాని, గోచరించనివి లేవు. హేతువులతో కొన్ని ఊహించినను శబ్దములతో విన్నను ప్రత్యక్షానుకూలమయినపుడే అంగిక రింతురు. అవి ప్రత్యక్ష ప్రమాణముగానే అంగీకరింతురు. పృథివీ, జలము, తేజస్సు, వాయువు నాలుగే భూతములు. ప్రత్యక్ష ప్రమాణముతో గ్రహింపబడుచున్నవి గనుక ఈ నాల్గింటినే అంగీకరిస్తారు. ఆకాశము భూతముకాదు. ఈ నాలుగుభూతములకలయికవలన శరీరమందు తాంబూల ద్రవ్యములలో ఆ ద్రవ్యములను నవిలినపుడు యెరుపు మదశక్తి పుట్టినట్లు జ్ఞానశక్తి పుట్టును. ఆ జ్ఞానశక్తి ఉన్నంతవరకు శరీరము పనిచేయును. తరువాత పడిపోవును. మరణమే మోక్షముకాని వేరులేదు. శరీరమే ఆత్మ గనుక, శరీరము పడిపోయిన తరువాత, జీవుడు లోకాంతరములకు వెళ్ళుట లేదు. చార్వాకమతంలో అర్థము, కామము, రెండే పురుషార్థములు. పర లోకములు లేవు. దేవుడులేడు. వేదశాస్త్రములు ప్రమాణములు కావు. అని నాస్తికులగు చార్వాకులు చెప్పెదరు.

అందులోనే రెండవ నేను చూచుచున్నాను. నేను వినుచున్నాను, నేను అస్వాదించుచున్నాను. అనే అనుభవమునుబట్టి నేను అనే శబ్దమును

ఇంద్రియములయందే వాసుచున్నము గనుక, ఇంద్రియములే ఆత్మ యని అందురు.

మరికొందరు. నేత్రములు మొదలగు ఇంద్రియములు లోపించినను బ్రతుకుచున్నారు గనుకను, నాకు ఆకలిగానున్నది. నాకు దప్పికగానున్నదని ప్రాణధర్మములగు ఆకలి దప్పికలను నా అనే ఆత్మయందున్నటుల వ్యవహరించుటనుబట్టియు ప్రాణమే ఆత్మయని అంటున్నారు.

మరికొందరు. ప్రాణము వాయురూపముగనుక, జడము. అట్టి జడమగు ప్రాణమునకు సుఖదుఃఖాదు లనుభవించుట అను భోక్తృత్వము సంభవించదు గనుక మనస్సునే చేతనము ఆత్మయని నిరూపించుచున్నారు.

నా మనస్సు యని ఆత్మను.మనస్సును వేరుగా వ్యవహరించుచున్నందువలన క్షణికమగు విజ్ఞానమే ఆత్మయని, బుద్ధునియొక్క నలుగురు శిష్యులలో యోగాచారుడను శిష్యుడు చెప్పుచున్నాడు.

"నేను నేను అని అనుభవములోనున్నది ఆలయ విజ్ఞానం. దీనినే ఆత్మయందురు. ఇది ఇది యని వ్యవహరింపబడునది ప్రవృత్తి విజ్ఞానం. మొత్తంమీద అంతయు విజ్ఞానస్వరూపమే. దీపజ్వాల ప్రతిక్షణం ఎటుల మారునో మేఘము మెరుపులు ప్రతిక్షణం మార్పును ఎట్లు చెందుచున్నవో అట్లే విజ్ఞానము మార్పుచెందును. ఇట్టిక్షణిక విజ్ఞానమందు స్థాయిత్వబుద్ధి వలన దుఃఖము కలుగుచున్నది. క్షణికత్వ విజ్ఞానమువలన ముక్తి కలుగునని ఈ విధంగా బౌద్ధమతరీత్యా సాధనసంపత్తిని సంపాదించిన యడల కృతార్థులగుదురని యోగాచారు లందురు.

అయితే క్షణికమగు విజ్ఞానమునకు నిన్న ఒకపని ప్రారంభించితిని. ఈరోజు దానిని నేనే పూర్తిచేయుచున్నాను. అని ఆత్మస్థాయిగానున్నట్లు కలుగుచున్న అనుభవమునుబట్టి ఆత్మత్వము సంభవించదు. సుషుప్త్యవస్థ

యందు యే విజ్ఞానము వుండదుగనుక ఆ సమయమందు శూన్యముగా నుండునుగనుక శూన్యమే ఆత్మయని అంతయు శూన్యమే నని అనగా ఏదీ లేదని బుద్ధుని శిష్యులలో నొకడైన మాధ్యమికుడను బౌద్ధుడు చెప్పెను.

వీరందరు ఆయా యుక్తులను కొన్ని వచనములను వారివారి మతములకు అనుకూలముగా ఉదహరించుచు మామతమే మోక్షసాధనమని చెప్పుచున్నారు.

అందువలన కొందరు వేదశాస్త్ర ఇతిహాస పురాణములకు విరుద్ధమగు ఆ మతములను ఆశ్రయించి మోక్షమార్గమునకు దూరమై జీవితమును వ్యర్థము చేసికొని నరకముల పాలగుదురని దయతో జీవులను వుద్ధరించుటకై శంకర భగవత్పాదులవారు ఆ మతములను నిరాకరించుటకై స్వమతమును ప్రదర్శించుటకై ఈ శ్లోకమును ఉదహరించిరి.

శ్లో॥ దేహంప్రాణమపీంద్రియాణ్యపిచలాం బుద్ధించశూన్యంవిదుః
స్త్రీ బాలాంధ జడోపమా స్త్వహమితి భ్రాంతా భృశంవాదినః
మాయాశక్తివిలాసకల్పిత మహావ్యామోహ సంహారిణే
తస్మై శ్రీ గురుమూర్తయేనమ ఇదం శ్రీదక్షిణామూర్తయే॥ ౕ॥

ప్రతిపదార్థ నిరూపణము :-

దేహం=కాళ్ళు, చేతులు, శిరస్సు మొదలగు అవయవములతో కూడినస్థూలశరీరమును; ప్రాణం=ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమాన ములను పేరుతో వ్యవహరింపబడుచు, శరీరములోనుండి, ముక్కులో నుండి బైటికి లోపలికి సంచరించుచున్న ప్రాణవాయువును; ఇంద్రియాణ్యపి=ఆయా స్థానములయందుండి రూపాదులను గ్రహించు, నేత్రములు

మొదలగు ఇంద్రియములను; చలాం బుద్ధించ=ఎల్లపుడు పుట్టుచు నశించు చున్న క్షణికమగు బుద్ధిని; శూన్యం=అభావమును; స్త్రీ బాలాంధ జడోప మాస్తు=స్త్రీలు, బాలురు, ననగా పిల్లలు, అంధులు=గుడ్డివాళ్ళు జడులు= జడబుద్ధులు; లేక పిశాచగ్రస్తులవలె, వివేకజ్ఞానము లేనివారు, భ్రాంతాః= ఒక విధముగా నున్న తత్వమును మరియొక విధముగా తెలిసికొనినవారై; భృశం వాదినః=గట్టిగా ఇతరులకు బోధించుచున్నవారై, అహమితి=శరీ రమే నేనని, ఇంద్రియములే నేను అని, ప్రాణమే నేనని; విదుః=తెలిసి కొనుచున్నారు.

మాయాశక్తి విలాసకల్పిత మహా వ్యామోహసం హారిణే॥

మాయాశక్తి=సత్వరజస్తమోగుణాత్మకమైన పరులను భ్రమింప చేయు మాయాశక్తియొక్క; విలాస=పరిణామమగు భాగముచేత, కల్పిత= కల్పింపబడిన, మహావ్యామోహ=అనాదియైన అనంతమై పరిమితిలేని, దేహేంద్రియాదులే ఆత్మయనే గొప్పభ్రమను; సంహరిణే=నశింపచేయు; తస్మై=ఆ; శ్రీ గురుమూర్తయే=శ్రీ గురుమూర్తియైన; శ్రీ దక్షిణా మూర్తయే= శ్రీ దక్షిణామూర్తి స్వామికొరకు; ఇదం నమః=ఈ నమ స్కారము.

తాత్పర్య వివరణము.

శ్లో॥ ఈశ్వరానుగ్రహా దేవ పుంసా మద్వైతవాసనా।
హాపోపహత బుద్ధీనాం తద్వ్యార్తాపి నరోచ తే॥

అని ప్రమాణవచన మున్నది. అనగా పూర్వజన్మలయందుగాని, ఈజన్మ యందుగాని అతిభక్తితో, భగవదర్పణ బుద్ధితో శాస్త్రోక్తకర్మలను ఆచ రించినవారికే ఈశ్వరానుగ్రహము కలుగును. అట్టి ఈశ్వరానుగ్రహము

కలవారికే అద్వైతశాస్త్రమందు ఆదరము శ్రద్ధ కలుగును. అట్టి శ్రద్ధ కలిగినపుడే శాస్త్రోక్తప్రకారముగా శ్రవణ మననములను చేయుదురు. నిధిధ్యానమును కూడా చేయుదురు. అట్టివారికే పరమాత్మ సాక్షాత్కారము కలుగును. అట్టి సాక్షాత్కారమువలననే మూలాజ్ఞానము. దానివలన ఏర్పడిన దేహేంద్రియములయందు నేను అను భ్రమ మొదలగు సర్వభ్రమలు నశించును.

అపుడే ముక్తుడగును. ఈ స్థితిని పొందవలెనంటే ఈశ్వరానుగ్రహమే ప్రధానకారణం కాని పాపముచేసినవారికి ఈశ్వరానుగ్రహము కలుగదు. ఈశ్వరానుగ్రహంలేనిది శాస్త్రమందు శ్రద్ధకలుగదు. అందుచేతనే పరమార్థమును తెలుసుకొనలేక శరీరం, ఇంద్రియములు, ప్రాణం మొదలగు భౌతికమగు నశించుపదార్థములనే ఆత్మయని అభిమాన నిశ్చయము కలవారై అనేకమందిని శిష్యులను సంపాదించి ఇట్టి ప్రమాణవిరుద్ధమగు అనుభవమునే బోధించుచు వారు పాడగుచు. ఇతరులను కూడా పాడుచేయుదురు.

అగ్నియందు దహింపచేసే శక్తి యున్నటుల, విత్తనములయందు మొక్కలను పుట్టించే శక్తియున్నటుల. మణి, మంత్ర, ఓషధులయందు, ఇతర కార్యములను ప్రతిబంధించే శక్తియున్నటుల సచ్చిదానందరూపమగు పరమాత్మయందు సత్వరజస్తమోగుణములతో కూడిన మాయాశక్తి ఆశ్రయించియుండును. అగ్నికంటే దహింపచేసేశక్తి, విడదీయుటకు వీలులేదు గనుక వేరుకాదు. అటులనే మాయాశక్తి పరమాత్మకంటే వేరుకాదు. అట్టి మాయకూడా అనాదియైన ఆరోపమే గనుకను అధిష్ఠానమగు పరమాత్మకంటే వేరుకాదని పరమార్థము.

వ్యవహారదశయందు అనగా అజ్ఞానదశయందు మాయాశక్తియుక్తమగు పరమేశ్వరుని ఆరాధించవలసిందే. ఈశ్వరానుగ్రహమును పొందవలసినదే పరమాత్మసాక్షాత్కారమును పొందిన తరువాత అజ్ఞానమువలన

ఏర్పడిన జీవత్వము, ఈశ్వరత్వముకూడా అజ్ఞానముతో సహా నశించును గనుక, నిర్గుణమగు స్వప్రకాశానందస్వరూపమగు పరమాత్మయే మిగులును. ఇట్టి మహా పరమార్థమును తెలిసికొనుటకు ఈశ్వరారాధన చేసి పెద్దలను సేవించి నిష్కామకర్మానుష్ఠానముచేసి, ఈశ్వరానుగ్రహమును సంపాదించవలయును.

ఆధ్యాత్మికదృష్టి మనుష్యజన్మలో చాలా శ్రద్ధచే సాధించవలసిన విషయం. ఆధ్యాత్మిక విద్య చాలా కష్టము గనుక సులభముగా అందరికీ అర్థమగుటకు వ్రాసిన విషయములనే కొన్ని విశేషములతో మరల వ్రాసితిని. ఇట్లు ఆరవశ్లోక తాత్పర్య వివరణ సమాప్తం.

అవతరణిక :

స్వప్నావస్థయందు కళ్ళుమూసుకొని ప్రపంచమును మరచి నిద్రపోవుచున్న సమయములో అనేక పదార్థములు, చిత్రవిచిత్రములగు అనేక విషయములు కనిపించుచున్నవి అవి యన్నియు అధిష్ఠానములేనిది గోచరించవు గనుక ఆత్మయనే అధిష్ఠానమందు కల్పితమై కనిపించుచున్నవి. అటులనే జాగ్రదవస్థయందుకూడా పరమాత్మయందే సకల ప్రపంచం కల్పింపబడినదనియు అట్టి ఆత్మయే జాగ్రదవస్థయందు, స్వప్నావస్థయందును దృశ్యములను చూచుచున్నాడనియు అద్వైతులు చెప్పెదరుకదా.

జాగ్రదవస్థయందు, స్వప్నావస్థయందును చూడబడే ప్రపంచం, చూచే ఆత్మ ఉన్నవని శూన్యముకాదని చెప్పుట కవకాశమున్నది. కాని సుషుప్త్యవస్థయందు అనగా గాఢ నిద్రయందు ఏమియు కనిపించుటలేదు. వినిపించుటలేదు. ఆత్మకూడా వేరుగా గోచరించుటలేదు గనుక ఆ సమయమందు శూన్యమేకాని ఏమియులేదు. అందుచేత శూన్యమే ఆత్మ యని బౌద్ధులు చేయు ప్రశ్నకు సమాధానముగా ఈ క్రింది శ్లోకమును ఆచార్యస్వాములువారు రచించిరి.

శ్లో॥ రాహుగ్రస్తదివాకరేందు సదృశో మాయాసమాచ్ఛాదనా
త్సన్మాత్రః కరణోపసంహరణతో యోఽభూత్సుషుప్తః పుమాన్
ప్రాగస్వాప్సమితి ప్రబోధసమయే యః ప్రత్యభిజ్ఞాయతే
తస్మై శ్రీ గురుమూర్తయే నమ ఇదం శ్రీ దక్షిణామూర్తయే ॥౬॥

ప్రతిపదార్థము :

యః=యే; పుమాన్ (అనృతజడమగు ప్రపంచముకంటె విలక్షణమగు) పరమేశ్వరుడు; కరణోపసంహరణతః=రూపాది విషయజ్ఞానములకు కారణమగు నేత్రములు మొదలగు ఇంద్రియములయొక్క ఉపసంహారములన అనగా ఇంద్రియములు పనిచేయకుండా ఆగినందువలన; సన్మాత్రః=ఏవిధమైన భేదములేకుండా సచ్చిదానందరూపుడుగా నుండి, సుషుప్తః=సుషుప్త్యవస్థను పొందినవాడు; అభూత్=ఆయెను; ముక్తునికంటె; సుషుప్త్యవస్థయందున్న ఆత్మకు తేడా ఏమనగా; మాయా సమాచ్ఛాదనాత్=మాయా అనాదిఅయిన అజ్ఞానముచేత; సమాచ్ఛాదనాత్=ఆవరణ వలన, అందువలననే సన్మాత్రుడయి యున్నాడు.

ఈ విషయములో దృష్టాంతము "రాహుగ్రస్త దివాకరేందు సదృశః" రాహు=రాహువుచేత; గ్రస్త=గ్రహింపబడిన (ఆవరింపబడిన); దివాకరేందు-దివాకర=సూర్యునితో;ఇందు=చంద్రునితో; సదృశః=సమానుడై; సుషుప్తిని పొందియుండెను. గ్రహణము పట్టినప్పుడుకూడా సూర్యచంద్రులున్నారు. సుషుప్త్యవస్థయందు ఆత్మ వుండుటలో ప్రమాణమేమనగా- "ప్రాగస్వాప్సమితి ప్రబోధసమయే యః ప్రత్యభిజ్ఞాయతే"- యః=సుషుప్తిసమయమందు, సన్మాత్రుడుగా నున్న సత్త; ప్రబోధసమయే=మెళకువవచ్చిన సమయమందు; ప్రత్యభిజ్ఞాయతే=ప్రత్యభిజ్ఞను పొందుచున్నాడు; ఎటులననగా ప్రాగస్వాప్సమితి, యే=నేను, ఇంతకు

ముందు సుషుప్త్యవస్థయందు సుఖముగా నిద్రపోతినో; ఆ నేనే ఇపుడు మేలుకొనుచున్నాను. అని ప్రత్యభిజ్ఞను పొందుచున్నాడు. తస్మై=ఆ; శ్రీగురుమూర్తయే=గురుమూర్తి అయిన, శ్రీ దక్షిణామూర్తయే=దక్షిణా మూర్తి స్వామికొరకు; ఇదం=ఈ, నమః=నమస్కారము.

తాత్పర్య వివరణము॥

జాగ్రదవస్థయని, స్వప్నావస్థయని, సుషుప్త్యవస్థయని జీవునకు మూడు అవస్థలు కలవు. బాహ్యేంద్రియములతో జ్ఞానము కలిగే అవస్థ జాగ్రదవస్థ. అనగా బహిరింద్రియములతో ప్రపంచవిషయములను తెలుసుకొను సమయము. నిద్రాసమయమందు ఇంద్రియములు పనిచేయవు.ఇంద్రియములు పనిచేయకపోయినను, అంతరాత్మయందు మనస్సుయొక్క పరిణామమువలన ఏర్పడు స్వప్నపదార్థములను తెలుసుకునే సమయము స్వప్నావస్థ. జ్ఞానేంద్రియములు మనస్సు కూడా పనిచేయక,అజ్ఞానమందు అంతయు లీనమయి అవిద్యావృత్తియందు ప్రతిఫలించిన ఆనందమును అవిద్యాకారావిద్యావృత్తియను అజ్ఞానానుభవమును పొందు అవస్థ. సుషుప్త్యవస్థ.

ఈ మూడు అవస్థలయందును ఆత్మ అనుగతమై, నేను జాగ్రద్దశయందు ఆయా విషయములను చూచితిని. స్వప్నదశయందు మంచిఆశ్చర్యకరమగు దృశ్యములను చూచితిని. సుషుప్త్యవస్థయందు ఏమి తెలియదు. సుఖముగా నిద్రించితినని జాగ్రద్దశయందు అనుకొనుచున్నాడు. జాగ్రద్దశయందు స్వప్నము, స్వప్నదశయందు జాగ్రద్దశ, సుషుప్త్యవస్థయందు ఈ రెండును, అనగతమై గోచరింపకపోయినప్పటికిని తెలుసుకొను ఆత్మ ఒకేవ్యక్తి మూడు అవస్థలయందును స్పష్టముగానున్నట్లు సర్వజనులకును అనుభవమున్నది. అందువలన సుషుప్త్యవస్థయందుకూడా ఆనందరూపుడయిన ఆత్మయున్నది.

ఏమి తెలియలేదన్నాడు గనుక అజ్ఞానముకూడా ఉన్నది. గనుక సుషుప్త్యవస్థయందు ఏమియులేదు. శూన్యమేయని, శూన్యమే ఆత్మయని చెప్పుటకు అవకాశములేదు. శూన్యమని చెప్పినను శూన్యమును గుర్తించే జ్ఞానమున్నట్లేకదా. జ్ఞానమే ఆత్మ జ్ఞానముంటే ఆత్మవున్నదనియే చెప్ప వలయును. ఇదియేగాక బంగారులోనుండి తయారయిన భూషణములు బంగారురూపముగానే యుండును. రాగినుండి తయారయిన పాత్రలు రాగి పాత్రలుగానే కనిపించుచున్నవి. వికారములన్నియు ప్రకృతికి సజాతీయ ములుగా నున్నవి. గనుక శూన్యములోనుండి ప్రపంచం పుట్టినయడల అంతయు శూన్యముగా నుండవలసి వచ్చును. ప్రపంచమంతయు సత్య ముగా కనిపించుచున్నది. అంతా శూన్యమని చెప్పినపుడు - అంతా శూన్య మని గుర్తించి చెప్పువాడున్నాడుకదా వాడే ఆత్మ, అట్టి ఆత్మ శూన్య మని చెప్పుట యుక్తిలేనిమాట గనుక— శూన్యవాదమును బోధించు బౌద్ధ మతము ప్రమాణ విరుద్ధమని, యుక్తివిరుద్ధమని వదలివేయవలయును. గ్రహించతగినది కాదు. ఇట్లు ఏడవ శ్లోక తాత్పర్య వివరణము సమాప్తము.

అవతరణిక.

ముంజ గడ్డిలోనుండి వెన్నును విడదీసినట్లు ఆరోపితములగు శరీ రేంద్రియములకంటే ఆత్మను వేరుజేసి బోధించుటకును పరమాత్మైక్యాను భవము గుర్వనుగ్రహమువలన, ఈశ్వరానుగ్రహమువలనను సంపాదించ వలయును. అనే విషయమును తెలియజేయుటకును పూర్వశ్లోకమందు "ప్రాగస్వాప్సమితి ప్రబోధసమయే యఃప్రత్యభిజ్ఞాయతే" అని చెప్పిరి ప్రత్యభిజ్ఞవలన అనగా సుషుప్త్యవస్థయందు నిద్రించిన నేనే మేలుకొను చున్నాను. అను అనుభవమువలన ఆత్మ సర్వావస్థలయందు స్థాయిగానున్న

టుల ఎట్లు తెలిసికొనవలయును. అనే ప్రశ్నకు సమాధానం చెప్పుటకు ఈ శ్లోకమును వ్రాసిరి.

శ్లో॥ బాల్యాదిష్వపి జాగ్రదాదిషు తథాసర్వాస్వవస్థా స్వపి।
వ్యావృత్తా స్వనువర్త మానమహ మిత్యంతఃస్ఫురంతం సదా।
స్వాత్మానం ప్రకటీకరోతి భజతాం, యోభద్ర యాముద్రయా।
తస్మైశ్రీ గురుమూర్తయే నమఇదం శ్రీ దక్షిణామూర్తయే ॥౮॥

ప్రతిపదార్థముః—

బాల్యాదిష=బాల్యము, కౌమారము, యౌవనము, ముసలితనము మున్నగు స్వరూపముగానున్న, తథా=అట్లే, జాగ్రదాదిష్వపి=జాగ్రదవస్థ, స్వప్నావస్థ, సుషుప్త్యవస్థ; జన్మ జరామరణాది రూపముగానున్న; సర్వాసు=సమస్తమయిన; అవస్థాసు=నేత్రములతో చూచుట, చెవులతో వినుట మొదలగు భిన్నభిన్న జ్ఞానములు కలిగే అవస్థలయందును-అనగా ఆయా దశలయందుకూడా; వ్యావృత్తాసు=పరస్పరం వేరుగానున్న అవస్థల యందు; అను వర్తమానం=అనుగతముగా వుంటున్న, సదా=యల్లపుడు, అంతః=లోపల, అహమితి=నేనని, స్ఫురంతం=భాసించుచున్న-అనగా తెలియుచున్న ప్రత్యగాత్మను: యః=ఏ పరమేశ్వరుడు, స్వాత్మానం= సచ్చిదానందస్వరూపమయిన, తన ఆత్మస్వరూపముగా, భద్రయా=శుభ రూపమయిన(మంగళప్రదమయిన), ముద్రయా=జ్ఞానముద్రతో, భజతాం= భక్తులకు, ప్రకటీకరోతి=తెలియజేయుచున్నాడో—అనగా భక్తులకువారిలో నేను నేను అని గోచరించుచున్న ఆత్మను, కర్తృత్వాది ధర్మరహితమైన సచ్చిదానందరూపమయిన పరమాత్మకంటె అభిన్నముగా ఏపరమేశ్వరుడు బోధించుచున్నాడో, తస్మై=ఆ, శ్రీ గురుమూర్తయే=శ్రీ గురుమూర్తి

రూపమయిన, శ్రీ దక్షిణామూర్తయే = దక్షిణామూర్తి స్వామికొరకు, ఇదం= ఈ, నమః=నమస్కారములు.

తాత్పర్య వివరణము.

ఒక పుష్పమాల ఉన్నది. ఆ మాలయందు వందల పుష్పములున్నవి. ఆ పుష్పములు పరస్పరం ఒక పువ్వుకంటే మరొకపువ్వు వేరు అయినను దారం అన్నిపువ్వులలో గుచ్చబడి అన్ని పువ్వులయందును ఉన్నది. అందువలన పరస్పరం వేరు వేరయిన పుష్పములకంటె అన్ని పువ్వులలో అనుగతమైన దారము వేరుగా నున్నదని అనుభవసిద్ధమే.

అటులనే మరీ బాల్యావస్థకంటే కౌమారావస్థవేరు, కౌమారావస్థకంటే యౌవనావస్థవేరు. యౌవనావస్థకంటే వార్ధకావస్థ వేరు. అట్లే జాగ్రదవస్థకంటే స్వప్నావస్థవేరు, స్వప్నావస్థకంటే సుషుప్త్యవస్థ వేరు, అట్లే మూర్ఛావస్థవేరు. మరణావస్థవేరు, చూచే సమయముకంటే వినే సమయము వేరు. ఆస్వాదించే సమయము వేరు, ఈ దశలు పుష్పములవలె ఒక దశకంటే మరియొకదశ వేరు. ఇట్లు అన్నిదశలు పరస్పరం వేరు వేరుగా నున్నవి.

అయినను బాల్యదశలో నా తల్లిదండ్రులు నన్ను ఆడించిరి. కౌమారదశయందు ఆ నన్నే చదివించిరి. ఆ నేనే యౌవనావస్థయందు సర్వభోగములను అనుభవించితిని, ఆ నేనే ముసలితనమందు కొడుకులచేత, మనుమలచేత సేవచేయించుకుంటిని. నేనే జాగ్రద్దశను, స్వప్నదశను. సుషుప్తిని అనుభవించుచున్నాను. నేనే చూచుచుంటిని, ఆ నేనే వినుచుంటిని. అని. పువ్వులలో దారమువలె అన్ని దశలయందు ఒకేఆత్మ "నేనే నేనే" యని అనుగతమై గోచరించుచున్నాడు. అట్టి అనుగతమైన ఆత్మ అన్ని

దశలకంటే ఆ దశలతోకూడిన శరీరేంద్రియములకంటే వేరుగా నున్నట్లు గ్రహించవలయును.

ఇట్టి ఆత్మ శరీరేంద్రియములయందు బుద్ధి ధర్మమగు కర్తృత్వ భోక్తృత్వాదులతో బుద్ధివృత్తిలో గోచరించుచుండును, పూర్వపుణ్య విశేషముచేత అంతఃకరణశుద్ధికలవారై, గురుసేవచేసి, ఈశ్వరారాధనచేసి, పరమపవిత్రులై, తమ సమీపమునకు పరమభక్తులై వచ్చినవారికి, తత్వబోధ చేయుటకుగాను అవతరించిన దక్షిణామూర్తి స్వామివారు మౌనముగా నుండి బొటనవ్రేలు. చూపుడువ్రేలు కలిపిన జ్ఞానముద్రతో మీలో నేను నేనుఅని గోచరించు ఆత్మ. సచ్చిదానందరూపమగు నా స్వరూపమే నని జీవబ్రహ్మైక్యమును బోధించిరి. దక్షిణామూర్తి స్వామివారి యనుగ్రహమువలన ఇట్టి జీవబ్రహ్మైక్య సాక్షాత్కారమునుపొంది ముక్తులు కావలయునని తాత్పర్యము. తాత్పర్య వివరణము సమాప్తము.

అవతరణిక :

అద్వైతులు అంతయు పరమాత్మయేగాని పరమాత్మకంటే వేరైన వస్తువు ఏమీ లేదని చెప్పెదరు. అయితే పరిపాలించే రాజున్నట్లు పరిపాలింపబడే ప్రజలు దేశమున్నట్లు మనం అనేకపనులు చేసుకొనుచున్నట్లును మనం చూస్తున్నాము కదా! అద్వైత సిద్ధాంత ప్రకారం ఆత్మ కంటె వేరు ఏమియు లేనపుడు బంధమును పొంది సంసార దుఃఖమును అనుభవించే వాడు లేడు కదా! అసలు బంధమే లేదు కదా! అయినపుడు బంధనివృత్తి కొరకు ఎవరికి ఎవరు జ్ఞానోపదేశం చేయవలయును. జ్ఞానంకలవానికేకదా మోక్షం. ఆ జ్ఞానం కలుగుటకు ఆధ్యాత్మిక శాస్త్రోపదేశం కావలయును కదా! శాస్త్రోపదేశం చేయుటకు గురువు అవసరం కదా! పరమాత్మ కంటే వేరుగా ఏమీలేనిపక్షంలో శాస్త్రంలేదు. గురువు లేడు. ఉపదేశం లేదు. జ్ఞానంలేదు, అజ్ఞానంలేదు. ఏమీలేదుకదా! ఏమీ లేన

పుడు శిష్యులకు గురువు శాస్త్రముపదేశించి జ్ఞానము కలుగచేయుట మొదలగు సంప్రదాయము ఎట్లునడుచును?

ఇదేగాక లోకవ్యవహారములు ఎట్లు నడుచును. అను ప్రశ్నకు సమాధానముగా అనాదిఅయిన, అనిర్వచనీయమయిన పరమాత్మయందు కల్పితమయిన మాయవలననే. అనగా అజ్ఞానమున్నంతవరకు జీవత్వాభిమాన మున్నంతవరకు. ఆత్మసాక్షాత్కారము కలిగేంతవరకు. సర్వ వ్యవహారములు ఉండునని సూచించుచు ఈ దక్షిణామూర్తిశ్లోకములలో వెనుక చెప్పిన శ్లోకముల అర్థమును సంగ్రహముగా ప్రతిపాదించుటకు ఈశ్లోకమును వ్రాసిరి.

శ్లో॥ విశ్వం పశ్యతి కార్యకారణ తయాస్వ స్వామిసంబంధత
శ్శిష్యాచార్య తయా తథైవ పితృ పుత్రాద్యాత్మనా భేదతః।
స్వప్నే జాగ్రతివా యఏష పురుషో మాయా పరిభ్రామితః
తస్మై శ్రీ గురుమూర్తయేనమ ఇదం శ్రీదక్షిణామూర్తయే॥ ౭

ప్రతిపదార్థ నిరూపణము.

యః=ఏ ఉపనిషత్తులయందు ప్రసిద్ధమయిన, పురుషః=పరిపూర్ణ మయిన పరమాత్మ; మాయాపరిభ్రామితః = మాయ తనకు ఉపాధిభూతముగానున్న సత్వరజాస్తమోగుణాత్మకమయిన, ఆవరణవిక్షేప శక్తితోకూడిన శరీరేంద్రియరూపముగా పరిణమించిన, తను ప్రవేశించిన (అవిద్యారూపమగు) మాయాశక్తిచేత, పరిభ్రామితః=భ్రమను పొందింపబడినవాడై, ఏషః=సర్వులకు ప్రత్యక్షముగా నున్న జీవుడై. కర్తృత్వభోక్తృత్వాది సంసారమునుపొందినవాడై; విశ్వం=ప్రపంచమును; భేదతః= అనేక భేదములతో అనేక విధముగా భ్రాంతుడై; పశ్యతి=చూచుచున్నాడు.

భేదముగా చూచుట ఎటులనగా కార్యకారణతయా=కార్యము, కారణము అనే స్వరూపములో, స్వస్వామిసంబంధతః-స్వ=హక్కుగల గృహము, ధనము, స్వామి వాటికి అధిపతి, రెంటికిగల సంబంధ స్వరూపముతోను, శిష్యాచార్యతయా=విద్యను నేర్చుకునే శిష్యుడు, విద్యనుచెప్పే గురువు అనే స్వరూపముతోను, తథైవ=అలాగే; పితృపుత్రాద్యాత్మనా= తండ్రి, కుమారుడు, తల్లి అనే స్వరూపముతోను; స్వప్నే=స్వప్నమందు గాని; జాగ్రతివా=జాగ్రద్దశయందుగాని, ప్రపంచమునుచూచునో,తస్మై= ఆ; శ్రీ గురుమూర్తయే=గురుమూర్తి అయిన;శ్రీ దక్షిణామూర్తయే=దక్షిణా మూర్తి స్వామికొరకు; ఇదం=ఈ; నమః=నమస్కారము.

తాత్పర్య వివరణము.

అంతయు పరమాత్మయేయని. పరమాత్మయే సృష్టించి శరీరముల యందు ప్రవేశించాడని, శరరములయందు ప్రవేశించి జీవభావమును పొందెనని, మాయోపాకుధిడై ఈశ్వరుడుగా నున్నాడని శాస్త్రం చెప్పు చున్నది. ఈ శ్లోకంలో స్వప్నే జాగ్రతివాయ ఏపురుషో మాయా పరి భ్రామితః అని యున్నది. స్వప్నమును విమర్శింతము నిద్రపోయినవాడు బాహ్యప్రపంచమును చూడకుండా తన అంతరాత్మనే నిద్రాదోషముచేత అనేక చిత్రములుగా. ప్రపంచమునుగా చూచుచున్నాడు.

ఎటులనగా ఒక కారణంలోనుండి ఒకకార్యం పుట్టినట్లు అనగా విత్తనములు నాటినట్లు అందులోనుండి మొక్కలు మొలచినట్లు, అగ్ని వలన జ్వాలకలిగినట్లు, నీరువలన తడిసినట్లు, వర్షములు కురిసి ప్రవాహ ములు వచ్చినట్లు తనకు బాలాధనముండి ఆ ధనమునకు తాను యజ మానిగానుండి పరిపాలించుచు, ఖర్చుపెట్టుకొనుచు, అనుభవించుచున్నట్లు ఒక శిష్యుడు గురువువద్దకువచ్చి విద్యను చెప్పుమని కోరినట్లు,

ఆ గురువు శిష్యునకు విద్య చెప్పినట్లు, ఒకవ్యక్తి పెళ్ళిచేసుకున్నట్లు సంతానం కలిగినట్లు, కుటుంబము అభివృద్ధిని పొందినట్లు అనేక కార్యములు చేసినట్లు. కష్టములను సుఖములను అనుభవించినట్లు ఈ బంధము దుఃఖమునకు కారణముగనుక దీనిని వదిలివేయవలెనని వైరాగ్యముకలవాడై ఒక గురువు నాశ్రయించి బ్రహ్మవిద్యను శ్రవణము, మననము చేసి ధ్యానముచేసి బ్రహ్మసాక్షాత్కారమునుపొంది ముక్తుడయినట్లు స్వప్న దశయందు కనిపించినది.

ఇట్టి దృశ్యమంతయు స్వప్నమందు ప్రత్యక్షముగా కనిపించుచున్నదికదా. వస్తువులు లేనిది యథార్థమగు ప్రత్యక్షం కలుగదుకదా. అప్పుడు వస్తువులు లేవుకదా. అందుచేత స్వప్నదశయందు కనిపించు దృశ్యమంతయు ఆత్మాధిష్ఠానక భ్రమయేకాని వేరుకాదు. అనగా ఆత్మయే అజ్ఞానముయొక్క పరిణామమయిన నిద్రచేత ఆవరింపబడినదై తన ఒకచోట నిద్రపోయినను మరియొకదేశమునకు వెళ్ళినట్లు, దృశ్యములను చూచినట్లు అనేకవిధములుగా ద్రష్టవలె, దృశ్యమువలె కనిపించుచున్నది గాని ఆత్మకంటే వేరయినది ఏమియులేదు.

స్వప్నదశయందున్న పదార్థములను చూచుటకు ఇంద్రియములు పనిచేయుటలేదుగనుక సాక్షిచైతన్యముచేతనే తెలుసుకుంటున్నామని అందుచేతనే సాక్షి ప్రత్యక్షమని గ్రహించవలయును. స్వప్నమందు కనిపించే పదార్థము లన్నియు ప్రాతిభాసికములే. అనగా దృష్టికాలమందే గోచరించునవి. ఆగంతుకమైన నిద్రాదోషమువలన కలుగు భ్రమగనుక ప్రాతిభాసికభ్రమయని గ్రహించవలయును.

మెలకువ వచ్చినతరువాత నిద్రాదోషముతో సహా స్వప్నభ్రమ నశించును. ఇటులనే జాగ్రద్దశయందుకూడా సచ్చిదానందరూపమగు పరమాత్మయే. అజ్ఞానముచేత ఆవరింపబడి చూచేజీవులవలె, చూడబడే

ప్రపంచమువలె, కార్యమువలె, కారణమువలె, కారణములోనుండి కార్యం పుట్టినట్లు, గృహారామక్షేత్రములకు తను అధిపతియైయున్నట్లు, గురుపు వలె, శిష్యునివలె, తండ్రివలె, కొడుకువలె, భార్యవలె, శరీరేంద్రియముల వలె, సుఖదుఃఖములవలె గోచరించుచున్నది.

కాని అధిష్ఠానమగు పరమాత్మకంటే ఆరోపితమగు ప్రపంచం లేదు. బ్రహ్మసాక్షాత్కారం కలిగినపుడు అజ్ఞాననిద్రతోసహా స్వప్న భ్రమవలెనున్న జాగ్రద్దశయందలి ప్రపంచభ్రమ పూర్తిగా నశించును. ఆత్మయే మిగులును. గనుక ఆత్మయే సర్వం. ఆత్మకంటే భిన్నమయినది ఏమియులేదని అతిశ్రద్ధతో గ్రహించవలసిన విషయం.

ఒక ప్రశ్న. అద్వైతమతంలో ఇదంతయు అజ్ఞానమువలన కలిగిన భ్రమయేకదా. అజ్ఞానం ఎక్కడనుండి వచ్చినది. ఎవరికున్నది, అని ప్రశ్న చేయవచ్చును.

సమాధానం : అజ్ఞానం ఎవరికనగా ఎవరికి భ్రమకలిగినదో, ఒక వస్తువు మరియొక వస్తువుగా కనిపించినదో వారికే అజ్ఞానం భ్రమ ఎప్పుడు అసలు వస్తువు బాగా (కనిపించనపుడే) తెలియనపుడే కలుగునుగనుక. భ్రమకలిగినదంటే అజ్ఞానమున్నట్లే ముత్యపుచిప్పయందు వెండి అనే భ్రమకలిగినదంటే ముత్యపుచిప్పను తెలియకుండాచేసే అజ్ఞానమునట్లె. తాడుయందు సర్పభ్రమ కలిగినదంటే తాడుయందు తాడును తెలియకుండా చేసే అజ్ఞానమున్నట్లే, మంట మండిందంటే కారణమయిన నిప్పు ఉన్నట్లె భ్రమ కలిగిందంటే భ్రమకు కారణమయిన అజ్ఞానమున్నట్లె. కలవరించాడంటే కలవరింతకు కారణమయిన నిద్ర వున్నట్లె. కలివరిం చిన వ్యక్తి కేకలువేసి భయపడుచున్నాడు. మేలుకున్న మరియొక వ్యక్తి కలవరించేవానిదగ్గరకుపోయి నాయనా! కలవరించవద్దు భయపడవద్దు, అని నిద్రలే అని, నిద్రలేపె ననుకుందాం. ఆ నిద్రలేపిన వ్యక్తిని-కలవ

రించి భయపడిన మనిషి నాకెందుకు భయం కలిగినది. నేనెందుకు కలవరించితినని అడిగినపుడు ఏమి చెప్పవలయును.

కలవరించినది నీవేకదా, భయపడినది నీవేకదా, ఇవి నిద్రామూలముగా నేర్పడినవి, భయానికి కారణాలేమీలేదు. నీకేమయినా కనిపిస్తే భ్రమయేకాని వేరుకాదని చెప్పవలయును. నేనెందుకు కలవరించానంటే నేనెందుకు భయపడితినంటే నీయనుభవం చేతనే నీవు తెలుసుకో. భయం లేదు అని నేను చెప్పుచున్నాను అనియే చెప్పవలయును. నాకేమీ భయం లేదు, మెళుకువ వచ్చినది, కల అబద్ధమని తెలుసును. 'నేను కలవరించ లేదంటే' భయపడవద్దని నేను చెప్పనవసరములేదనియే చెప్పవలయును.

అటులనే నేను జీవుడను సంసారదుఃఖము ననుభవించుచున్నానంటే జీవత్వం సంసారదుఃఖం అజ్ఞానంవలన ఏర్పడినవి భ్రాంతిగనుక. నేను జీవుడనుకాదు పరమాత్మను అని తెలుసుకొనుము. అట్లు తెలుసుకున్నయెడల అజ్ఞానం, జీవత్వం, సంసారదుఃఖం అన్నియు నశించును; నిత్యానందస్వరూపుడవుగా నుందువు అని చెప్పవలయును. నాకు భ్రాంతి లేదు, నాకు అజ్ఞానం లేదు, నేను జీవుడను కాదంటావా, అయితే నీకు ఏమీతత్వమును చెప్పనవసరంలేదు. భ్రాంతిని పొందేవానికి నాయనా నీకు అసలువస్తువును తెలిసికొనని అజ్ఞానముచేతనే భ్రాంతి కలిగినది. ఆత్మ తత్వమును తెలిసికొనినయెడల అజ్ఞానంలేదు, భ్రాంతిలేదు. భ్రాంతుని దృష్టినిబట్టి భ్రాంతి. అజ్ఞానమని మాట్లాడుచున్నాముకాని మా దృష్టిలో పరమాత్మకంటే వేరైనవస్తువు లేదుగనుక. అజ్ఞానంలేదు భ్రాంతిలేదు. అనియే సమాధానం చెప్పవలయును.

అయినపుడు అజ్ఞానం ఎవరికి? భ్రాంతి ఎవరికి? అని ఎవరినడుగుతావు అజ్ఞానము దానివలన ఏర్పడిన సంసారదుఃఖమును పోగొట్టుకొను సాధనమును శాస్త్రం చెప్పుచున్నది గనుక ఆచరించమనికావా

సమాధానం చెప్పవచ్చును. మరియొక విషయం. జీవుడు నిజముగా పరమాత్మ అయియుండి అజ్ఞానమువలన జీవత్వమునుపొంది తన మనస్సుతో కల్పింపబడిన ప్రపంచమును చూస్తున్నాడు. అంతయూ భ్రమే. గురువు, శాస్త్రము, ఉపదేశము, బంధము శ్రవణమననాదులు అన్నియు భ్రాంతిలో చేరినవే. తన అజ్ఞానకల్పితమగు గురుశాస్త్రాదులవలననే ఆత్మజ్ఞానమును సంపాదించి అజ్ఞానమును పోగొట్టుకొని స్వస్వరూపములో నుండవలయును. ఇదియే పరమార్థము.

మరియొక విషయం. పరమాత్మ స్వప్రకాశం, దీపంవలె ప్రకాశించునది. అజ్ఞానం చీకటిలాంటిది. దీపమున్నయెడల చీకటి నశించును గాని దీపాన్ని వెలుగును చీకటి ఆవరించడం అనుభవంలోలేదు. అట్లే స్వప్రకాశమానమైన ఆత్మను అజ్ఞానం ఎట్లా ఆవరించింది. అజ్ఞానం ఆత్మను ఆవరిస్తేకదా, జీవత్వభ్రమ ప్రపంచభ్రమ పుట్టడం. దీపంలాంటి స్వప్రకాశమానమయిన ఆత్మను అజ్ఞానాంధకారము ఆవరించుట అనుభవ విరుద్ధమేకదా.

పోనివ్వండి అజ్ఞానం ఆత్మను ఆవరించలేదందామా. స్వప్రకాశ ఆనందరూపమయిన ఆత్మ మనమేగనుక మనకు ఆ స్వరూపం అనుభవములోలేదు. శరీరేంద్రియ సంఘాతంకంటే పంచకోశములకంటే నేనువేరు ఆ స్వరూపము యేది అని మనం విచారించినపుడు ఆత్మతెలియక తెలియు లేదని అజ్ఞానమే గోచరించుచున్నది. అందువలన ఆత్మను అజ్ఞానం ఆవరించినదని అనుటకు వీలులేదు. అవరించలేదని అనుటకు వీలులేదని చేసిన ప్రశ్నలకు అనుభవము ననుసరించియే సమాధానం చెప్పవలయును.

సమాధానం. గుడ్లగూబ గుడ్డిదికాదు, దానికి రాత్రిపూట కనిపిస్తుంది. పట్టపగలు మధ్యాహ్నకాలమందు బాగుగా సూర్యుడు ప్రకాశించునపుడు గుడ్లగూబకు కళ్ళు కనిపించవు. కనిపించక బాధపడుతుంది. అతి

చిత్రమయిన విషయము దాని దృష్టిలో స్వప్రకాశమానమయిన సూర్యుని కూడా కనిపించకుండా ఆవరించే చీకటి అడ్డుపడుచున్నదని చెప్పక తప్పదు.

అటులనే జీవులకుకూడా. స్వప్రకాశమానమయిన తమకు ఆత్మ స్వరూపమై సర్వప్రపంచమునకు ప్రకాశకమైన సచ్చిదానందరూపమగు పరమాత్మనుకూడా ఆవరించి ఆత్మను తెలియనివ్వకుండాచేయు అజ్ఞానము నాకు తెలియదు అనే అనుభవమునుబట్టి ఉన్నదని అంగీకరింపక తప్పదు.

మరియొక సమాధానం. చీకటివలెనున్న రాహువుతో నావరింప బడిన సూర్యునిచేతనే రాహువు ప్రకాశింపజేయబడుచున్నాడు. అటులనే అజ్ఞానముచేత నావరింపబడిన స్వప్రకాశమగు పరమాత్మచేతనే ఆత్మను ఆవరించిన అజ్ఞానము తెలియచేయబడుచున్నది. అజ్ఞానమును ప్రకాశింప చేయు జ్ఞానరూపమయిన ఆత్మ అజ్ఞానమును నశింపచేయదు.

సూర్యుడు తన ప్రకాశచేత పుల్లలను ఆకులను ప్రకాశింపచేయును గాని, తగులబెట్టడు. అట్టి సూర్యప్రకాశమే సూర్యకాంత మణియందు ప్రతిబింబించినయడల అగ్నిప్రాయమై పుల్లలను. ఆకులను తగుల పెట్టును.

అట్లె ఆత్మ అజ్ఞానముచేత ఆవరించబడిన అట్టి అజ్ఞానమును నాకు తెలియదు అనే అనుభవంలో జీవులకు తెలియచేయుచున్నాను. ఆ పర మాత్మ శ్రవణాదులు చేసిన తరువాత కలుగు అఖండ బ్రహ్మాకారవృత్తి యందు ప్రతిఫలించినపుడు జ్ఞానాగ్నియై అజ్ఞానమును దహింపచేయును. కనుక శుద్ధచైతన్యము అజ్ఞానమునకు విరోధికాదు. అఖండాకార వృత్తి యందు ప్రతిబింబించిన చైతన్యమే, అజ్ఞానమునకు విరోధిగనుక వృత్తి

యందు ప్రతిబింబించిన చైతన్యమును అజ్ఞానం ఆవరించదు. కాని వృత్తి యందు ప్రతిబింబించని చైతన్యమును అజ్ఞానం ఆవరించుటలో విరోధం లేదనికూడా సమాధానం చెప్పవచ్చును. విక్షేపమున్నచోట అంతట ఆవరణ ఉన్నట్లె, ఆవరణఉన్నచోట అధిష్ఠానమున్నట్లే. గనుక అధిష్ఠానమగు ఆత్మ దృశ్యమున్నచోటనంతట అజ్ఞానముచేత ఆవరింపబడి సర్వత్ర నిండియున్నట్లె గ్రహించవలయును. ఆవరణవిక్షేపములు రెండును చైతన్యముచేతనే భాసించునవిగనుక దృశ్యములే, దృక్కు లేనిది. దృశ్యములు గోచరించవుగనుక సర్వప్రపంచమందు దృక్కుగానున్న పరమాత్మ సర్వాత్మకమై సర్వవ్యాపకమై పరిపూర్ణమై యున్నట్లె.

శాస్త్రమునుబట్టి ఈయనుభవమునుబట్టి విచారిస్తేఇదంతయుఆత్మయే అధిష్ఠానముగాగల భ్రమయనిచెప్పే అద్వైత సిద్ధాంతంలో మన ఆత్మ ఎక్కడలేదు? ఏదికాదు? ఏదిమనయందులేదు? అంతట మనమే అంతయు మనమే. అంతయు మనయందేనని మనకంటే వేరేమిలేదని ఆత్మచింతన చేయవలయును. ఈ శాస్త్రంలో కొన్ని కొన్ని పదములను అనగా అద్వైతబోధకు అనుకూలమగు శాస్త్రమందున్న పారిభాషికపదములను వాటి యర్థములను బాగుగా తెలిసికొనవలయును. అందుకొరకే చాలా చోట్ల అనగా యని వివరణచేసి వ్రాసితిని. శ్లో॥ తచ్చింతనం తత్కథనం అన్యోన్యం తత్ప్రబోధనం,ఏతదేక పరత్వంచ బ్రహ్మాభ్యాసంవిదుర్బుధాః॥ అని విద్యారణ్యస్వాములవారు చెప్పిరి. ఎల్లప్పుడు బ్రహ్మచింతన చేయవలయును. తెలుసుకొనేవారున్నపుడు వారికి చెప్పవలయును. తెలిసినవారున్నపుడు అన్యోన్య, కొన్ని విషయములను వారికి చెప్పుచు, వారికి తెలిసిన విశేషములను వారివలన వింటూ విచారించుటయే బ్రహ్మాభ్యాసమనబడును. అవాఙ్మానస గోచరమగు పరమాత్మను తెలిసికొనవలెనంటే ఆరోప నిషేధము చేయుచునే తత్వవిచారం చేయవలయునుగనుక. ఆరోప స్వరూప స్వభావములను గుర్తించియే ఆరోపనిషేధము చేయవలయును.

అందుచేతనే శ్రుతులు సృష్టిని ముందుచెప్పి తరువాత నిషేధించి పరమాత్మ యందు పర్యవసానము చూపించినవి గనుక ముందు అధ్యాసయనగా ఏమి! మాయ అనగా? జీవుడనగా ఎవడు? ఈశ్వరుని స్వరూపమేమి? యని విచారించవలయును. ఈ స్తోత్రంలో విశ్వం దర్పణదృశ్య మాన నగరీతుల్యం అని విశ్వం పశ్యతి కార్యకారణ తయా అని, ఆరోపమగు ప్రపంచమును ఆభాసయని చెప్పుచు అధిష్ఠానమగు పరమాత్మయందే తాత్పర్యమును ప్రబోధించిరి.

ఇక్కడ కొంచెము విమర్శించవలయును. మాయావాదము చాలా ఆశ్చర్యకరమైనది. అట్టి మాయావాదమునే అద్వైతులు జగత్తు మిథ్యా భూతమని, అద్వైతమే సత్యమని చెప్పుట కనుకూలముగా అంగీకరింతురు. మాయావాదమనగా అంతయు మాయాకల్పితమని చెప్పుటయే. వివర్తవాదమును సమర్థించుటకు మాయావాదము గొప్పసహకారి; ఈ దక్షిణామూర్తిస్తోత్రంలో భగవత్పాదులవారు మాయావాదమునకు సూచకమైన, మాయా అను పదమును చాలా శ్లోకములయందు వాడిరి.

శ్లో॥ విశ్వం దర్పణ దృశ్యమాన నగరీతుల్యం అను శ్లోకములో పశ్యన్నాత్మని మాయయా బహిరివోద్భూతం యథానిద్రయా అని చెప్పి, అంతయు మాయావిజృంభితమేనని ప్రబోధించుచు నిద్రావిజృంభితమగు స్వప్నమును దృష్టాంతముగా చెప్పి యస్సాక్షాత్కురుతే ప్రబోధసమయే స్వాత్మాన మేవాద్వయం అని మెలకువ అను ప్రబోధతో నిద్రావిజృంభిత స్వప్నభ్రమ నివర్తించినట్లు బ్రహ్మసాక్షాత్కారమనే ప్రబోధతో మాయావిజృంభిత ప్రపంచభ్రమ నివర్తించునని మాయావాదద్వారా జగన్మిథ్యాత్వమును చెప్పి, జగన్మిథ్యాత్వ ప్రతిపాదనద్వారా అద్వైతసిద్ధిని స్థిరపరచినట్లు కనిపించుచున్నది.

బీజస్యాంతరివాంకురో అను శ్లోకంలో మాయాకల్పిత దేశకాల

కలనా వైచిత్ర్యచిత్రీకృతం మాయావీవ విజృంభయత్యపి అని సృష్టి కంటే పూర్వమందు అద్వైతస్థితితో నారంభించి విచిత్రమగు ప్రపంచ మంతయు మాయాకల్పితమని చెప్పి, ఈశ్వరుడు ఐంద్రజాలికునివలె మహా మాయావి అని చెప్పి, ఆయనకుకల సృష్టికర్తృత్వము మాయామయమని చెప్పి, జగన్మిథ్యాత్వ ప్రతిపాదనద్వారా అద్వైతమందు తాత్పర్యమును స్పష్టముగా ప్రతిపాదించిరి.

దేహం ప్రాణమపీంద్రియాణ్యపి చలాం బుద్ధించ శూన్యం విదుః అను శ్లోకములో మాయాశక్తి విలాసకల్పిత మహావ్యామోహ సంహారిణే అని చెప్పిరి. ప్రపంచమంతయు మహావ్యామోహమనియు అనగా భ్రమ యని యర్ధము. ఈ వ్యామోహమంతయు మాయాశక్తి విలాసచేతనే కల్పితమనియు యిట్టి మహావ్యామోహమును సంహరించువాడు పరమాత్మయేననియు ప్రబోధచేయుచు, మాయావాదమును చూపించుచు, ప్రపంచ మిథ్యాత్వమును చూపించుచు అద్వైతమందు పర్యవసానమును చూపించిరి. రాహుగ్రస్త దివాకరేందు సదృశో మాయాసమాచ్ఛాదనాత్ అను శ్లోకము నందు గ్రహణంపట్టిన సూర్యచంద్రులవలె సచ్చిదానందరూపమగు పరమాత్మ మాయచేత అచ్ఛాదనచేయబడినట్లు చెప్పిరి అజ్ఞానముచేత పరమాత్మ అవరింపబడినట్లు కొన్నిచోట్ల చెప్పబడియున్నది. కొన్నిచోట్ల మాయచేత నావరింపబడినట్లు చెప్పబడినది.

ఈ విధముగా చెప్పుటనుబట్టి కొన్నిచోట్ల అజ్ఞానమునకు మాయకు కొద్దిభేదం చెప్పియున్నాను రెంటికిని భేదం లేదనికూడా చెప్పవచ్చును. అద్వైతులలోనే కొందరు మాయకు అజ్ఞానమునకు భేదం లేదని చెప్పిరి. గనుక అజ్ఞాన కల్పితమన్నను మాయాకల్పితమన్నను భేదంలేదనియే గ్రహించవలయును. అద్వైతమందే ప్రధాన తాత్పర్యము నుంచుకొని ప్రతిపాదనచేయు విధానములలో తేడా యున్నను పరవాలేదనియే శంకరభగవ

త్పాదులవారి తాత్పర్యము. అందుచేతనే సురేశ్వరాచార్యులవారు శ్లో॥యయా యయా భవేత్పుంసాం వ్యుత్పత్తిః ప్రత్యగాత్మని, సాసైవ ప్రక్రియేహ స్యాత్సాధ్వీ సాచానవస్థితాయని చెప్పిరి. అనగా ఆత్మతత్వమును తెలుసుకొన తలచినవారికి యేయే ప్రక్రియలతో ఆత్మతత్వజ్ఞానముకలుగునో అద్వైతమునకు విరుద్ధముగాని అద్వైతజ్ఞానానుకూలమగు ఆయా ప్రక్రియలన్నియు గ్రహింపతగినవేనని తాత్పర్యము.

మరియు "విశ్వంపశ్యతి కార్యకారణతయా" అను శ్లోకములో స్వప్నేజాగ్రతివాయ ఏషపురుషో మాయాపరిభ్రామితః అని చెప్పిరి. స్వప్నావస్థయందుగాని, జాగ్రదవస్థయందుగాని మాయచేత పరిభ్రమింప చేయబడినవాడై మాయాకల్పిత ప్రపంచమునే చూచుచున్నాడు. అనగా స్వప్నము జాగ్రదవస్థ అంతయు మాయాపరికల్పితమేనని తెలుచున్నది. ఉపనిషత్తులలో అవస్థాత్రయమందును స్వప్నపదమే వాడబడియున్నది. ఒక ప్రమాణవచనము: తరత్యవిద్యాం వితతాం హృదియస్మిన్నివేశితే. యోగీమాయామమే యాయత్మస్మై విద్యాత్మ నేనమః అని యున్నది. పరమాత్మను హృదయమందు ప్రవేశపెడితే అనగా పరమాత్మ సాక్షాత్కారమును పొందినయడల అవిద్యాం మాయాంతరతి అనగా అవిద్యారూపమయిన మాయను దాటుచున్నాడు అని చెప్పుచున్నది. అ విద్యను మాయను దాటడమనగా ఆత్మజ్ఞానముచేత అవిద్యను మాయను పోగొట్టుకొనుటయేనని యర్థము.

శ్లో॥ మాయామయమిద మఖిలంహిత్వా బ్రహ్మపదంత్వం ప్రవిశ విదిత్వా అని భగవత్పాదులవారే చెప్పిరి. ఈవచనములనుబట్టి మాయకు అవిద్యకు పెద్ద తేడా లేకుండానే శాస్త్రమందు ప్రతివాదనకలదని తోచుచున్నది. "మాయాంతు ప్రకృతిం విద్యాన్మాయినంతు మహేశ్వరం" అని విద్యారణ్యస్వాములవారుకూడా మాయను ప్రపంచమునకు ఉపాదాన

కారణముగా ఉదహరించిరి. గౌడపాదాచార్యులవారుకూడా మాండూక్యకారికలయందు "ప్రపంచో యదివిద్యేత నివర్తేత నసంశయః మాయామాత్రమిదంద్వైతం అద్వైతం పరమార్థతః" అని చెప్పిరి.

అనగా అద్వైత సిద్ధాంతంలో సర్వాధిష్ఠానమగు పరమాత్మకంటే వేరుగా మరియొకటిలేదని మాటిమాటికి నలుగుతున్న విషయమే. ప్రపంచం లేనేలేదు. జ్ఞానంకలిగితే నశించునా అంటే వుంటేకదా నశించటానికి. రజ్జుసర్పం పోయిందంటే పోయిందని చెప్పవచ్చునా, చెప్పకూడదు. అక్కడ తాడేగాని సర్పము లేదాయె, సర్పముకాదు తాడేనని భ్రమపడ్డాదని చెప్పవలయునుగాని సర్పమ పోయినదని చెప్పరాదు. ప్రపంచో యదివిద్యేత నివర్తేత నసంశయః ప్రపంచం వుంటేకదా నశించడానికి, అయితే యేమనవలయును. మాయామాత్రమిదం ద్వైతం ఈ ప్రపంచమంతయు మాయామాత్రం. అనగా మాయయేగాని ఏమియులేదు, ఇంద్రజాలిక సృష్టి వలె, శుక్తిరజతమువలె, రజ్జుసర్పమువలె, స్వప్నమువలె కనిపించినదేగాని సత్యముకాదు. అద్వైతం పరమార్థతః అద్వితీయమైన పరమాత్మయే సత్యమని తాత్పర్యము.

మరియు మాండూక్యకారికలలోనే "మాయయా, భిద్యతేహ్యేతన్నాన్యథాఽజం కథంచన అని యున్నది. ఒకవిషయం. మాయాసంబంధం లేకుండా పరమాత్మయే ప్రపంచరూపముగా తయారయితే పరమాత్మవలె ప్రపంచంకూడా సత్యమే కావలసివచ్చునని ప్రశ్నించవచ్చును. అంతమాత్రంలో ప్రపంచం మిథ్యాభూతమని చెప్పుటకు వీలులేకపోవును. మాయయాభిద్యతే అని చెప్పుటవలన జన్మాదివికారములులేని పరమాత్మకూడా మాయచేతనే నానారూపముగా భాసించుచున్నదిగాని పరమార్థముగా పరమాత్మకు నానాత్వములేదని తాత్పర్యం.

మరియు "నేహనానేతి చామ్నాయాదింద్రోమాయాభి రిత్యపి.

అజాయమానో బహుధామాయయాజాయతేఉసః" అని యున్నది. వేదము పరమాత్మయందు ఏమియులేమలేదు అని దృఢముగా చెప్పుచున్నది. పరమేశ్వరుడు మాయచేతనే బహురూపములుగా గోచరించుచున్నాడు. అజాయమానః జన్మలేనివాడు, అయినను మాయయాజాయతేఉసః=మాయచేతనే అనేక విధములుగా పుట్టుచున్నాడు అనేక విధములుగా కనిపించుచున్నాడని మాయావాదమునే దృఢపరచుచున్నది. మాయవాదములేనిది జగత్తులేదని మిథ్యాభూతమని చెప్పుటకు వీలులేదు గనుక మాయావాదమును ఆధారంగాచేసుకుని అద్వైతసిద్ధాంతమును తెలిసికొనవలయునని తాత్పర్యం.

"సతోహి, మాయయాజన్మ యుజ్యతే, నతుతత్వతః" అని మాండూక్యకారిక, స్వరూపమయిన పరమాత్మకు జన్మ అనగా ప్రపంచ కార్యమంతయు మాయచేతనే పుట్టినదిగాని, నతుతత్వతః=నిజముగా సృష్టి లేదనియే అర్థము. మాయాసృష్టి ఎప్పుడు ఒకటి సత్యమయియుంటేగాని బయలుదేరదు. ఐంద్రజాలికుడు సత్యమయి ఉండుటవలననే వానిలోనుండి ఐంద్రజాలికసృష్టి బయలుదేరినది అటులనే శక్తి సత్యమయినది ఉండుట వలననే రజతభ్రమ బయలుదేరినది. రజ్జువు సత్యముగా నుండుటవలననే సర్పభ్రమ బయయుదేరినది, నిద్రపోయినవాడు సత్యముగా ఒకడుండబట్టె వానిని ఆధారంగా చేసికొని స్వప్నప్రపంచం బయలుదేరినది.

అటులనే సత్యమయిన పరమాత్మ ఒకడుండబట్టె ఆయనను ఆధారంచేసికొని భూతభౌతిక ప్రపంచసృష్టి బయలుదేరినది. మాయా సృష్టి అనడంతోటే కనిపించేదంతయు మాయామయమని, ఈ సృష్టికి ఆధారమైన అనగా అధిష్ఠానమైన సత్యమైన ఒకవస్తువు మనకు కనిపించకపోయినను వున్నదని అనుభవంగా అంగీకరించవలసినదే. గనుక మాయావాదము అద్వైతసిద్ధికి చాలా అనుకూలమని ప్రపంచం మిథ్యయని బ్రహ్మసత్యమని బహుప్రమాణ వచనములనుబట్టి నిశ్చయమగుచున్నది.

మరియొక వచనం.

శ్లో॥ అసతో మాయయా జన్మతత్త్వతో నైవయుజ్యతే
వంధ్యా పుత్రోనతత్త్వేన మాయయావాపి జాయతే॥

లేనివస్తువునకు మాయచేతగాని, నిజముగాగాని ఉత్పత్తిలేదు. వంధ్యాపుత్రునికి మాయచేత ఉత్పత్తిలేదు. నిజముగాకూడా ఉత్పత్తిలేదు. గనుక అసత్తునుండి మాయాసృష్టి చెప్పుటకు వీలులేదు. సత్తునుండే మాయాసృష్టిని అంగీకరించవలయును. అటులైన బ్రహ్మ సత్యం జగన్మిథ్యా యని తెలునని తాత్పర్యం.

శ్లో॥ యథాస్వప్నేద్వయాభాసం స్పందతే మాయయా మనః
తథాజాగ్రద్ద్వయాభాసం స్పందతే మాయయామనః॥

మనస్సు పనిచేస్తే ప్రపంచమున్నది. లేకపోతేలేదు. స్వప్నావస్థయందు మనస్సు మాయచేతనే శరీరంలోపలనే విస్తారమైన ప్రపంచరూపముగా పరిణమించినది. మనస్సు స్వప్నరూపముగా విజృంభించుటలో మాయయేకారణం. అటులనే జాగ్రదవస్థయందుకూడా మనస్సు పనిచేయుచున్నదిగనుకనే ప్రపంచమంతయు కనిపించుచున్నది. దీనికిని మాయయే కారణం. మనస్సు పనిచేయక మాయయందు లీనమైనపుడు కార్యప్రపంచమేమీ లేదని ప్రసంగవశముగా చెప్పుకొనవచ్చును. మాయామూలకమే సర్వప్రపంచమని ఇట్టిమాయను ముందు అర్థంచేసికొని మాయాను మాయాకార్య ప్రపంచమును మిథ్యాభూతమని గుర్తించి పరమాత్మ సాక్షాత్కారమునుపొంది ముక్తిని పొందమని తాత్పర్యము.

శ్లో॥ యథా మాయామయో జీవో జాయతే మ్రియతేపిచ
తథా జీవా అమీసర్వే, భవంతి నభవంతిచ॥

జీవుని ఉత్పత్తినాశములు మాయవలన ఏర్పడినవిగాని పరమార్థమయినవి కావు. ఎలాగంటే ఐంద్రజాలికుడు ఇంద్రజాలవిద్యతో కొంతమంది జీవులను సృష్టించినట్లు మరల అదృశ్యంచేసినట్లు చూపిస్తున్నాడు. కొందరు మణిమంత్రాది సిద్ధినిపొందినవారుకూడా పూర్వకాలములయందు విచిత్రప్రపంచమును జీవులను సృష్టించి ఉపసంహరించినట్లు, రాక్షసులు యుద్ధసమయంలో మాయతో సేనలను సృష్టించినట్లు కొన్ని చరిత్రల వలన వింటున్నాము. అటులనే ఈ ప్రపంచమంతయు మాయామూలకమగు మనోవిజృంభితమని తాత్పర్యము.

శ్లో॥ స్వప్న మాయాయథాదృష్టే గంధర్వనగరం యథా
తథా విశ్వమిదం దృష్టం వేదాం తేషు విచక్షణైః॥

ఈ కారికకూడా చిత్రవిచిత్రముగా కనిపించిన స్వప్నప్రపంచము ఎటుల మిథ్యాభూతమో, ఐంద్రజాలిక మాయాసృష్టి ఎటులమిథ్యాభూతమో, ఆకాశమందు కనిపించే గంధర్వనగరం కనిపించి ఎటులమాయమైపోవునో ఈ మాయాకల్పిత ప్రపంచమంతయు ఆత్మప్రబోధచేత లయించి ఆత్మయే మిగులునని తాత్పర్యము.

శ్లో॥ అనాది మాయయాసుప్తో యదాజీవః ప్రబుధ్యతే
అజమ నిద్ర మస్వప్నం అద్వైతం బుధ్యతే తదా॥

అనాదియగు మాయా అనే నిద్రలో స్వరూపమును మరచి ప్రపంచభ్రమ అనే కలలో జీవుడేనరకున్నాడు. సర్వభ్రాంతిరహితమైన స్వప్రకాశమగు ఆత్మను ఎపుడు గురూపదేశముచేత అపరోక్షముగా తెలుసుకొనునో అనగా ప్రబోధను పొందునో అపుడే పరమాత్మ స్వరూపముగా నుండును.

శ్లో॥ మేఘచ్ఛన్నాంశుమాలీవ మాయయా మోహితోఽధికం
కించిత్కర్తా చకించిజ్ఞో లక్ష్యతే పరమేశ్వరః॥

మేఘముచేత నావరింపబడిన సూర్యునివలె, మాయచేత పరమాత్మ ఆవరింపబడి మోహితుడై. సర్వకర్తృత్వ సర్వజ్ఞత్వములులేక కించిజ్జ్ఞత్వ కించిత్కర్తృత్వములతో నున్నట్లు కనిపించుచున్నాడు. అనగా సచ్చిదానందస్వరూపుడైనను కొద్దివిజ్ఞానము కలవానివలె కొన్ని కార్యములయందే కర్తృత్వముకలవానివలె కనిపించుచున్నాడు. జ్ఞానముచేత అజ్ఞానమనే మాయానిద్ర పోగానే జీవభావంపోవునని ఈ స్తోత్రంలోనే అనేకమారులు ప్రసక్తి వచ్చినపుడు ప్రతిపాదించితిని. మాయాసృష్టివలన పరమాత్మకు మార్పు నిజముగా కలిగేది లేదు. మేఘముచేతగాని, రాహువుచేతగాని సూర్యుడు ఆవరింపబడినను సూర్యప్రకాశమునకు హానిలేదు. ఆవరించు మేఘము, రాహువు ఆవరింపబడే సూర్యునితో సమానసత్యములై యున్నవి. పరమాత్మను ఆవరించు అజ్ఞానావరణకూడా పరమాత్మయందే కల్పితమైనదని పరమాత్మతో సమసత్యముకాదు, పరమాత్మకంటే వేరుకాదని దృష్టాంతముకంటే తేడాను గమనించవలయును గనుకనే శాస్త్రసమన్వయజ్ఞానం కల గురువులవలన విని విమర్శించి తెలుసుకొనవలయునని శాస్త్రం చెప్పుటయే గాక పెద్దలుకూడా చెప్పెదరు. బ్రహ్మవిద్యయందు గురుశిష్యసంప్రదాయం చాలా పాటించదగినదనికూడా పెద్దలు చెప్పెదరు.

స్పష్టముగా శాస్త్రము చెప్పుచున్నను, పెద్దలు చెప్పుచున్నను మాయ విశ్వాసం కలగకుండా చేయును.

శ్లో॥ ఏవ మేషా మహామాయా వాదినా మపి మోహినీ
యస్మాత్తాన్సాక్షాత్కృతే సద్యో లీయతేచ సదాశివే॥

గొప్ప గొప్ప శాస్త్రకర్తలనుకూడా మాయ వ్యామోహింపచేయును.

ఈశ్వర సాక్షాత్కారము కలిగినపుడే మాయ అంతర్ధానమగును. అంత వరకు ఒకటి ఉంటే మరియొకటిగా భ్రాంతిని పొందుట తప్పదు, గనుక ఈశ్వర సాక్షాత్కారమునే కాంక్షించవలయును. ఇంత హృదయములో నుంచుకొని మాయా పరిభ్రామితః అని చెప్పిరి శంకర భగవత్పాదులవారి హృదయమంతయు మనకు అర్థమయినట్లు అనుకొనుట అపచారం. వారనుగ్రహముతో చెప్పినవిషయములో కొంతయే మనకు అర్థమగుచున్న దని నిరహంకారముగా అనుకొనవలయును.

భగవద్గీతలోకూడా "అవ్యక్తాదీని భూతాని వ్యక్తమధ్యాని భారత అవ్యక్త నిధనాన్యేవ తత్రకాపరివేదనా" సమస్త భూతములు పుట్టకముందు కనిపించక అవ్యక్తమైన మాయలోనుండియే పుట్టుచున్నవి. సృష్టికాలమందు మాత్రమే స్పష్టముగా గోచరించుచున్నవి. తిరిగి అవ్యక్తస్థితిలోనే చేరి పోవుచున్నవిగనుక, పరివేదన పడవద్దు నాయనా! ఈసృష్టిస్వభావ మిది యని అర్జునునకు కృష్ణపరమాత్మ మాయావాదమును చూపించుచు అద్వైత పర్యవసానము చూపించిరి.

శ్లో॥ దైవీహ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా

మామేవయే ప్రపద్యంతే మాయామేతాం తరంతితే! అని అర్జును నకు కృష్ణపరమాత్మ ఉపదేశించెను. మాయను దాటుట శక్యము కాదు. అనగా అనేక కార్యరూపములుగా విజృంభించుచున్న మాయను ఎవ్వరును నశింపచేయలేరు. ఎటులననగా ఒక ఐంద్రజాలికుడు ఇంద్రజాలవిద్యలో అద్భుతమగు ప్రపంచమును సృష్టించి చూచేవారికి చూపించేసమయంలో చూచేవారు ఆ ఐంద్రజాలికసృష్టిని చూచి ఆశ్చర్యపడుచుండేగాని దానిని అణచివేయజాలరు. ఆ సృష్టిని ప్రసరింపచేసిన ఐంద్రజాలికుడే ఉపసంహ రించగలడు. అటులనే ఈ మాయ. దాని కార్యమగు ప్రపంచం. నాలో నుండి బయలుదేరినవిగనుక నేనే దీనిని ఉపసంహరించవలయునుగాని,

నా మాయనుచూచి ఆశ్చర్యపడే జీవులు నశింపచేయజాలరు. కాని, నన్ను సేవించి నన్ను నిజముగా నేనే పరమాత్మనని తెలిసికొన్నవారు మాత్రం నా మాయనుదాటి నాలో ఐక్యమును పొందగలరు. అనగా వారికి పరమార్థ స్వరూపుడనగుటచేత జ్ఞానులకు అజ్ఞానమును పోగొడుదునని తాత్పర్యము.

"నాహం ప్రకాశ స్సర్వస్య యోగ మాయా సమావృతః" అని చెప్పిరి. యోగమాయ అనగా సత్వరజ స్తమోగుణముల కలియిక రూపముగానున్న మాయ. అట్టి మాయచేత నేను ఆవరింపబడుటచేత, నన్ను ఎవ్వరు తెలుసుకొనలేకున్నారు. అని చెప్పినందువలన. పరమాత్మ మాయ చేత ఆవరింపబడి, మాయాసృష్టి బయలుదేరినట్లు స్పష్టమగుచున్నది. శంకర భగవత్పాదులవారు భగవద్గీతా భాష్య ప్రారంభమందు.

"త్రిగుణాత్మికాం. వైష్ణవీం. స్వాం. మాయాం. మూలప్రకృతిం.
వశీకృత్య. అజో. అవ్యయః. భూతానా, మీశ్వరః।
నిత్య. శుద్ధ, బుద్ధ. ముక్త. స్వభావో౽పిసన్. స్వమాయయా
దేహవానివ. జాతఇవ. లోకానుగ్రహం. కుర్వన్నివ.లక్ష్యతే॥" అని

చెప్పిరి. అనగా మాయయే మూలప్రకృతి అనుటచేత, సమస్త ప్రపంచమునకు మాయ పరిణామ్యుపాదానమని ప్రపంచమంతయుమాయామయమే నని, పరమేశ్వరుడు సచ్చిదానందస్వరూపుడు, నిర్వికారుడు అయినను, స్వమాయచేతనే దేహము కలిగియున్నట్లు, జన్మించినట్లు దుష్టులను నిగ్రహించుచున్నట్లు, శిష్టులను పరిపాలించుచున్నట్లు కనిపించుచున్నాడు. గాని, పారమార్థికముగా ఇదేమియులేదు. పారమార్థికం ఎవ్వరికిని తెలియుట లేదని స్పష్టమగుచున్నది.

శ్లో॥ నమాం దుష్కృతినో మూఢాః ప్రపద్య న్తే నరాధమాః
మాయయాపహృత జ్ఞానా ఆసురం భావమాశ్రితాః॥

పాపాత్ములగు, మూఢులగు అధమస్థితిలోనున్న మనుష్యులు నన్ను తెలిసికొనలేరు. మాయయాఽపహృతజ్ఞానాః అంటే – అపహరించడం అంటే దొంగిలించడమని యర్థము. మాయ జ్ఞానాన్ని అపహరించి నది. జ్ఞానమంటే తన స్వరూప చైతన్యమగు. పరమాత్మ అని అర్థము. అనగా మాయ మన స్వప్రకాశానందస్వరూపమును అపహరించినది మనకు తెలియకుండా చేసినది. అందుచేతనే పాపాచారులై పరులను హింసించుట, అబద్ధములాడుట మొదలగు అసురభావమును పొంది నన్ను తెలుసుకొనలేకున్నారని, మాయ ఆత్మను ఆవరించినదని అందుచేతనే అసుర భావం కలిగినదని అనగా ఆవరణమూలముగానే విక్షేపము కలిగినదని, మాయయే సర్వభ్రాంతికి మూలమని శ్రీ కృష్ణపరమాత్మ సూచించెను.

శ్లో॥ మాయాహ్యేషా మయాసృష్టా యన్మాం పశ్యసి నారద
సర్వభూత గుణైర్యుక్తం నైవం మాం జ్ఞాతుమర్హసి॥

ఓ నారదా! ఈ ప్రపంచమంతయు మాయగానే సృష్టింపబడినది. అనగా మాయచేతనే నేను అనేక విధములగు ప్రపంచముగా కనిపించుచున్నాను. అట్టి మాయాకల్పిత స్వరూపమునే నీవు చూస్తున్నావు, గాని, ఇట్టి మాయాకల్పితమైన ఈ నా స్వరూపమే పరమార్థమని గ్రహింపవద్దు. అని నారదులవారికి భగవంతుడు చెప్పెను. గనుక ఇదంతయు మాయా వ్యామోహమని పరమార్థము కాదని గ్రహించవలయును.

మాయా స్వభావమును విచారించుట, తత్వమును తెలిసికొనతలచిన వారికి చాలా ముఖ్యముగనుక, మాయా పంచకమను అయిదు శ్లోకములను ఉదహరించుచున్నాను.

శ్లో॥ నిరుపమ నిరంశ కేప్యఖండే మయిచితి సర్వవికల్పనాది
శూన్యే
ఘటయతి జగదీశ భేదభావం త్వ ఘటిత ఘటనా
పటీయసీ మాయా॥

పరమాత్మ అసదృశమైనది. అవయవములు లేనిది. అఖండం= ఖండములేనిది అనగా-దేశకాల వస్తు పరిచ్ఛేదము లేనిది. సజాతీయ విజాతీయ స్వగత భేదములేనిది. అనగా-ఒక దేశంలో ఉన్నది. ఒక దేశంలో లేదని. దేశపరిభేదము (అల్పత్వము) లేనిది. ఒక కాలమందున్నది, ఒక కాలమందు లేదు, అను కాలపరిచ్ఛేదము లేనిది. పరమాత్మ ఒక వస్తువు అగును. ఒకటి కాదని. వస్తుపరిచ్ఛేదములేనిది. చెట్టుకు సజాతీయమగు మరియొక చెట్టున్నట్లు. పరమాత్మకు సజాతీయమగు మరియొక పరమాత్మ లేడు. చెట్టుకు భిన్న జాతీయమగు రాళ్ళు మొదలగునవి ఉన్నట్లు, పరమాత్మకు విజాతీయములు వేరుగా లేవు. చెట్టులో స్వగతమైన కొమ్మలు ఆకులు, కాయలున్నట్లు పరమాత్మలో అవయవములు వేరుగా లేవు. గనుక పరమాత్మ అఖండం. అంతయు అదియేగనుక అఖండమని గ్రహించవలయును.

అట్టి స్వప్రకాశమైన ఏ కల్పనలులేని ఆత్మయందు జీవులని, ఈశ్వరుడని, ప్రపంచమని నానా దృశ్యములను అఘటిత ఘటనాపటీయసీ–ఘటన కానిదానిని కూడా ఘటనచేయు సామర్థ్యముకలది. అనగా కుదరని దానిని కుదిర్చేది. అసంభవంను సంభవంచేయు సామర్థముగల మాయ కల్పనచేయుచున్నది. లేనిదానిని ఉన్నట్లు, ఉన్నదానిని లేనట్లు మాయ చేయగలదు. లేని ప్రపంచమును ఉన్నట్లు, ఉన్న పరమాత్మనులేనట్లు చేసినది. ఇంతకంటే అఘటిత ఘటనాసామర్థ్యం వేరుగా చెప్పనవసరంలేదు. మాయా

రూపమైన అజ్ఞానములోనుండి బయలుదేరిన నిద్రాదోషము స్వప్నమందు ఒకచోట ఉన్నవానిని మరియొకచోట నున్నట్లు, రాత్రి పగలువలె, పగలు రాత్రివలె చిత్రములైన మార్పులను చూపించుచున్నదికదా. ఇది కూడా అఘటిత ఘటనా సామర్థ్యమే. అసలు మాయకు చెప్పేదేమిటి? అందుచేత మాయావాదం చాలా ఆశ్చర్యకరమైనదని, అద్వైతస్థితి పరమానందమని గుర్తించవలయును.

శ్లో॥ శ్రుతిశత నిగమాంత శోధకానప్యహా రహరాహారతో ధనాని సద్యః॥

కలుషయతి చతుష్పదాద్యభిన్నాన ఘటితఘటనా పటీయసీ మాయా॥

వేదములను చదివి, శాస్త్రములను చదివి. వేదాంతములను పరిశీలించినవారినికూడా అనగా వేదశాస్త్రములవలన ఆత్మానాత్మ పరిశీలనకొంత చేసినవారినికూడా ప్రతిరోజూ పొట్టకొరకు, దారాపుత్రాదుల పోషణకొరకు, ధనం కావలెననే కోరికతో దైన్యమును పొందించి. ఆయా వృత్తుల యందు ప్రవర్తింపచేసి, పశువులతో సమానముగా చేయుచున్నది మాయ. పశువులు ఇష్టానిష్టములు సంభవించినపుడు సంతోషమును, దుఃఖమును పొందుచుంటవి. మంచి గడ్డిచూపించి దా యని పిలిస్తే దగ్గరికి ప్రీతిగా వస్తవి. కర్రతీసుకొని వెంటబడితే పరిగెత్తివెళ్లిపోతవి. అటులనే మనుష్యులై బాగా చదువుకున్నవారుకూడా ఇష్టము లభించినపుడు సంతోషిస్తారు. అనిష్టము సంభవించినపుడు దుఃఖమును పొందుచు క్లేశపడుదురు.

ఒకటేమిటి సర్వజీవరాసులు ఆయా శరీరములయందు అభిమానము కలవై అనేక పనులు చేయుచు సర్వకాలములయందు ఏదో ఆందోళనతోను అనేక కోరికలతోను, నిద్రాహారాదులతోను పరమార్థమును గుర్తె

మగక పరిభ్రమించుచున్నారు. పిపీలికాది బ్రహ్మపర్యంతం అన్ని భూత ములను దృష్టిలోపెట్టుకొని ఒక్కొక్క జీవునియొక్క దృష్టి, కోరిక, ప్రవృత్తి, జన్మపరంపర, సుఖదుఃఖములు. అవస్థాత్రయము అందులో జరిగే మార్పులు మొదలగు జీవగతిని ఆలోచిస్తే ఆశ్చర్యం కలుగుతుంది. ఖగోళం భూగోళం, భూతభౌతిక ప్రపంచమును ఇట్టి ప్రపంచంలో తిరుగు చున్న నేననే ఆత్మను ఈ విషయములను ఆలోచించినయెడల చాలా ఆశ్చర్యంగా నుండును. ఇదంతయు మాయావిలాసమే. మాయకుగల అఘ టిత ఘటనాసామర్థ్యమని తాత్పర్యము.

శ్లో॥ ఓ సుఖచిదఖండ బోధమద్వితీయం వియదనలాది వినిర్మితే
వియోజ్య
భ్రమయతి భవసాగరేని తాంతం త్వఘటిత ఘటనా
పటీయసీ మాయా॥

ఏమి ఆశ్చర్యము !

సుఖరూపమయిన, స్వప్రకాశమైన, అఖండమైన, అద్వితీయమగు ఆత్మను ఆకాశాది భూతములతో తయారయిన ప్రపంచంలో శరీరం కల వానినిగాజేసి ఉన్నరూపమును తెలియకుండాజేసి లేనిస్వరూపము కల్పించి దానినే సత్యమనిపించి ఈ అనిర్వచ యమైన సంసారసముద్రమందు పరిభ్రమింపచేయుచున్నది ఈ మహామాయ. ఇంతకంటే ఈ మహామా యకుగల అఘటితఘటనా సామర్థ్యం వేరే చెప్పవలసినదేమున్నది. యని తాత్పర్యం.

శ్లో॥ అపగతగుణకర్మ జాతిభేదే, సుఖచితి విప్రవిదాద్యహం
కృతించ
స్ఫుటయతి సుతదార గేహ మోహం త్వఘటిత ఘటనా
పటీయసీ మాయా ॥

అబ్బా! ఏమిది పరమాశ్చర్యము

పరమాత్మకు కర్తృత్వ భోక్తృత్వాది ధర్మములు లేవు. గుణములు లేవు, దోషములు లేవు, పుణ్యపాపాది కర్మలు లేవు, జాతిలేదు, ఏవిధ. మైన వికారములు లేవు. స్వప్రకాశమానమైన, ఆనందరూపమయినది ఇట్టి నిర్వికారమయిన ఆత్మయందు నేను బ్రాహ్మణుడనని, క్షత్రియుడనని జాతిభేదమును, నేను పండితుడను, తెలిసినవాడను, గొప్పవాడను, ధన వంతుడను, రూపవంతుడను, దానశీలుడను, అని ఈ విధముగా అహం కారమును దేహమందు, ఇంద్రియములయందు, మనస్సుయందు కూడా నేననే అహంకారమును పుత్రులయందు, భార్యయందు, గృహమందు, భ్రమను నాభార్య, నాపుత్రుడు, నాయిల్లు అను మమకారమును కలుగచేసి ఆత్మను మరిపించి జీవభావంలో పరవశులనుగా చేసినది మాయ. ఇదం తయు మాయకుగల అఘటిత ఘటనా సామర్థ్యమేనని తాత్పర్యము-

శ్లో॥ విధి హరిహర భేదమప్యఖండే బతవిరచయ్య బుధానపి ప్రకామం
భ్రమయతి దురహంకృతి ప్రమత్తా ఘటిత ఘటనాపటీ యసీ మాయా॥

ఆహా ! ఏమి మాయాసామర్థ్యము.

అఖండమయిన ఏభేదములేని పరమాత్మయందు బ్రహ్మయని, విష్ణువని, ఈశ్వరుడని భేదమును కల్పించి దేవతలను, పండితులనుకూడా దురహంకారపూరితులనుచేసి ప్రపంచంలో భ్రమింపచేయుచున్నది మాయ, అనగా బ్రహ్మయే పరమార్థమని అనగా కార్యబ్రహ్మయే ఉపాసన పరమ ముక్తికి సాధనమని అంతకన్నా మోక్షమునకు వేరుసాధనం లేదని అహం కారంతో కొందరు భ్రాంతిని పొందిరి, మరికొందరు విష్ణువే పరమార్థము.

అట్టి విష్ణుమూర్తి సేవచేత, భక్తిచేతనే తరించవలయునుగాని, వేరుమార్గ మేమియు లేదని అభిమానముతో భ్రమించిరి. ఈశ్వరుడే పరమార్థమని ఈశ్వర సేవయే ముక్తికి సాధనమని కొందరు గ్రహించి భ్రమించిరి. బ్రహ్మవిష్ణు మహేశ్వరులగు ముగ్గురుమూర్తులలో నిండియున్న ఈ ముగ్గురికంటె అతీతమైన సచ్చిదానంద రూపమగు పరమాత్మను తెలిసికొనలేక సంసారములో మాయకు స్వాధీనులై పరిభ్రమంచుచున్నారంటే మాయయే కారణం. అట్టి మాయ సంఘటన కానిదానిని సంఘటనచేయు సామర్థ్యము కలది. ఇట్టి మాయను దాటవలయునంటే పరమాత్మ సాక్షాత్కారమే సాధనం. కాని మరియొకసాధనం లేదని ఉపనిషత్తులకు తాత్పర్యమని, ఈ దక్షిణామూర్తి స్తోత్రమునకుకూడా ఇదియే తాత్పర్యమని గట్టిగా గుర్తుపెట్టుకొనవలసిన విషయం.

పశ్యన్నాత్మని మాయయా బహిరివోద్భూతం యథానిద్రయా, మాయా కల్పిత దేశకాల కలనా వైచిత్ర్యచిత్రీకృతం అని మాయావీవ విజృంభయత్యపి మహాయోగీవ యస్స్వేచ్ఛ,యా యని,మాయాశక్తి విలాసకల్పిత మహామోహ సంహారిణేయని, రాహుగ్రస్త దివాకరేందు సదృశో మాయాసమాచ్ఛాదనాత్ అని. స్వప్నే జాగ్రతివాయ ఏషపురుషోమాయా పరిభావితః అని. మాయాకల్పనను ప్రతిపాదించుచు యేమహానుభావుని మాయావిలాస. ఈరీతిగా వివిధముగా ప్రతిభాసించుచున్నదో, అట్టి దక్షిణామూర్తిస్వామివారికి నమస్కారమని చెప్పుచు ఈ దక్షిణామూర్తిస్వామివారి యనుగ్రహమువలన కలిగిన జ్ఞానముచేతనే ఈ మాయాభ్రాంతి సంసారమును దాటవలయునుగాని వేరుమార్గము లేదని సూచించిరి. శ్రీ దక్షిణామూర్తి స్తోత్రం తత్వమును బోధించునది. జ్ఞానము నిచ్చునది గనుకనే ఇతరస్తోత్రము కంటే ఈ స్తోత్రమునకు మొట్టమొదటనే ప్రతిపదార్థ తాత్పర్య వివరణములను వ్రాసితిని.

అద్వైతబోధకుముందు మాయాస్వరూప విచారముచేసి ప్రపంచము మాయయని తెలిసికొనుట అవశ్యకము గనుకనే శంకరభగవత్పాదుల వారు బ్రహ్మసూత్రములకు భాష్యం వ్రాయుచు ముందు అధ్యాసభాష్యం వ్రాసియే సకల శాస్త్రార్థమును వ్రాసిరి ఇది ముఖ్యముగా గమనించవల సిన విషయం. ఈ అద్వైత వేదాంత శాస్త్రమందు విషయం జీవ బ్రహ్మైక్యం ప్రయోజనం అజ్ఞాన తత్కార్య రూపముగానున్న సంసార బంధనివృత్తియై స్వరూపావస్థితికదా. ఈ విషయ ప్రయోజనములు సిద్ధించ వలయునంటే అంత మాయామయమని ఆరోపితమేనని భ్రమను వర్ణిం చుట చాలా అవసరమే. ఈ యధ్యాసను మొదట తెలుసుకొనకపోతే ప్రపంచం సత్యమయితే జీవత్వంపోదు గనుక జీవుడు పరమాత్మతో ఐక్య మును పొందుట కుదరదు.

ఇదంతయు భ్రమకానియెడల సత్యమగు సంసారబంధము ఎప్పు డును నశించదు గనుక. జీవునికి అజ్ఞాన తత్కార్య రూపముగానున్న సంసారబంధ నివృత్తియనే ప్రయోజనం కూడా సిద్ధించుట కవకాశంలేదు. ఇట్టి విషయ ప్రయోజనములే లేక పోతే విషయ ప్రయోజనములులేని శాస్త్ర మును ఎవరు చదువుదురు, గనుక విషయ ప్రయోజన సిద్ధికొరకు ముందు అధ్యాసను అనగా అంతయు మాయామయం. భ్రమయని వర్ణించుట చాలా అవసరం. జ్ఞానముచేతనే జీవుడు బ్రహ్మయగునని సంసారబంధము పోవు నని శాస్త్రంచెప్పుచున్నది గనుక. జీవత్వంతోసహా ప్రపంచమంతయు అజ్ఞానంచేతనే యేర్పడినదని చెప్పవలయును. అజ్ఞానంవలన యేర్పడు టయే అధ్యాసకదా, అటులయినయెడల జ్ఞానముచేతనే అజ్ఞానం,దానివలన ఏర్పడిన జీవత్వభ్రమ, సంసారభ్రమలు, నిశ్శేషముగా పోవును, అటులైన యెడల జీవబ్రహ్మైక్యమనే విషయము, బంధనివృత్తి యనే ప్రయోజనం రెండును బాగుగా కుదురును. గనుకనే సమస్త వేదాంతములు అద్వితీయ మగు బ్రహ్మయందు సమన్వయించునని తెలుసుకొనవచ్చును.

అందుచేతనే శంకరభగవత్పాదులవారు ఈ స్తోత్రమందు మాయా పదమును అనేక పర్యాయములు వాడిరి చివరకు మాయా పరిభావితః అనిరి. అందుచేత ఈ విశ్వం పశ్యతి కార్యకారణ తయా అను శ్లోకం క్రింద మాయా విమర్శచేసి మాయా పంచకము నుదహరించి మరికొన్ని వచనములనుకూడా ఉదహరించి సాధ్యమైనంతవరకు సులభముగా తెలియు నటులనే వ్రాసితిని. ఇంతకన్నను అతి గంభీరమైన శాస్త్రచర్చలను వ్రాసినయడల చదువువారికి క్లేశముగానుండును గనుక అట్టి చర్చలను వ్రాయక, వాటి సారమును, కొన్ని విశేషములనుకూడా వ్రాసితిని. విర క్తులై జిజ్ఞాసువులైన మహాపురుషులు ఈ తత్వవిచారమును, నడుచు చున్నను, నిలచున్నను, మేలుకున్నను, పడుకున్నను సర్వకాలముల యందును చేయుచు, ఆనందమును పొందుచునే యుందురు. ఇట్టి అనుభ వమునకు దగ్గరగానున్న ఆత్మానుభూతిని సంపాదించి తరించుట చాలా ప్రధానమని భావించి సర్వసంగత్యాగులై ఈబ్రహ్మవిద్యయందే నిమ గ్నులై కృతకృత్యులైరి. గనుక సర్వులు పరమాత్మను తెలుసుకొని తరించవలయునని తాత్పర్యము.

ఇట్టి జీవబ్రహ్మైక్యమును తెలుసుకొనుటకు సద్గురువు వద్దకేవెళ్ళి వారి శుశ్రూషచేసి, వారి యనుగ్రహమును పొంది, వారు చెప్పిన తత్వ మును విని,గ్రహించి, మరువక, మననముచేయుచు, అనుభవమునకువచ్చు నటుల చేసుకొనవలయును. తన రోగంపోవడానికి తను మందు పుచ్చుకు న్నట్లు "ఉద్ధరేదాత్మనాత్మానం నాత్మాన మవసాదయేత్ ఆత్మైవహ్యాత్మనో బంధురాత్మైవ రిపురాత్మనః" అని గీతలో చెప్పిరి. తననుతను ఉద్ధరించవల యును, ఉద్ధరించడమనగా పైకితీయడం జీవుడు ఎక్కడ పడిపోయినాడు పైకితీయడాకంటే అజ్ఞానమూలకమగు సంసారసముద్రంలో పడిపోయి నాడు. అజ్ఞానమూలక సంసారసముద్రంలోనుండి ఉద్ధరించవలెనంటే జ్ఞాన మును సంపాదించవలయును. ఆ జ్ఞానం తన స్వరూప సాక్షాత్కారమే

గనుక అట్టి సాక్షాత్కారమును సంపాదించిన స్వరూపాజ్ఞానం, సంసార బంధం పోవునుగనుక ఉద్ధరింపబడుతాడు. అజ్ఞాననివృత్తియే ఉద్ధరణ అంతే గాని మనుష్యజన్మలో ఆత్మజ్ఞానమును సంపాదించకుండా ఆత్మను పాడుచేసుకొనకూడదు.

ఆత్మయే ఆత్మకు బంధువు. ఆత్మయే ఆత్మకు శత్రువు. గురువులు ఎంత చెప్పినను స్వప్రయత్నముతో తన చాలా శ్రద్ధాభక్తులతో తత్వ చింతన చెయవలయును. ఏ ఉపనిషత్తును చూచినను జ్ఞానకాండ అతి లోతుగాను, రహస్యంగాను కనిపిస్తుంది చాలా కట్టుబాట్లతో సిద్ధాంత మును తెలుసుకొనవలయునుగాని, ఇతిహాసములనువలె గ్రహించకూడదు. ఇట్టి జ్ఞానమునకు సాధనంగా శంకరభగవత్పాదులవారు భజగోవింద శ్లోకములలో "త్రిజగతి సజ్జనసంగతి రేకా భవతి భవార్ణవతరణే నౌకా" యని చెప్పిరి. సంసార సముద్రమును దాటవలయునంటే మూడులోక ములలో సజ్జనసాంగత్యమనే ఒక పడవకలదు. ఆ పడవను ఎక్కియే ఈ సంసారసముద్రమును దాటవలయునని తాత్పర్యము గనుక ఈ మాయా పరిభ్రమణమును నివర్తింపచేయు సచ్చిదానందాద్వితీయ బ్రహ్మసాక్షా త్కారమును సంపాదించి తరించవలయునని పరమార్థము,

తాత్పర్య వివరణం సమాప్తం.

అవతరణిక

ఇంద్రియములకును, మనస్సుకును ఇతర ప్రమాణములకును గోచ రించనిది పరమాత్మ. అట్టి నిర్వికారమగు పరమాత్మను వేదములుకూడా ఈ రూపముగా నున్నదని విధిరూపముగా బోధింపజాలక, ఆరోప నిషేధపూర్వ కముగానే ప్రతిపాదించుచున్నవి. అట్టి పరమాత్మను తెలిసికొనుటకు శ్రవణంచేసి, మననంచేసి, నిధిధ్యాసనచేసి, అట్టి పరమాత్మ నే నే నైతినని

అపరోక్షజ్ఞానమును సంపాదించుటకు అసమర్థులైన మందాధికారులకు, అనగా రెండవరకమైన అధికారులకు, క్రమముగా ముక్తి లభించుటకు సాధనమైన అష్టమూర్త్యుపాసన చెప్పుటకు, సాధన చతుష్టయసంపత్తి కలిగి సూక్ష్మబుద్ధి కలిగిన ఉత్తమాధికారులకు, జీవబ్రహ్మైక్య విషయక శ్రవణాది వేదాంతవిచారమే సాధనమని చెప్పుటకును ఈ శ్లోకమును రచించిరి.

శ్లో॥ భూరంభాంస్యనలోఽనిలోఽంబరమహర్నాథో హిమాంశుః
పుమానిత్యాభాతిచ రాచరాత్మకమిదం యస్యైవమూర్త్యష్టకం
నాన్యత్కించన విద్యతే విమృశతాం యస్మాత్పరస్మాద్విభో
స్తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే ॥౧౦॥

ప్రతిపదార్థము.

భూః=భూమియు, అంభాంసి=జలము, అనలః=అగ్నియు, అనిలః=వాయువు, అంబరం=ఆకాశము, అహర్నాథః=సూర్యుడు, హిమాంశుః=చంద్రుడు, పుమాన్=కర్మకాండకు, జ్ఞానకాండకు అధికారియైన జీవుడు, యస్యైవ=ఏ పరమేశ్వరుడైన, సర్వజ్ఞుడైన, సర్వశక్తిగల సచ్చిదానందరూపుడైన సదాశివునియొక్కయే, మూర్త్యష్టకం—మూర్తి=మూర్తులయొక్క, అష్టకం=ఎనిమిదింటియొక్క సముదాయము, ఆభాతి=అంతట ప్రకాశించుచున్నదో, అనగా—ఈ ఎనిమిది స్వరూపములుగల ఈశ్వర స్వరూపుడనే నేనని అహంగ్రహోపాసన చేయమని యర్థము. విమృశతాం=ఈశ్వరానుగ్రహమువలనకలిగే తత్వ సాక్షాత్కారమే మోక్ష సాధనమని శ్రవణాది విచారణచేయువారికి, పరస్మాత్=సర్వకారణమైన, విభోః=అనేకరూపములుగల ప్రపంచరూపముగా వివర్తమానమైన, దేశ కాల వస్తు పరిచ్ఛేదరహితమైన, యస్మాత్=యేసకల ప్రపంచాధిష్ఠానమైన

సచ్చిదానందరూపమైన పరమాత్మకంటే, అన్యత్ = వేరు, కించన = కొంచెము కూడా, నవిద్యతే = కాదో (లేదో); తస్మై = ఆ, శ్రీ గురుమూర్తయే = గురుమూర్తి అయిన శ్రీ దక్షిణామూర్తయే = దక్షిణామూర్తి స్వామికొరకు, ఇదం = ఈ, నమః = నమస్కారము.

తాత్పర్య వివరణము.

నిత్యానిత్య వస్తువివేకము, ఇహాముత్రార్థ ఫలభోగ విరాగము, శమాది షట్కసంపత్తి ముముక్షుత్వమును సాధన చతుష్టయ సంపత్తి కలవారై సూక్ష్మబుద్ధికలవారై సర్వకాలములయందు బ్రహ్మవిచారముచేసి, అనగా పరమాత్మయందే ప్రపంచమంతయు ఆరోపింపబడినదిగనుక, ఆరోపింపబడిన ప్రపంచము అధిష్ఠానమైన పరమాత్మకంటే వేరుకాదు గనుక. అధిష్ఠానమైన బ్రహ్మయే సత్యం. ఆరోపిత ప్రపంచమంతయు మిథ్యయని భావించి శ్రవణ మనన నిదిధ్యాసనలుచేసి అహం బ్రహ్మాస్మి అని బ్రహ్మసాక్షాత్కారమునుపొంది ముక్తిని పొందువారు ఉత్తమాధికారులు.

సాధనసంపత్తి సరిగాలేక, సూక్ష్మబుద్ధిలేక శ్రవణాదులు చేయలేనివారు మందాధికారులు, శ్రవణమనగా సమస్త వేదాంతములు అనగా ఉపనిషత్తులు, అద్వితీయమైన పరబ్రహ్మను తాత్పర్యముతోబోధించుచున్నవని విని, మనస్సులో నిశ్చయజ్ఞానం కలుగునట్లు చర్చచేయుట. మనన మనగా శ్రవణము చేసిన విషయమును అనేక హేతువులతోను, అనేక దృష్టాంతములతోను సంశయములేకుండా మనస్సులో దృఢపరచుకొనుట, నిదిధ్యాసనమనగా శ్రవణమననములతో సందేహములేకుండా నిశ్చయింపబడిన పరబ్రహ్మస్వరూపమును నేను జీవుడను కాదు. పరబ్రహ్మ నేనేనని ధ్యానముచేయుట.

ఇట్టి కష్టతరమైన శ్రవణమనన నిదిధ్యాసలను సూక్ష్మబుద్ధి లేనివారు చేయజాలరు గనుక ఇట్టి రెండవరకమగు అధికారులకే ఉపనిషత్తుల

యందుసగుణ బ్రహ్మోపాసనలు చెప్పబడినవి. ఆ సగుణ బ్రహ్మోపాసనల వలన పరిపక్వస్థితిపొంది, దేహము పడిపోయిన తరువాత సగుణ బ్రహ్మలోకమునకుపోయి ఆ లోకమందు ఆ సగుణ బ్రహ్మ అనుగ్రహము వలన, నిర్గుణబ్రహ్మ విచారంచేసి, ఆ లోకమందే నిర్గుణబ్రహ్మసాక్షాత్కారమునుపొంది, ఆ సగుణ బ్రహ్మతోకూడా ఈ సగుణ బ్రహ్మోపాసకులు నిర్గుణ బ్రహ్మస్వరూపముతో ఐక్యమును పొందుదురు. ఇదియే క్రమ ముక్తి. ఈ క్రమముక్తి సగుణ బ్రహ్మోపాసనవలన కలుగును.

ఆ సంప్రదాయానుసారముగా శంకర భగవత్పాదులవారు ఈశ్లోక మందు సగుణోపాసన చెప్పిరి. ఉపాసన ఎటులననగా, కొద్దిదానియందు గొప్పదృష్టిని ఉంచుట ఇదియే ఉపాసనకు ముదటిలక్షణము; పృధివి, జలము, తేజస్సు, వాయువు, ఆకాశము ఈపంచభూతములు, సూర్యుడు, చంద్రుడు, కర్మజ్ఞానాధికారియగు జీవుడు, ఈ ఎనిమిది అష్టమూర్తులు, ఈ అష్ట మూర్తులతోకూడి అనగా ఈ అష్టమూర్తులు ఈశ్వరునికి శరీరమని అను కుందాము. ఇట్టి ఈశ్వరుడు సమష్ట్యుపాధికుడు. ఇట్టి ఈశ్వరునితో తనకు ఐక్యమును భావించి ఉపాసన చేయవలయును.

ఎటులననగా! తన శరీరం పంచభూతములతో తయారైనది గనుక శరీరంలో పంచభూతములున్నవి. ప్రపంచంలోనున్న సమష్టి మహాపంచ భూతములను. తన శరీరంలోనున్న వ్యష్టి పంచభూతములను ఒకటిగా భావించవలయును. అష్టమూర్తులలోని సూర్యచంద్రులను, తన శరీర ములోనున్న ప్రాణాపానవాయువులను ఒకటిగా భావించవలయును జీవుడు తనేఅయియున్నాడు గనుక వ్యష్టి శరీరము ఉపాధిగాగల తనకు అష్టమూర్తులనే సమష్టిప్రపంచము ఉపాధిగాకల పరమేశ్వరునుకు, ఐక్య మును భావించవలయును.

అనగా సర్వవ్యాపకమై అష్టమూర్త్యభిమానిఅయిన సదాశివుడనే నేనని అహంగ్రహోపాసన చేయవలయును. ఇట్టి ఉపాసనవలన, ఈశ్వర సాయుజ్యమునుపొంది, ఆ ఈశ్వరానుగ్రహమువలన నిర్గుణ బ్రహ్మ సాక్షాత్కారమునుపొంది, ముక్తిని పొందుదురు. ఇదియే క్రమ ముక్తి సాధనమని, శంకర భగవత్పాదులవారు, అతిదయతో అనుగ్రహించిరి. ఇట్లు తాత్పర్యవివరణ సమాప్తం.

**అవతరణిక.**

ఇపుడు ఈ దక్షిణామూర్తి స్తోత్రమును చదువుటకు అర్థమును తెలిసికొనుటకు ప్రవర్తించిన ఉత్తమజీవులకు కలుగబోవు ఫలమును చెప్పుచు ఈ స్తోత్రమును పూర్తిచేయుచు. ఈ శ్లోకమును ఫలశ్రుతి స్థానీయముగా కూడా చెప్పిరి.

శ్లో॥ సర్వాత్మత్వమితి స్ఫుటీకృతమిదం యస్మాదముష్మిం స్తవే,
తేనాస్య శ్రవణాత్త దర్థమననాద్ధ్యానాచ్చ సంకీర్తనా।
త్సర్వాత్మత్వమహావిభూతిసహితం స్యాదీశ్వరత్వం
స్వతస్సిద్ధ్యే
త్తత్పునరష్టధా పరిణతం చైశ్వర్యమవ్యాహతం॥౨౨॥

ప్రతిపదార్థ నిరూపణము :

ఇతి = ఈ చెప్పినరీతిగా; యస్మాత్ = ఏ కారణమువలన; అముష్మిన్ = ఈ, స్తవే = దక్షిణామూర్తిస్తోత్రమందు; ఇదం = ఈ, శ్రుతులయందు చెప్పబడిన (ప్రత్యక్షమైన); సర్వాత్మత్వం = పరమాత్మకు సర్వరూపత్వము (సర్వరూపమగుస్థితి); స్ఫుటీకృతం = స్పష్టముగా తెలియచేయబడినది; తేన = ఆకారణముచేత; అస్య = ఈదక్షిణామూర్తిస్తోత్రముయొక్క;

శ్రవణాత్ = యథావిధిగా గురువువలన వినుటవలన; తదర్థమననాత్ = శ్రవణంచేసిన విషయమును అనేక దృష్టాంతములతోను, అనేకయుక్తుల తోను, మనస్సుతో చింతనచేసినందువలన; ధ్యానాచ్చ = శ్రవణమనన ములతో నిర్ణయింపబడిన సర్వాత్మకమయిన సచ్చిదానందమయిన నిత్యసిద్ధ బుద్ధ ముక్తస్వరూపమయిన పరమాత్మనే నేనని తైలధారవలె ఇతర వృత్తిలో వ్యవధానములేని, పరమాత్మాకార వృత్తిప్రవాహరూపమైన నిది ధ్యాసనవలన। సంకీర్తనాత్ = ఇతరులకు బాగుగా చెప్పుటవలన, లేక ఈ దక్షిణామూర్తిస్తోత్రమును చదివినందువలనగాని; సర్వాత్మత్వ మహా విభూతిసహితం = సర్వాత్మత్వ = సర్వాత్మభావమునే;మహావిభూతి=అణి మాద్యైశ్వర్యముకంటే గొప్ప ఐశ్వర్యముతో; సహితం=కూడిన; ఈశ్వ రత్వం= సత్యజ్ఞానానందరూపమైన పరమాత్మభావము; తత్ = ఆ శ్రుతుల యందు ప్రసిద్ధమైనపరమాత్మభావము; స్వతః = సిద్ధమయినదే; స్యాత్= అగును అనగా పరమాత్మభావము సిద్ధమేగాని ప్రయత్న సాధ్యముకాదు. ప్రయత్న సాధ్యమయ్యే యెడల అనిత్యమగునని యర్థము; పునః=తిరిగి; అష్టధా = ఎనిమిదివిధములుగా; పరిణతం = మాయాపరిణామమయిన; ఐశ్వర్యం = అణిమాద్యైశ్వరము; అవ్యాహతం=అడ్డులేనిదై; సిద్ధ్యేత్= సిద్ధించును:

### తాత్పర్య వివరణము.

సకలవేదాంత సిద్ధాంతమంతయు, ఈ దక్షిణామూర్తి స్తోత్రమందుం డుటచేత ఈ దక్షిణామూర్తిస్తోత్రమును గురువులవద్ద బాగుగా శ్రవణం చేసి, మననంచేసి శ్రవణమననములతో, నేను పరమాత్మనుకాననే అసం భావనను, నేను జీవుడననే విపరీతభావనను పోగొట్టుకొని తరువాత నిశ్చిత మగు పరమాత్మతత్వమును ధ్యానంచేసి, ఆత్మసాక్షాత్కారమునుపొందిన వారికి, అజ్ఞానముపోయి సచ్చిదానందరూపమగు పరమాత్మస్థితియనే

మోక్షము లభించును. ఇట్టి మోక్షమే మహావిభూతి యనబడును. ఇట్టి పరమాత్మ భావము జీవునికి సిద్ధించియేయున్నది గనుక ప్రయత్నసాధ్యము కాదు. సాలోక్యముక్తియు, సామీప్యముక్తియు, సారూప్యముక్తియు సాయుజ్యముక్తియు, ఉపాసనచేతను, కర్మచేతను సాధించతగినవి. గాని సిద్ధించియున్నవికావు.పరమాత్మస్వరూపమనే మోక్షముమాత్రంసిద్ధించియే యున్నది. ఎందువలననగా ఆత్మస్వరూపమే గనుక.

ఆత్మను సంపాదించనవసరములేదుకదా! ఒక ప్రశ్న. మోక్షమనగా అవస్థాత్రయాతీతమగు ఆత్మయేకదా. అట్టి ఆత్మసిద్ధించి మన స్వరూపముగానేయున్నదికదా. అయితే అఖండానందరూపమగు మోక్షము మనకెందుకు గోచరించడంలేదు. అంటే అజ్ఞానం. ఆ స్వరూపానందమును ఆవరించి మనకు గోచరించకుండా చేసింది. అయితే ఆ మోక్షము ఎంత దూరములోనున్నది అంటే ఆత్మస్వరూపమే మోక్షమని చెప్పితిమికదా. ఆత్మకంటే దగ్గరిదిలేదుకదా. అయితే ఎంతోదూరముగానున్నట్లు లభించనట్లు దేనినైనా సంపాదింపవచ్చును గాని మోక్షమును సంపాదించుట చాలాకష్టమని, దేనినైనా పోగొట్టుకొనవచ్చునుగాని, జన్మమరణ సంసార బంధమును పోగొట్టుకొనుట చాలా అసాధ్యమని, చాలా బాధపడుచున్నామే అంటే అజ్ఞానంకంటే దగ్గర ఉన్నదానినికూడా దూరంచేసేది మరియొకటి లేదు. అజ్ఞానంకంటే ఉన్నదానిని లేనట్లుచేసేది మరొకటిలేదు. ఇదియే కాదు.అజ్ఞానంకంటేఉన్నదానిని లేన్నట్లు చేయుటయేగాక ఎక్కడనోనున్నదని దానిని సంపాదించుటకు వెతికించేది. తిప్పేది బాధపెట్టెది మరియొకటి లేదు. అజ్ఞానప్రభావమునుగురించి లోకదృష్టాంతమును చూడండి.

ఒక పిల్లకు వివాహంచేయవలెనని వరనిశ్చయంకొరకు గృహస్థు వెతుకుచున్నాడు. అనేక ప్రాంతములు వెతికాడు. ఎక్కడను నిశ్చయం కాలేదు. ఎక్కడఅగునో తెలియదు. కాని పెళ్ళికొడుకు ఆ గ్రామము

లోనే దగ్గరనే యున్నాడు. విధి పిల్లకు భర్తను నిర్ణయించియే యున్నది. కాని తెలియదు అనగా అజ్ఞానమేకదా! ఈ తిరుగుటకు కారణం. సర్వత్ర ఇట్టి అజ్ఞానం తాండవిస్తున్నదికదా! అనేక ప్రయోజనములను సాధించుటకు అనేక ఉపాయములను సాధించి ప్రయత్నిస్తాము. కాని ఎట్లు సిద్ధించునో యెపుడు సిద్ధించునో తెలియదు. అనగా అజ్ఞానమే యెంతపని అయినా చేయించకలదు. మనం ఏ జన్మలోనుండి ఈ జన్మకు వచ్చినది ముందు యచటికివెళ్ళేది యెంత పాపమున్నది? యెంతపుణ్యమున్నది? తెలియదు ఎపుడు మరణము కలుగునో తెలియదు. యేదిచేస్తే మేలు కలుగునో, యేదిచేస్తే కీడు కలుగునో తెలియదు. ఇదంతయు అజ్ఞానము వలననే జరుగుచున్నది.

సరే, మోక్షము ఆత్మస్వరూపమై సిద్ధించియే యున్నదిగనుక ఆ మోక్షప్రాప్తికి ప్రయత్నమెందుకు? నిజమే ప్రాప్తమయియే యున్నది. అజ్ఞానం అడ్డమున్నది. అడ్డముగానున్న అజ్ఞానమును పోగొట్టుకొనుటకే ఈ ప్రయత్నమంతా. అయితే అజ్ఞానమును పోగొట్టుటకు జ్ఞానమే కావలయును కదా. అంటే నిజమే జ్ఞానంచేత అజ్ఞానమును పోగొట్టుకున్న యెడల తరువాత చేయవలసినదేమియు లేదు. సరేకాని, ఆత్మస్వరూపమైన మోక్షమును పొందడమేమిటి? అంటే వినండి, పొందడం రెండు విధములు, పొందిన దానిని పొందడం, పొందని దానిని పొందడం, పొందిన దానిని పొందడంలో జ్ఞానమే కారణం. పొందనిదానిని పొందడంలో కర్మ కారణం. ఎటులననగా తన కంఠంలో ఒక మాలయున్నది. ఆ మాలపోయినదని భ్రమపడ్డాడు. వెతకడం మొదలుపెట్టెను. చాలా చోట్ల వెతికాడు. దొరకలేదు చాలామంది యందు అనుమానించి అడిగెను కాని లభించలేదు, తిరిగాడు, అనేక ప్రయత్నములు చేసెను, గాని దొరకలేదు. ఇంతలో ఒకరువచ్చి చూచి ఎందుకు తిరుగుతావు! నీకంఠంలోనే

మాల ఉన్నది కదాయని చెప్పెను అంతట చూచుకున్నాడు, కనిపించింది. కొందవు దొరికినదాయని అడుగగా దొరికినదన్నాడు.

మాలనుపొందియే యున్నాడు. పోయినదని భ్రమకలిగినదేకాని పోలేదు, తన కంఠంలోనున్న మాలను పొందుటకు జ్ఞానమే సాధనమై నదిగాని, వెతుకుట, తిరుగుట, ఇతరులను అడుగుట మొదలగు కర్మలవలన లభించలేదు. ఇదియే ప్రాప్తప్రాప్తి ఇటులనే జీవునికి అసలు స్వరూపం పరమాత్మయే అయియున్నది. అజ్ఞానంచేత ఆత్మను తెలుసుకొనలేక జీవుడనని భ్రమపడ్డాడు. నాయనా! నీవు జీవుడవు కావు పరమాత్మవేనని శాస్త్రం చెప్పినది. నేనే పరమాత్మనని తెలుసుకున్నాడు. ఈ ఆత్మజ్ఞానము చేతనే పొందిన ఆత్మను పొందెను. గనుక పొందిన దానిని పొందుటలో జ్ఞానమే కారణం, జ్ఞానంచేత అజ్ఞానం పోవుటయే మోక్షమని చెప్ప వచ్చును. జీవత్వ భ్రమపోవుటయే పరబ్రహ్మ ప్రాప్తియని. దీనినే ప్రాప్తప్రాప్తి అనగా పొందిన పరమాత్మను జ్ఞానంతో పొందుట యని అంటాను.

పొందని దానిని పొందుటలో కర్మకారణముకదా. ఎటులననగా ఒక గ్రామంలో నున్న వ్యక్తి మరియొక గ్రామమును పొందవలయునంటే వెళ్ళుట అనే కర్మయే కారణం. స్వర్గాది లోకములు ఈ లోకమందున్న మనకు దూరమందుండుటచే అప్రాప్తములైయున్నవి కనుక, అప్రాప్తము లైన స్వర్గాదిలోకములను పొందుటకు కూడ కర్మయే కారణం. ఒక ప్రశ్న. ప్రపంచమంతయు ఎక్కడ ఉన్నది? అంటే పరమాత్మయే ప్రపంచారోపమునకు అధిష్ఠానము గనుక ప్రపంచమంతయు పరమాత్మ యందే యున్నదియని చెప్పవలయును. అయితే స్వర్గలోకంగాని, బ్రహ్మ లోకంగాని, కైలాసంగాని, వైకుంఠంగాని ఇలాంటిమహాలోకములు ఎక్కడ యున్నవి? అంటే ఇంకా సందేహమెందుకు? అద్వైత సిద్ధాంతంలో సచ్చి

దానంద రూపమగు పరమాత్మయందే జీవత్వం, ఈశ్వరత్వం, సకలదృశ్యములు ఆరోపితములైనపుడు బ్రహ్మాది సర్వలోకములు దృశ్యమగు ఆరోపములో చేరినవే గనుక అధిష్ఠానము పరమాత్మయందే యున్నవని చెప్పవలయును.

అయితే ఆ పరమాత్మ జీవునికి నిజమైన స్వరూపమే గనుక మనయందే ప్రపంచమంతా ఉన్నదని గ్రహించవచ్చును. అయితే ప్రపంచమంతయు మనయందే ఉన్నయడల అంతయు మనకు ప్రాప్తమే గనుక అప్రాప్తమేమిటి! అప్రాప్త ప్రాప్తియేమిటి అంటే నిజమే, మనం పరమాత్మ స్వరూపుల మనుకున్నపుడు ఆరోపమంతయు మనయందే యుండును. గనుక, అంతయు మనకు ప్రాప్తమే గనుక, మనయందు లేనిది లేదు. మనకంటే వేరులేదని కూడా చెప్పవచ్చును. పరమాత్మను తెలిసికొనక జీవుల మనుకున్నపుడు. ఆరోపితమగు ఉపాధిని బట్టి తయారయిన జీవభావంలో ప్రపంచం ప్రాప్తంకాదు. అధిష్ఠానమందే ఆరోపమంతయు ఉండును గాని, ఒక ఆరోపమందు అన్ని యారోపములు ఉండవు. అన్ని యారోపములు. అందులో ఒక ఆరోప స్వరూపములు కావు. అన్ని యారోపములు అధిష్ఠానమే పరమార్థం గాని, అందులో ఒక ఆరోపం అన్నిటికిని పరమార్థం కాదు.

శుక్తియందు రజతమని, రంగమని అనగా తగరమని భ్రాంతి కలిగినది. అక్కడ అధిష్ఠానం శుక్తియే. ఆరోపములు వెండి, తగరం, ఈరెండు ఇందులో తరగమునకు వెండిగాని, వెండికి తగరంగాని పరమార్థం కావు. ఆరోపములగు, వెండి తరగములకు అధిష్ఠానమగు శుక్తియే పరమార్థం, అనగా నిజస్వరూపం. అటులనే పరమాత్మ యందే జీవత్వం, ప్రపంచమంతయు కల్పితమైనది. గనుక జీవుడుకూడా కల్పితుడనియే చెప్పవలయును. అటులైన యడల జీవునికి ప్రపంచం గాని,

ప్రపంచమునకు జీవుడుగాని పరమార్థములుకావు. ప్రపంచమునకు జీవునికి పరమార్థము అధిష్ఠానమగు పరమాత్మయే, గనుకనే పరమాత్మయందే యున్నవి. పరమాత్మకంటే వేరు కాదనియు చెప్పెదరు.

గనుక జీవభావమున్నంతవరకు అనగా నేను జీవుడనను భ్రమ ఉన్నంతవరకు బ్రహ్మాదిలోకములు అప్రాప్తములే గనుక ఆ లోకములను పొందుట అప్రాప్తప్రాప్తియే. ఆ లోకప్రాప్తికి కర్మయే కారణం, అనగా. ఒక గ్రామమునుండి మరియొక గ్రామమును గమనముతో పొందినట్లు ఈ లోకమునుండి బ్రహ్మాదిలోకములను ఒక మార్గమును అనుసరించి ప్రయాణంచేసి పొందవలసినదే. అందువలననే బ్రహ్మలోకమును పొందుటకు అర్చిరాదిదామార్గమని, స్వర్గలోకమును పొందుటకు ధూమాధిమార్గమని శ్రుతులు చెప్పుచున్నవి. అయితే. అజ్ఞాన దశయందు జీవునకు కూడా పరమాత్మ అప్రాప్తమే కదా. అట్లయిన లోకాంతర ప్రాప్తివలె బ్రహ్మప్రాప్తికూడా అప్రాప్తప్రాప్తి యేలకాదు ? అంటే ఏవస్తువునకూ స్వరూపము అప్రాప్తము ఎప్పుడూ కాదు. ప్రాప్తమే అయియుండును. జీవునకు అజ్ఞానమున్నను పరమాత్మ పరమార్థ స్వరూపమే గనుక అప్రాప్తము ఎప్పుడూ కాదు. నిత్యప్రాప్తమైనదే, గనుక జీవునికి పరమాత్మ ప్రాప్తి. ప్రాప్తప్రాప్తియే గాని లోకాంతర ప్రాప్తివలె అప్రాప్త ప్రాప్తి ఎప్పుడూ కాదని గ్రహించవలసిన విషయము.

అయితే అజ్ఞానం ఎక్కడ నున్నది. అంటే అన్ని ఆరోపములు అధిష్ఠానమందున్నట్లు అజ్ఞానంకూడా ఆరోపమే గనుక అజ్ఞానం కూడా అధిష్ఠానమగు పరమాత్మయందే యుండును. పరమాత్మకంటే వేరుకాదు పరమాత్మయందే ఉండునని పరమాత్మ కంటే వేరులేదని అంటే ఏమిటి ? అంటే అధిష్ఠానము లేనిది అనగా ఒక సత్యవస్తువు లేనిది భ్రమకలుగదు గనుక భ్రాంతి దృష్టితో చూస్తే ప్రపంచం ఉన్నట్లే

భావించుచున్నాము గనుక. ఈ ప్రపంచం అధిష్ఠానమందే ఆధారపడి యున్నదని చెప్పవలయును. శంకర భగవత్పాదులవారు ఈస్తోత్రంలోనే. శ్లో॥ విశ్వం దర్పణ దృశ్యమాన నగరీతుల్యం, నిజాంతర్గతం అని చెప్పిరి.

నిజాంతర్గతం అని చెప్పినందువలన అద్దంలో ప్రతిబింబించిన నగరం కనిపించినట్లు, ఉన్నట్లు ఆత్మయందే ప్రపంచమంతా ఉన్నదని అనగా భాసించుచున్నదని యర్థము, పరమార్థముగా విచారిస్తే, అధిష్ఠానమగు పరమాత్మకంటే ఆరోపమగు ప్రపంచం వేరేలేదని చెప్పవలయును.

ఒకప్రశ్న. ఆరోపమనగా భ్రమకదా! సర్వప్రపంచ భ్రమకు, అజ్ఞానం కారణం గనుక, అజ్ఞానంవల్ల ప్రపంచ భ్రమ కలుగవచ్చును. గాని అజ్ఞానంకూడా ఆరోపమేగనుక అజ్ఞానారోపమునకు కారణ మేమున్నది? మరియొక అజ్ఞానం లేదుకదా. అట్లున్నదన్నను. దానికి మరియొక అజ్ఞానం కారణం. దానికి మరియొక అజ్ఞానం కారణం అని చెప్పిన అనవస్థాదోషం వచ్చును (అనగా తెంపులేని కల్పన). అజ్ఞానారోపమునకు పరమాత్మయే కారణమంటే, మోక్షదశయందుకూడా కారణమగు పరమాత్మ ఉన్నదిగనుక అజ్ఞానారోపం కలుగవలయును. ఆ యజ్ఞానంవలన ప్రపంచభ్రమ కలుగవలసివచ్చును. అటులైన మోక్షమనేదే లేకపోవలసి వచ్చును. అంటే ఒకప్పుడు పుడుతుందంటే దానికి కారణమేమని అడుగవచ్చును చెప్పవచ్చునుగాని, అజ్ఞానం అనాది. దానికి ఉత్పత్తియే లేదంటే మీరు అజ్ఞానానికి కారణమేమని అడగడమేమిటి? అజ్ఞానం అనాది అన్నపుడు కారణం ఏమని అడుగకూడదు. చెప్ప నవసరంలేదుకూడా. అయితే అనాదియగు అజ్ఞానం ఆరోపం ఎట్లాఅయినది అంటే. అనాదియని అనుకొనుటయే అనాద్యారోపము. సాది అనగా ఉత్పత్తికలది యని అనుకొనుటయే కార్యారోపము అని గ్రహించవలెను.

అందువలననే శంకరభగవత్పాదులవారు "విశ్వం పశ్యతి కార్య కారణ తయా" అన్నారు. కార్యంవలె, కారణంవలె అనగా సాదివలె, అనాదివలె అనేకవిధములుగా మాయాపరిభ్రామితుడై చూచుచున్నాడని చెప్పవలయును. అనగా కార్యకారణాది రూపముగా ఆత్మయే భాసించు చున్నదని యర్థము ఒక ప్రశ్న. చాలా ఆశ్చర్యకరముగా నున్నది. కల్పితములై చాలా దూరముగానున్న స్వర్గాదిలోకములను పుణ్యకర్మలుచేసి పొందుటయే సులభముగా నున్నది. కాని చాలా దగ్గరగానున్న ఆత్మ స్వరూపమును పొందుట, తెలుసుకొనుట చాలా కష్టముగానున్నదే? వేదాంత శాస్త్రంలో తన స్వరూపాన్ని తెలుసుకోవడమేకదా ప్రధానం.

తన స్వరూపాన్ని తను తెలుసుకొనుటకు ఇంత శాస్త్రం, గురువులవల్ల శ్రవణంచేయుటం, మననం చేయుట, నిదిధ్యాసనం చేయుట ఇంత ప్రయత్నం కావలయునా అంటే తాడుయందు సర్పమని భ్రాంతి కలిగితే నాయనా! భయపడకు. ఇది తాడేగాని సర్పముకాదని చూపిస్తే వెంటనే తాడునుచూచి పాము అనే భ్రమను, భయమును వదలి స్వస్థచిత్తుదగుచున్నాడు కాని, నాయనా! నీవు పరమాత్మవేగాని జీవుడవుకాదనిశాస్త్రమును శిష్యునకు గురువు ఎంత బోధించినను తెలియుటలేదు. ఒకమాటు నీవు పరమాత్మ స్వరూపుడవని చెప్పినమాత్రంతో తెలుసుకోగలిగిన అనేక పర్యాయములు శ్రవణాదులుచేయుట మొదలగు శ్రమ అనవసరమే కాని, ఎంతకాలం తత్వ విచారం చేసినను ఆత్మసాక్షాత్కారం కలుగుటలేదు.

ఎక్కడ యున్నది ప్రతిబంధకం అంటే, అజ్ఞానము అంతబల మైనది. ఆవరణశక్తి చాలా గట్టిది. ఇదియేగాక ఇంద్రియములకుగాని, మనస్సునకుగాని. పరాగ్వస్తువులను అనగా ఆత్మకంటే భిన్నమైన భూత భౌతిక పదార్థములను తెలుసుకునే అలవాటున్నది, శక్తియున్నదిగాని ప్రత్యగ్రూపమును అనగా ఆత్మను తెలుసుకునే అలవాటు లేదు, శక్తియు

లేదు. అందుచేత పరమాత్మను ఎవ్వరును త్వరగా తెలుసుకొనలేక పోతు న్నారు. అందువలన కర్మకంటే జ్ఞానం కష్టం. స్వరూపమును తెలుసు కొనుట చాలా కష్టమని గ్రహించవలెను. ప్రతినిత్యము విశేషస్వరూపమగు జాగ్రత్ప్రపంచమును, స్వప్నప్రపంచమును దాటి అనగా జాగ్రదవస్థను, స్వప్నావస్థను దాటి, సుషుప్త్యవస్థలోకి పోతున్నాడు. అదియే ఆనంద మయ కోశం ఆ సమయంలో అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయములనే నాలుగుకోశములనుదాటి ఆనందమయకోశములోనికి పోతున్నాడు. సుషుప్త్యవస్థ ఆనందమయ కోశమునకు చెందినది గనుకనే, సుషుప్త్యవస్థయందు అందరికి చాలా ఆనందం, అట్టి ఆనందమయకోశం దాటితే స్వప్రకాశానంద రూపమగు బ్రహ్మయే తను అగును.

ఆ సుషుప్తిదశయందు స్థూల, సూక్ష్మశరీరములు రెండు అణగి పోయినవి. అజ్ఞానమనే కారణదేహంలోనే యున్నాడు అపుడు. బ్రహ్మా నందమునకు అజ్ఞానావరణయే అడ్డం. కాని ఆ సమయంలో ఆ కాస్తఅజ్ఞా నావరణను దాటితే, పరబ్రహ్మస్వరూపమును పొందవచ్చును. కాని పొంద లేకున్నారు. ఈ విషయమునే ఉపనిషత్తు ప్రతిరోజు పరమాత్మదాకా దాదాపు ఆనందమయ కోశంలోకి వెళ్ళుచున్నారు. అందరుజీవులు. అందులో ఒక జీవుడైనను నిత్యస్వప్రకాశానంద స్వరూపమగు ఆత్మను తెలుసుకొన లేకుండా ఉన్నాడే. ఎవ్వరు తెలుసుకొనుటలేదు. ఆ యావరణశక్తి త్రోవ ఇవ్వక కార్యభ్రమ రూపముగానున్న స్వప్న జాగ్రత్ప్రపంచ భ్రమలోనికి అందరుజీవులను తోసివేయుచున్నది. ఆ తోసివేయుటలోకూడా మనుష్య శరీరంనుండి వచ్చినజీవుని మనుష్యశరీరంలోకి, పశు, పక్షి, మృగాది శరీరములనుండి వచ్చిన జీవులను పొరపాటులేకుండా వారివారి శరీరముల లోనికే తోసివేయుచున్నది యనే అర్థమును ఆశ్చర్యముగా బోధించినది.

అయితే అజ్ఞానం చాలా బలమైనది. యెంత శక్తికలది ? ఆత్మను

ఆవరించి జీవునిగా తయారుచేసి లేని ప్రపంచమును చూపించి సత్యమని పించిందే. అంటే సందేహం లేదు. అజ్ఞానం అంత బలమైనదే. ఈ విష యంలో సంక్షేపశారీరకంలో సర్వజ్ఞముని చెప్పెను.

శ్లో॥ ఏకశ్శత్రు ర్నద్వితీయోఽ స్తిశత్రు రజ్ఞానతుల్యః
పురుషస్య రాజన్।
యేనావృతః కురుతే సంప్రమత్తో ఘోరాణి కర్మాణి
సుదారుణాని॥

నాయనా జీవునికి ఒక మహాశత్రువు ఉన్నాడు. ఎవడనగా అజ్ఞాన మనే శత్రువే. అట్టి అజ్ఞానమనే శత్రువుతో సమానమైన శత్రువు మరి యొకడు లేడు ఎందుచేతనంటే సచ్చిదానందరూపుడు. అజ్ఞానమనే శత్రువుతో, నావరింపబడినవాడై స్వరూపమును మరచి జీవుడ నసే భ్రాంతినిపొంది అహంకార మమకారములు కలవాడై చేయతగినది ఏమి చేయకూడనిది ఏమియని తెలిసికొనలేక ఈ లోకమందు భయంకరమైన పనులను, పరలోకమందు నరకమునుకలుగజేయు పాపకృత్యములనుకూడా చేయుచున్నాడు. ఇదంతయు అజ్ఞానప్రభావమే. అందువలన దూరముగా నున్న పుణ్యలోకములను పుణ్యకర్మలుచేసి పొందుట సులభంగాని, బాగుగా సమీపమైన తన స్వరూపమును తెలిసికొని అజ్ఞానమును పోగొట్టుకొనుట చాలాకష్టము. కర్మ ప్రతిబంధమును పోగొట్టుకొనుటకంటే అజ్ఞాన ప్రతి బంధమును పోగొట్టుకొనుట చాలా కష్టమని గ్రహించవలయును.

శ్లోకంలో విశేషం విచారింతము "సర్వాత్మ త్వమితి స్ఫుటీకృత మిదం యస్మా దముష్మిం స్తవే" అని భగవత్పాదులవారు ఈ స్తోత్రంలో సర్వాత్మత్వం స్పష్టపరచబడినదని చెప్పిరి. జ్ఞానికి సర్వాత్మ భావమేర్ప

డును జీవన్ముక్తి దశలోకూడా ప్రపంచమంతయు బ్రహ్మవేత్తకు ఆత్మగానే భాసించును. బ్రహ్మవేత్తస్థితి చాలా ఆశ్చర్యమైనస్థితి. అందుచేతనే అర్జునుడు బ్రహ్మవేత్త, అద్వైతస్థితిని ఆశ్చర్యముగా గ్రహించి–

శ్లో॥ స్థిత, ప్రజ్ఞస్య కాభాషా సమాధిస్థస్య కేశవ,
స్థితధీః కిం ప్రభాషేత కిమాసీత వ్రజేతకిం॥

అని కృష్ణపరమాత్మను అడిగెను.

స్థితప్రజ్ఞుడు అనగా పరమాత్మానుభూతికల మహానుభావుడు ఎట్లా మాట్లాడును? కూర్చుండునా, నిలుచునా, వెళ్ళునా, ఏపనియైనా చేయునా? ఆయనస్థితి ఎట్లా ఉండును? అని అర్జునుడు అడిగినాడంటే, నిజమే సర్వ ప్రపంచమంతయు ఆత్మయందు లయించి ఆత్మయే అయి ఆత్మయే మిగిలినపుడు దేహేంద్రియములు మనస్సు ఏమీ లేనపుడు ఆత్మస్వరూపం ఎట్లుండునని ఆశ్చర్యపడుచూ గుర్తించవలసిన విషయమే.

శంకర భగవత్పాదులవారు సర్వాత్మత్వమును స్వాత్మ ప్రకాశిక యందు ఇట్లు చెప్పిరి:

శ్లో॥ చి దేవ దేహస్తు, చిదేవ లోకాః చిదేవ భూతాని.
చిదింద్రియాణి,
కర్తా చిదంతఃకరణం, చిదేవ, చిదేవ సత్యం, పరమార్థ
రూపం॥

చిదేవ చైతన్యమే అని యర్థము. చైతన్యమనగా ఆత్మయే. దేహము చైతన్యమే, లోకములు చైతన్యమే, భూతములు చైతన్యమే, ఇంద్రియములు చైతన్యమే. కర్త అయిన జీవుడు చైతన్యస్వరూపుడే.

అంతఃకరణ చైతన్యస్వరూపమే. అంతయు చైతన్యస్వరూపమంటే చైతన్యమే నానాత్వములేనిది. అన్నిటికిని పరమార్థస్వరూపమని తాత్పర్యము.

ఒక ప్రశ్న. అద్వైత సిద్ధాన్తంలో అంతా పరమాత్మ స్వరూపమే నని చెప్పుచున్నారు. కనిపించే ప్రపంచం ఏ ప్రమాణము చేతనైనా తెలియబడే దృశ్యములు ఏమియులేవు. అంతయు మాయామయమే. మిధ్యాభూతమని కనిపించని అనగా ప్రమాణమునకు గోచరించని బ్రహ్మయేసత్యమని యంటారు. ఇది అనుభవమునకు చాలా విరుద్ధముగానున్నది. కనిపించేది లేదు. కనిపించనిది యున్నది అని చెప్పటనుబట్టియే కొందరు అద్వైత మతం ప్రచ్ఛన్న బౌద్ధమతమన్నారు, బౌద్ధులు అంతా శూన్యమన్నారు.

అద్వైతులు దృశ్యమేమిలేదు. దృశ్యముకానిది ఒక ఆత్మ యున్నది అన్నారు. దృశ్యంకానిది అనగా తెలియబడనిది ఉన్నదని చెప్ప కూడదు. ప్రమాణములతో తెలియబడిన దృశ్యము. ఏమీలేదంటున్నారు. ప్రమాణములచేత తెలియబడనిది ఎట్లాగూ లేనిదానికిందనే జమ. అట్లయిన అంతా శూన్యమనియే చెప్పినట్లగును. అది బౌద్ధమతంగానే గ్రహించవచ్చును. కాని అద్వైతులు దృశ్యప్రపంచం ఏమీలేదు. అని, అంతా శూన్యమేనని యనకుండా దాచి, దృశ్యం కానిది ఒకటి యున్నదని, దృశ్యంలేదని (అనగా శూన్యమన్నట్లె) చెప్పుచున్నారు గనుక, అద్వైతులు ప్రచ్ఛన్న బౌద్ధులని, అద్వైత సిద్ధాన్తరహస్యం తెలియక అద్వైత మతమును ద్వేషించు కొందరు ద్వైతులు ఆక్షేపించుదురు.

ఈ విషయంలో సావధానంగా, సావకాశంగా, సమాధానం వినవలయును. ఏమంటే దృశ్యమనగా దృక్కుచేత తెలియబడేది యని అర్థము. మరియొక విధంగా చూడండి. దృశ్యమనగానే దృశ్యమును జూచేవాడొకడున్నట్లేకదా. కనిపిస్తున్నదంటే కనిపింపచేసేది ఉన్నట్లేకదా! కనిపింప

చేసేదికూడా కనిపించవలయునని నియమం లేదు. తెలియచేసేది కూడా తెలియబడవలెనని నియమం లేదు. తెలియ చేయునది తెలియబడనంత మాత్రంతో కనిపింపచేసేది కనిపించనంతమాత్రంతోను, తెలియచేయునది కనిపింపచేయునది లేదని చెప్పుటకు వీలులేదు. ఎందుచేతనంటే తెలియ చేయునది గనుకనే, చూచేది గనుకనే.

ఎటులననగా నేత్రేంద్రియముతో అనేక వస్తువులను రూపములను చూచుచున్నాము. నేత్రమున్నందువలననే అన్నియు కనిపించుచున్నవి కదా! నేత్రేంద్రియం లేకపోతే రూపాదులు కనిపించవుకదా! రూపాదులు నేత్రములున్నవారికే కనిపించునుగాని, నేత్రములు లేనివారికి కనిపించవని సర్వులకు అనుభవసిద్ధమైన విషయమేకదా! అయితే, అన్ని రూపాదులను కనిపింపచేసే నేత్రేంద్రియం మనకు కనిపించుచున్నదా? కనుపించుట లేదు. అయితే కన్నుగుడ్లు కనిపించుచున్నవికదా. అంటే ఆ గుడ్లు గుడ్డి వాళ్ళకుకూడా ఉంటవి. అవి నేత్రేంద్రియం అనుటకు వీలులేదు. గుడ్లే నేత్రేంద్రియమయితే గుడ్డివాళ్ళకు కూడా మంచివాళ్ళకువలె అన్నియు కని పించవలసివచ్చును. కాని కనిపించుటలేదు. గనుక ఆ గుడ్లు చక్షు రింద్రియ ముండుటకు స్థానం–గోళకమనికూడా అంటారు. అందుచేత ఆ గోళకములు నేత్రేంద్రియములుకాదు. ఆ గోళకములయందు అతి సూక్ష్మమైన ఒక చక్షురింద్రియ మున్నది.

ఆ ఇంద్రియము అపంచీకృత భూతకార్యముగనుక, తనకుగాని ఇతరులకుగాని యంత్రసాధనలతో చూచినను కనిపించదనియే శాస్త్రకర్తల సిద్ధాంతం. ఆధునిక భౌతికవిమర్శకులగు వైద్యులుకొందరు నేత్రేంద్రియం సూక్ష్మమయినను యంత్రసాధనలతో కనిపించునని చెప్పెదరేమోగాని, ఆ కనిపించునది నేత్రేంద్రియమునకు ఆధారమైన గోళకమందలి సూక్ష్మ

భాగమేకాని, నేత్రేంద్రియం దృశ్యం కాదనియే ప్రాచీన శాస్త్ర సిద్ధాంతం గనుక నేత్రేంద్రియం రూపాదులను చూపించేదేగాని, అది కనిపించదని తేలినది. అయితే చక్షురింద్రియంలేదని చెప్పవచ్చునాఅంటే చెప్పకూడదు. నేత్రేంద్రియంలేకపోతె రూపాదులు ఎట్లా కనిపించును. గనుక నేత్రేంద్రియం కనిపించకపోయినను రూపాదులను రుజువుచేయుచున్నది గనుక, ఉన్నటుల రుజువైనట్లె అనగా కనిపించకపోయినను కనిపింపచేయుచున్నది గనుక నేత్రేంద్రియమున్నదనియే చెప్పవలయునుగాని, లేదని చెప్పుటకు వీలులేదు.

అటులనే మనలో ఒక చైతన్యమున్నది. ఆ చైతన్యము అన్నిటిని తెలుసుకొనుచున్నది, అనగా అన్నిటిని తెలియచేయుచున్నది. జాగ్రదవస్థను, స్వప్నావస్థను సుషుప్త్యవస్థను, జ్ఞానమును, అజ్ఞానమును తెలుసునని, తెలియలేదని, ఉన్నదని, లేదని అన్నిటినీ తెలియచేయుచునే యున్నది కాని తెలియబడుటలేదు. అది తెలియబడేవాటిలో చేరదు. వేరుగానున్నది. నిజముగా దానికంటె వేరయినదేమియులేదు. తెలియబడనంతమాత్రంతో లేదనిచెప్పుటకు వీలులేదు. తెలియచేసే చైతన్యమేలేకపోతే ప్రపంచం తెలియబడక పోవలసివచ్చును. శ్రుతికూడా బ్రహ్మను లేనటుల ఎవరు అనుకొందురో ఆ అనుకున్నవారు, లేనివారగుదురని చెప్పుచున్నది. ఎందువలననంటే తను బ్రహ్మయే గనుక బ్రహ్మ లేదనుకుంటే తన్నుతాను లేననుకున్నట్లగును. శంకర భగవత్పాదులవారు "ఆత్మాచ బ్రహ్మ"యనిరి. అనగా ఆత్మయే బ్రహ్మయని యర్థము. అట్టి ఆత్మజ్ఞానరూపమై మనలోనున్నది. అదియే చైతన్యం, అట్టి చైతన్యం, ప్రమాణములను ప్రమేయములను ప్రమాతను అనగా తెలియబడే శబ్దాది విషయములను తెలియజేసే ఇంద్రియములు మొదలగు ప్రమాణములను తెలుసుకునే జీవులనుకూడా తెలియచేయుచున్నది.

భగవద్గీతలోకూడా భగవంతుడు "నతద్భాసయతే సూర్యో నశశాంకోన పావకః యద్గత్వాన నివర్తన్తే! తద్ధామ పరమంమమ" అని ఆ పరమాత్మతత్వమును సూర్యుడు ప్రకాశింపచేయలేడు. చంద్రుడు ప్రకాశింపచేయలేడు. అగ్ని ప్రకాశింపచేయలేదు. అనగా దీపము మొదలగునవి కూడా ప్రకాశింప చేయలేవన్నమాటే. "యద్గత్వాన నివర్తన్తే తద్ధామ పరమంమమ!" అనగా దేనిని పొందినవారికి పునరావృత్తి అనగా పునర్జన్మ లేదో ఆ స్వరూపమే నాదియని చెప్పెను. దేనిచేతను తెలియ బడనిదియే పరమాత్మ స్వరూపమని చెప్పినట్లయినది.

అన్నిటిని ప్రకాశింపజేయుచు స్వయంప్రకాశమానమై జ్ఞానరూపమై మన కాత్మరూపమైయున్న పరమాత్మ తెలియబడుటలేదు గనుక, లేదని చెప్పినట్లేనని కల్పించి ప్రచ్ఛన్న బౌద్ధమనియనుట చాలా అవివేకము.

భ్రమదశలో రజతం తెలియబడినది శుక్తి తెలియబడుటలేదు. అంతమాత్రంతో రజతమున్నది సత్యమని, శుక్తిలేదని చెప్పకూడదు. తాడుయందు సర్పభ్రమకలిగితే గోచరించేది సర్పమే, అసలు తాడు గోచరించుటలేదు గనుక సర్పమే సత్యము. తాడు అసత్యమని చెప్ప కూడదు. అటులనే ప్రపంచం కనిపించుచున్నది గనుక సత్యమని, ఆత్మ కనిపించడంలేదు గనుక అసత్యమని చెప్పకూడదు, పైగా రజతం కనిపించుచున్నది గనుకనే అసత్యం అనగా మిథ్యా కనిపించనిశుక్తియే సత్యం అనవలయును. ఎందుచేతనంటే, శుక్తియని తెలిస్తే రజతం అదృశ్యమై పోతున్నది శుక్తియే మిగులుచున్నదికదా! అటులనే ఆత్మ సాక్షాత్కారం కలిగితే ప్రపంచం అదృశ్యమై ఆత్మ యే మిగులును, గనుక ప్రపంచం అసత్యం, అనగా మిథ్యా, బ్రహ్మయే సత్యమని తెలుసు కొనవలయును.

మరియు అద్వైతులు ప్రపంచమును లేదనరు. ఇది పరమాత్మయే అంటారు. అనగా పరమాత్మకంటే వేరుకాదని యర్థము. కొన్నిచోట్ల ప్రపంచంలేదని చెప్పియున్నను, పరమాత్మకంటే వేరుగాలేదని యర్థము. అందువలననే అద్వైతులు బ్రహ్మసత్యం, జగన్మిథ్యయని అంటారు. అంతేగాని బ్రహ్మసత్యం, జగదసత్యం అనరు. మిధ్యయనగా అసలు వస్తువుతెలిస్తే కనిపించకుండాపొయ్యేదే ! ఆత్మజ్ఞానంకలుగగానే ఆరోప ప్రపంచము అదృశ్యమగును. గనుక మిథ్యాభూతమని ముఖ్యముగా గమనించవలయును. ఆత్మయే సత్యమై మిగులును, గనుక లేనిది ఎప్పుడు కాదు. ఈ విషయములను ఈ పుస్తకములోని శంకరాచార్య అద్వైత స్తోత్ర తాత్పర్య వివరణములలో ఆయాశ్లోకములక్రింద రెండు మూడు పర్యాయములు వివరించితిని.

చివరశ్లోకంలో సర్వాత్మత్వమితిస్ఫుటికృత మిదం యస్మాదముష్మింస్తవే" అనిభగవత్పాదులవారు అద్వైతమందు శాస్త్ర తాత్పర్యమునుచెప్పిరి. ఈ సర్వాత్మ భావస్థితి జ్ఞానముచేతనే కలుగునుకానివేరు సాధనం లేదని కూడా చాలాపూర్లు చెప్పినవిషయమే. గ్రంథములవలన తెలుగు టీకా తాత్పర్య వివరణములవలన మనం స్వయముగా కొన్నివిషయములను గ్రహించ గలిగినను, సందేహములేకుండా పొరపాటులేకుండా తెలియు వలేనంటే వేదాంతవిద్యను బాగుగా నభ్యసించినపండితులవద్ద అప్పుడప్పుడు వినుట చాలా అవసరము. అటులచేసినయెడల గ్రంథములను చూచినను చాలా బాగుగా నిస్సందేహముగా సిద్ధాన్తం తెలిసికొనవచ్చును.

శ్లో ॥ నహిప్రపంచో నచభూత జాతం నచేంద్రియం
ప్రాణగణో నదేహః ।
నబుద్ధిచిత్తం నమనో నకర్తా బ్రహ్మైవసత్యం
పరమార్థరూపం ॥

అని స్వాత్మప్రకాశికయందు శంకర భగవత్పాదులవారు చెప్పిరి.

ప్రధానంగా అద్వితీయమగు బ్రహ్మ విచారముచేయువారు ఆరోపమును నిషేధించుచు అధిష్ఠానమగు ఆత్మను తెలుసుకొనవల యును, గనుక ప్రపంచము ఆత్మకంటే వేరుగాలేదు, భూతములేమియు లేవు, ఇంద్రియములులేవు, ప్రాణములేదు, దేహములేదు. వృత్తిభేదము చేత అంతఃకరణయే మనస్సనియు, బుద్ధియనియు, అహంకారమనియు, చిత్తమనియు నాల్గువిధములుగా వ్యవహరించబడుచున్నది, గనుక అవి ఏవియులేవు. కర్తయని, భోక్తయని, వ్యవహరింపబడుచున్న జీవుడుకూడా లేడు. అంతయు పరమాత్మయే అనగా బ్రహ్మయేయని. అదియే పరమార్థ మని, అదియేనేనని తెలుసుకొని కృతకృత్యులు కావలయునని తాత్పర్యము

**ఈ క్రిందిశ్లోకమును ముఖ్యముగా విచారింపవలయును.**

శ్లో॥ చిదమృతసుఖరాశౌ చిత్తఫేనంవిలీనం క్షయమధి
గతరూపోవృత్తిచంచత్తరంగః।
స్తిమితసుఖసముద్రో నిర్విచేష్టస్సపూర్ణః। కథమిహమమ
దుఃఖం సర్వదైకో ఽహమస్మి॥

అని శంకర భగవత్పాదులవారు స్వాత్మప్రకాశకయందేచెప్పిరి. (ఆత్మవేత్త అనుభూతి) నేను,స్వప్రకాశానందస్వరూపుడను,అట్టి ఆనంద సముద్రరూప మగు నాయందు జ్ఞానముచేత మనస్సు అనే నురుగు అణగిపోయినది. అంతఃకరణవృత్తులు అనేకములుగానున్నవి అవి సముద్రతరంగములవలె ఆందోళనచేయుచు, నిశ్చలస్థితి లేకుండాచేస్తూ వుండేవి జ్ఞానమహిమచేత ఆవృత్తి తరంగములు లయించినవి. తరువాత తరంగాది వికారములులేని పరిపూర్ణ సముద్రమువలె సర్వక్షోభములుపోయి అనగా ఆవరణ విక్షేపరహిత మైన పరిపూర్ణమగు సచ్చిదానందస్వరూపుడనైతిని. అట్టి నాయందు

దుఃఖమేల కలుగునని జ్ఞాని స్వానుభూతిని వెల్లడించుచు పరమానంద స్వరూపముగానుండును.

శ్రీ శంకరాచార్యుల వారు వ్రాసిన వేదాంత స్తోత్రములన్నియు ఉపనిషత్తుల యొక్క అర్థమును బోధించునవే గనుక ఉపనిషత్తులతో సమానమైనవే సందేహములేదు ఈ దక్షిణామూర్తి స్తోత్రమునకు తాత్పర్య వివరణమును వ్రాయుచు వారు చెప్పిన సిద్ధాన్తమును బాగుగా తెలియునటుల ప్రతిపాదన చేయుటకు కొన్ని వచనములను ఉదహరించుచు వారు వ్రాసిన ఇతర స్తోత్రములలోని శ్లోకములను కూడా ఉదహరించితిని.

ముఖ్య విషయం; అజ్ఞానమున్నంతవరకు జీవభావముండును. గనుక జీవభావమున్నంతవరకు కర్మ కూడా ఉండును గనుక పుణ్యజీవులుకూడా పుణ్యలోకములకు వెళ్ళునపుడు మరణకాలమందు.... ఈ స్థూలదేహమును విడిచిపెట్టి లింగదేహోపాధికులై వెళ్ళిపోవలసినదే. పాపజీవుల విషయం చెప్పనే అక్కరలేదు వారిమాటికి నరకలోకమునకు వెళ్ళుట నరకము ననుభవించుట మరల పాపజన్మలెత్తుట తప్పదు బ్రహ్మ సాక్షాత్కారమును పొందిన మహానుభావుడు మాత్రం ఈ దేహమును విడచిపెట్టి లోకాంతరము నకు వెళ్ళుటలేదు. జ్ఞానం కలిగినపుడు అజ్ఞానం పోవును, కర్మలన్నియు జ్ఞానాగ్ని చేత దగ్ధమగును. ప్రారబ్ధమీదేహము పడిపోవునప్పటికి పూర్తిగా నశించి పోవును జీవత్వంపోవును. కర్మరాహిత్యం కలుగును. మెలుకువ వచ్చినపుడు స్వప్నం తనయందు లయించినటుల సర్వప్రపంచము తన యందే లయించును. బ్రహ్మాకారవృత్తికూడా లయించును అద్వితీయమగు సచ్చిదానంద బ్రహ్మరూపుడగును. అట్టి స్థితిలో అన్నిలోకములు తన యందే లయించుచున్నప్పుడు లోకాంతరమునకు దేహమును విడిచిపెట్టి వెళ్ళేదేముండును. సర్వాత్మత్వమే కలుగును.

ఈ విషయమునే "సర్వాత్మాత్వ మహావిభూతి సహితం స్యాదీశ్వరత్వం స్వతస్సిద్ధ్యేత్తత్పునరష్టధాపరిణతం చైశ్వర్యమవ్యాహతం" అని చెప్పిరి. సర్వాత్మాత్వమను, మహావిభూతి గొప్ప ఐశ్వర్యం. పరమాత్మ స్వరూపస్థితి అజ్ఞానం పోగానే ఆవిర్భవించును. ఆస్థితి ఈవిధముగానున్నదని చెప్పుటకు వీలులేదు, అది చెప్పుటకు వీలులేదనే విషయం మౌనవ్యాఖ్యా ప్రకటిత పరబ్రహ్మతత్వం అను శ్లోకము వల్లనే స్పష్టమగుచున్నది, సర్వజ్ఞులగు మహానుభావులందరు ఈ సర్వాత్మ భావమును గురించియు ఈ తత్వశాస్త్రమును గ్రహించుచు చాలా ఆశ్చర్యపడినట్లు తెలియుచున్నది.

ఆత్మసాక్షాత్కారము కలిగిన మహానుభావుడు ఈవిధముగా అనుకొంటాడు.

దేహాభిమానులు వేదములను శాస్త్రములను చదువుదురుగాక అనేక కర్మలను చేయుదురుగాక నాకేమి అవసరంలేదు. నాకు లౌకిక వ్యాపారములుగాని వైదిక కర్మలుగాని ఏమియులేవు. అంతయు నేనే గనుక నేనేమి చేయనవసరంలేదు, కృతకృత్యుడనే చేయనక్కరలేదనే స్థితికూడా అనవసరమే వాక్కు వేదశాస్త్రములను పఠించుగాక, మనస్సు శ్రీమహావిష్ణువును గాని ఇతర దేవతలనుగాని ధ్యానించుగాక. లేక బ్రహ్మానందమందు నిమగ్నమగుగాక. నేను సాక్షిరూపుడను విధినిషేధములు లేవు. అతీతుడను. అయినను లోకసంగ్రహము కొరకు అనగా గొప్పవారు యెటుల ప్రవర్తించుదురో ఇతరులు కూడా అటులనే ప్రవర్తింతురు గనుక సామాన్య మనుష్యులనుకూడా మంచిమార్గమందు ప్రవర్తింపచేయుటకు శాస్త్రోక్తమార్గమందే ప్రవర్తిస్తాను. శరీరేంద్రియములు సదాచారమందున్నటుల లోకమునకు చూపించెదను. నాకేమి సంబంధంలేదు. నేను బ్రహ్మ

నంచ స్వరూపుదనేసని సర్వాత్మభావములో నున్న మహానుభావుడు అనుకుంటాడు.

శ్రీవిద్యారణ్య స్వాములవారు నాల్గువేదములకు భాష్యములను వ్రాసి వారు పరమహంసాశ్రమమును స్వీకరించి శ్రీశంకర భగవత్పాదులవారు స్థాపించిన శ్రీశృంగేరీ మహాపీఠమందు పీఠాధిపతులుగానుండి అనేక దుర్మతములను ఖండించి అద్వైత సిద్ధాంతమును బలపరచి సంప్రదాయమును అభివృద్ధిచేసిరి, అట్టి విద్యారణ్య స్వాములవారు వారు రచించిన పంచదశీ గ్రంథమందు బ్రహ్మవేత్త అనుభవమును, స్థితిని ఈవిధముగా చెప్పిరి.

శ్లో॥ ధన్యోఽహంధన్యోఽ హం నిత్యం స్వాత్మాన
మంజసావేద్మి।
ధన్యోఽహంధన్యోఽహం బ్రహ్మానందో
విభాతి మేస్పష్టం॥
ధన్యోఽహం ధన్యోహందుఃఖం సాంసారికం
నవీక్షేఽద్య।
ధన్యోఽ హం ధన్యోఽహం స్వస్యాజ్ఞానం
పలాయితం క్వాపి॥

శ్లో॥ ధన్యోఽహం ధన్యోఽహం కర్తవ్యం మేన
విద్యతే కించిత్।
ధన్యోఽహం ధన్యోఽహం ప్రాప్తవ్యం
సర్వ మద్య సంపన్నం॥

శ్లో॥ ధన్యోఽహం ధన్యోఽహం తృప్తేర్మే
కోపమా భవేల్లోకే।

ధన్యోఽహం ధన్యోఽహం ధన్యోధన్యః
పునః పునర్ధన్యః॥

శ్లో॥ అహోపుణ్య మహోపుణ్యం ఫలితం ఫలితం దృఢం।
అహోపుణ్య స్యసంపత్తే రహోవయ మహోవయం॥

శ్లో॥ అహోశాస్త్ర మహోశాస్త్ర మహోగురురహో గురుః।
అహోజ్ఞాన మహోజ్ఞాన మహోసుఖ మహోసుఖం॥

ఆత్మసాక్షాత్కారము కలిగినతరువాత నేను చాలా ధన్యుడను, ధన్యుడను. ఎల్లపుడు నాపారమార్థికమగు సచ్చిదానందమగు పరమాత్మను బాగుగా తెలుసుకొనుచున్నాను. నేను మాటికి ముమ్మాటికి ధన్యుడను. చాలా పర్యాయములు ధన్యుడనని అన్నందువలన (ఆదరముగా చెప్పినట్లు) చెప్పుటకు వీలులేని లోకాతీతమగు ధన్యత్వమును పొంది. అతీతమగు పరమానందమును పొంది, అవధిలేని తన ఆనందస్థితిని లోకమునకు తెలియచేయుచున్నాడని యర్థము.

ఇంకా ఎంతధన్యుడను నాకు సంసారబంధమైన దుఃఖము లేశము కూడా గోచరించటలేదు. ఎంత ధన్యుడను నాయాత్మను నాకు తెలియకుండా ఆవరించిన అజ్ఞాన మెట్లా పోయెను. నేను జీవుడననే భ్రాంతియు, ప్రపంచ మన్నే భ్రాంతియు, ద్వైతదృష్టియు అంతయు యెట్లుపోయెను. నేను మహా ధన్యుడను. నేను చేయవలసినదేమియు గోచరించుటలేదు. నేను చాలాధన్యుడను పొందతగినది అంతయు లభించినది, నేను చాలా ధన్యుడను నాకు

కలిగిన తృప్తికి అవధిలేదు. ఈ విధంగా నున్నదని చెప్పుటకు ఉపమానం లేదు. అనగా పోల్చతగినదిలేదు. నేను ధన్యుడను మరీ మరీ ధన్యుడను.

ఆశ్చర్యం నాపుణ్యమునకు అవధిలేదు. యెంతపుణ్యమో చెప్పజాలను. అనంత జన్మలనుండి చేసిన మహాపుణ్యం నేటికి ఫలించింది. చాలాబాగా ఫలించింది. యింత మహాపుణ్య సంపత్తు కలవాళ్ళము మేమే మేమే. చాలా ఆశ్చర్యమైన స్థితిమాది. ఈ అద్వైత వేదాన్తశాస్త్ర మెంత ఆశ్చర్యకరమైనది. చాలా ఆశ్చర్యమును కలిగించినది. శాస్త్రము చాలా ఆశ్చర్యకరమైనదే. ఆ శాస్త్రమునుచెప్పే గురువుకూడా చాలా ఆశ్చర్యకరమైనవాడే. ఆధ్యాత్మిక బ్రహ్మవిద్యను చెప్పువారు అనగా అవాఙ్మానసగోచరమగు పరబ్రహ్మతత్వమును ప్రబోధించు గురువు చాలా దుర్లభుడని యర్థము. ఆశ్చర్యం ఈ బ్రహ్మసాక్షాత్కారమనే జ్ఞానం చాలా ఆశ్చర్యకరముగా నున్నది.

అతి దీర్ఘనిద్రలో అతిదీర్ఘస్వప్నము ననుభవించి బాగా మెళుకువ వచ్చిన తరువాత నిద్రస్వప్నములుపోయి స్వస్థితినిపొందినవాని స్థితివలె యున్నది. తెలుసుకొనుటకు సౌకర్యముగా చెప్పితినిగాని ఆత్మానుభూతి స్థితికి పోలికయేలేదు.

నా స్వరూపముగానున్న సుఖం అనగా ఆనందం అవధిలేకుండా నున్నది ఆశ్చర్యముగానున్నది. నా స్వరూపానందం అనుభవరూపముగా నున్నదియని జీవన్ముక్తులు వారి సర్వాత్మత్వమహావిభూతిని లోకమునకు వెలిబుచ్చుచుందురు. ఈ స్థితినే సాక్షాత్తు పరశివావతారమైన శ్రీ శంకర భగవత్పాదులవారు సర్వాత్మత్వమహావిభూతిసహితం స్యాదీశ్వరత్వం స్వతస్సిద్ధ్యేత్ అని చెప్పిరి. ఈ స్థితి కలుగవలయునంటే సర్వాత్మత్వ మితి

స్ఫుటీకృతమిదం యస్మాదముష్మిం స్తవే. తేనాస్య శ్రవణాత్త దర్థమననాత్ ధ్యానాచ్చసంకీర్తనాత్. అని చెప్పినప్రకారం ఈ స్తోత్రంలో చెప్పిన సర్వాత్మత్వమును సంప్రదాయానుసారముగా విచారించి అనగా శ్రవణ మనన నిదిధ్యాసనలుచేసి ఆత్మసాక్షాత్కారమునుపొంది మూలాజ్ఞానమును, జీవత్వభ్రాంతిని, ప్రపంచభ్రాంతిని(వదలి)నివృత్తిచేసుకొని కృతకృత్యులై, సర్వాత్మభావమును స్వస్వరూపస్థితిలో నుండవలయునని పరమతాత్పర్యం

"శ్రీ దక్షిణామూర్తిస్తోత్రం సమాప్తం."

శంకరాచార్య విరచిత శ్రీ దక్షిణామూర్తిస్తోత్రమునకు మద్దులపల్లి మాణిక్యశాస్త్రిచే రచించబడిన తత్త్వరహస్యప్రభయను తెలుగు టీకా తాత్పర్య వివరణం సమాప్తం.